UNIVERSAL
LIBRARY
OU_204291
UNIVERSAL
LIBRARY

# రామదాసు

ఇయ్యది

శతాధిక గ్రంథకర్తలగు,

## రామనారాయణకవులచే

రచింపఁబడినది.

ప్రకాశకుఁడు

## కురుకూరి సుబ్బారావు

బుక్ సెల్లర్ అండ్ పబ్లిషర్,

భీమడోలు అండ్ బెజవాడ, (కృష్ణాజిల్లా.)

ఐదవ కూర్పు 1000 ప్రతులు.

తెనాలి

భారతీ ముద్రాక్షరశాలయందు

ముద్రితము.

1929.

Rights Reserved.] రు 1—0—0

# పీఠిక

ఈ భద్రాచల రామదాసు చరిత్రము ననేక గ్రంథకర్తలు నాటకరూపమున రచించిరి. కాని యీ నాటకమునందలి విశేష మేమనిన, భద్రాచలముననే జన్మించి, భద్రాచలమే వాసస్థానముఁ గాగల శ్రీయుత సోమరాజు రామానుజరావుపంతులుగా రీనాటకముం బరిష్కరించి, తానీషా రామదాసుల పూర్వజన్మ వృత్తాంతములు గల రంగమును, రామదాసునకు శ్రీరామచంద్రుఁడు మహిమాకారమున దర్శన మిచ్చిన రంగమును వ్రాసియిచ్చి తుదకు తాము రచించిన కీర్తనలం జేర్చి నాటకమునకు వన్నె దెచ్చిరి. గుణాగుణ విమర్శనము పాఠకులకు వదలివేయుచున్నాము.

ప్రకాశకుఁడు.



# ఇందలి పాత్రలు

ఇన్ని పాత్రలున్నను 12 మందితో ప్రదర్శింపవచ్చును.

### పురుషులు.

గోపన్న:-అను నామాంతరముగల రామదాసు.
తానీషా;-గోలకొండ నవాబు.

| | |
|---|---|
| అక్కన్న<br>మాదన్న | తానీషాకడ బ్రాహ్మణమంత్రులు.<br>గోపన్న మేనమామలు. |

కబీరు:-ఒక తురుష్క భక్తశిఖామణి
శివానందుడు;-తానీషా పూర్వజన్మము.
దేవలుడు:-గోపన్న పూర్వజన్మము
శంకరుడు.
ఒక వృద్ధబ్రాహ్మణుడు;-(విష్ణువు)

| | |
|---|---|
| రాముడు<br>లక్ష్మణుడు | భగవదవతారములు |
| గోపాలదాసు<br>మాధవశర్మ | గోపన్న బాల్య మిత్రులు |
| సోమయాజులు<br>దీక్షితులు | భద్రాద్రిపౌరులు |

ముకుందరావు;-తహసీల్ గుమాస్తా.

| | |
|---|---|
| భద్రారెడ్డి<br>బాపినీడు | రెడ్లు |

పరమాత్ముడు;గోపన్న హితచింతకుడు.

| | |
|---|---|
| యాకూబ్<br>హుస్సేన్<br>జాఫర్ | తానీషా పరిజనులు |

భటుడు;-కారాగృహ భటుడు.
హార్కారులు;-రామదాసును బంధించినవారు

### స్త్రీలు.

సీతాదేవి:-శ్రీరాముని సతి.
సుశీల;-గోపన్నగారిభార్య.
తానీషాభార్య.



శ్రీ

# రామదాసు

## ప్రథమాంకము.

---

### పూర్వరంగము.

ప్రవేశము:—సహ్యాద్రియందొక శివాలయము.

(ప్రవేశము:—శివానందుఁడను మహర్షియు ప్రక్కన దేవలుఁడను శిష్యుఁడు.)

(శివానందుఁడు శివపూజ చేయుచుండ శిష్యుఁడు నివేదన మమర్చుచుండును.)

శివా— నాయిక—త్రిశ్రగతి.

హరహర గంగాధర। పురహర భవహర హర శంభో ॥హ॥
గిరినిలయా పరమేశ్వర। గిరిజార్ధాంగానుషంగ॥ ॥హ॥
నిను ననేక హాయనములు। మనమున మననము జేసితి
ఘనముగ బూజించితి నీ। కరుణ గలుగదా శశిధర ॥హ॥

శంకరా! భక్తవశంకరా! సమస్త భువనశుభంకరా! దుష్టదానవానీకభయంకర! ఎన్ని దినములింక నీపూజలు గావింతును! ఎంతని వేడుకొందును! నీ హృదయంబు ద్రవింపఁజేయు నాకేది మార్గము? అగ్నిమధ్యమునఁ జలమధ్యమునున, వాయుభక్షకుం

డనై కాలంబు గడుపుచు హృదయపీఠమున భక్తిసూత్రమ
నిన్ను బంధించి—ప్రేమించి. పూజించి, ధ్యానించి, పా
లంబడి, జాలిగదుర వేడి పాడి కొనియాడినను శిలామయుం
చలింపకున్నావే !

సీ. ధనములిమ్మని నిను దరిని జేరుదునన్న
నాదిమభిక్షుకుం డగుదు వీవు
కంఠాభరణములం గాంక్షింతునన్నం గా
లాహియే నీ సువర్ణాభరణము
నన్ను చల్లనిచూపునం జూతువనుకొన్న
దగ్ధంబుజేయు నేత్రంబు నీది
నిలువ నాకించుక నీడ నిచ్చెదవన్న
కటిక శ్మశానంబు కాపురంబు
వమికోరెదనని దాంగి తిన్ని నాళ్ళు
శంకరా! కోర నెట్టిసౌఖ్యములు నిన్ను
వలచినాండను నీ పాదపద్మసేవ!
వేగం గాన్పింపవే! నాకు విశ్వనాథ.

ఓ యాశ్రితవత్సల! నీవు భక్తసులభుండవని మునులు వేమా
తింప నాలకించి నిజమనినమ్మి నీపాదసేవ కాశించి వు
నీమదిని రంజింపంజేయుగోరి యిప్పటి కొకటివినా సహ
టంబుల క్షీరాభిషేకం బొనరించితిని. నేండా ఘట
టియు నీవు దర్శనం బిచ్చెదవేని యానందంబున న
ఇంక నీ ప్రతిరూపం బగు నీశిలారూపంబును బూ
నీ నిజరూపంబు నభిషేకింపం దలంచితి. దేవా!
భక్తినీయందు నాహృదయంబున లగ్నంబుంజేసి
బాచరింతును.—రక్షించెదవా! నీవు భగవంతుండః
నీవు కేవల కృపాభిమానంబున మునులు సృష్టించి

భూతంబవు—నీ భక్తవాత్సల్యంబు నేఁడు ప్రదర్శింపుము. నేనిదె ధ్యాన సమాధిం దవిలెద. (తపంబునం దుండును.)

దేవ—అయ్యారే! ఈ మహాత్ముఁడగు శివానందమహర్షి యెట్టితపంబుగావించినాఁడు! శివబ్రహ్మం బీయన కింకనుఁ బ్రసన్నుండు కాఁడయ్యెనే! నేఁటితో సహస్రఘటాభిషేకంబు పూర్తినందును. ఈయన ధ్యానసమాధినుంచి లేచునప్పటి కీభగవన్నివేదనమును సిద్ధపరచెదను.

[ విష్ణుమూర్తి శుష్కాంగుఁడగు వృద్ధుని రూపమునఁ బ్రవేశించును. ]

అనుబంధము 1.

వృద్ధు—(కంపితస్వరముతో) అయ్యా! ఎవరువారు? మహాత్ములవలె నున్నవారు. ఒక్కకబళ మన్నమునిడి నాప్రాణములు నిలుప వేఁడుచున్నాను.

దేవ—ఓయీ! ఇది శివాలయము. ఇది ధర్మసత్రముగాదు. ఇంకొక చోటికిఁ బొమ్ము.

వృద్ధు—అయ్యో! మిగుల వృద్ధుఁడగదా! ఆకలిచే మూఁడునాళ్ళ నుండియు బడలియున్నాను. ప్రాణములు శోషిల్లుచున్నవి.

దేవ—ఓవృద్ధబ్రాహ్మణుఁడా! అట్లయిన కొంచెము తాళుము— భగవన్నివేదనమైన పిదప నిన్ను సత్కరించెదను.

వృద్ధు—అయ్యయ్యో! ఈలోపల నాప్రాణములు పోవుచున్నట్లున్నవే!

దేవ—ఐన నేనేమి చేయుదును. భగవంతునికన్న నీవధికమా యేమి?

వృద్ధు—నాయనా! కడుపార నొక్కముద్దఁబెట్టిన భగవంతుఁడు సంతసించుఁగదా?

దేవ—నీ వున్మత్తునివలె నున్నావే!—భగవన్నివేదనము కాలేదనిఁ మరల మాటాడెదవేమి? ఇన్నిదినము లన్నములేక బ్రదికినవాఁడ వింతలో చచ్చెదవా?

వృద్ధు—(క్రిందఁబడి) అయ్యయ్యో! నాకు శోష వొడముచున్నది. నాప్రాణములింక నిలుచునట్లులేవు. ఓ బ్రాహ్మణుఁడా! రాశె డన్నమును ముందుంచుకొని ఆకలిచేఁ బ్రాణములు విడువ సిద్ధముగనున్న బ్రాహ్మణునకుఁ బిడికెడన్నమిడక, నూరక కాలయాపనము చేయుచుంటివా? శివార్చనము చేయుచుఁ పెద్ద ఋషివలె నున్నావే! నీకింతమాత్రమైన జ్ఞానము నీశ్వరుఁడు ప్రసాదింపక పోయెనా? అయ్యయ్యో! త్రాటియాకుల మంట వలె నాగర్భకోశము నాఁకలి కార్చివచ్చయి మంటఁబెట్టు చున్నది. ఈశ్వరా! కడులోభియగు నీపాపునికడ నన్ను జార నైచి కంటికింపగు కడివెడన్నము నెదుట నుంచియు నన్నాఁ కలితోఁ జంపనెంచితివా? అయ్యా! నీకుఁ గడు పుణ్యముం డును. నా యాఁకలిఁదీర్పుము. నాకింత యన్నముఁ బెట్టుము. అబ్బబ్బ! క్షుద్బాధ—క్షుద్బాధ—ఉస్! ఏమి చేయుదును. నాప్రాణములు పోవుచున్నవి.

దేవ—(తనలో) అయ్యయ్యో! ఏమిది? నిష్కారణముగ బ్రాహ్మ ణుఁడు ప్రాణములు విడుచుచున్నట్లున్నాఁడే! ఈశ్వర నివేద నంబుగాక నేనెట్లితని కాహారమీయ నేర్తును? ఓహరుఁడా! నీవు నన్నకారణముగ నిందించుచున్నావు.

గీ. ఈమహర్షి శివానందుఁ డీశ్వరునకు
సేవఁజేసి కైవల్యంబుఁ జెందఁగోరె
నాతఁ డలిగిన ఘోరశాపాగ్నికీల
లందు మనమిద్దఱము భస్మ మౌదుమయ్య.

కావున నీశ్వరనివేదనం బగునంతదనుక నీవు శాంతింపుము, భగవత్ప్ర సాదంబు లభింపఁగలదు.

వృద్ధు—(కోపముతో) ఓరీ దుష్టుఁడా! ఏమంటివిరా! నీ యీశ్వర

నివేదనంబగునంతదనుక నే నాఁగవలయునా? ఈలోన నేఁ జచ్చిన నాశవమునోట నీయన్నంబుఁ గూర నెంచితివా! నీజ్ఞాన మేల కాల్పనా! నా కడుపుమంట నీమాటలచేఁ జల్లారునా? ఛీ! నిన్నుఁ బ్రార్థించుటకన్న మౌఢ్యము వేరులేదు. నేనే నాయాకలిఁ జల్లార్చుకొందును. నా ప్రాణములు పోవు నవస్థ వచ్చినప్పు డింకను నీ యానతికై వేచియుందునా?

అనుబంధము 2.

(బలవంతముగ భుజింపఁబోవును.)

వ—ఆ! ఆ! ఓరిదుష్టబ్రాహ్మణశవమా! భగవద్దూషణంబు సల్పిన నోర్కి తెగ నాక, నీ యత్యాచారమును సైరింతునా! ఆ ప్రసాదము ను ముట్టితివా చచ్చెదవు.

వృద్ధు—పో! పో! ఆఁకలితో నున్నప్పు డన్నము తినినఁ జచ్చెదనా! ఎంతవెఱ్ఱివాఁడవు. (తినుచుండును)

వ—(కోపముతో)

పాపపుబుద్ధి నోరి తులువా! పరమేశ్వరదత్తదేవ నే
వాపరతంత్రమైన యుపహారమునందు దురాశనంది, నా
నాపరిభావలాడి యశనంబు కళంకము సేయనున్న ము
క్కోఁపిని నిగ్రహారములకుం గురిగా నొనరింప జేసెదన్.

(బెత్తముసఁ గొట్టుచున్నాఁడు.)

వృద్ధు—(బాధనంది) హా! దుష్టా! దురాత్మా! నన్నెట్లు ప్రహరించితి విరా పాపీ! సాధువులం దీశ్వరుఁడుండునని యెఱుఁగని మందమతీ! నన్ను ప్రహరించినందుల కీజన్మమునఁ గాకున్నను పై జన్మముననైన నీవిశిక్ష ననుభవింపక పోవుదువా! నా క్షోభ నిన్నింతతో విడచునా? నా శరీరమునందలి దద్దులు నీశరీరము నందోఁప నేనఱచినట్లఱవక పోవుదువా?

ఉ. సాధులదారిఁ గానక నసాధుగతిం బహుళప్రమత్త కో
పాధికవృత్తిఁ గూటికొఱకైనను గాటికి చేరువైన, తు
ద్బాధితునిం బ్రహారముల పాలొనరించితివే దురాత్మ! నా
బాధ భవిష్యజన్మమునఁ బాయక నిన్నలయించుఁ గావుతన్.

(అని విషర్జించును.)

దేవ—(తెల్లపోయి) హా! హా! ఏమి యీ దురాలాపములు! నా శ్రవణములెట్టి శాపవాక్యముల నాలకించినవి! కటకటా! నాకెట్టి దుర్గతులు కలుగనున్నవో కదా! అమ్మహాత్ముఁ డెవ్వఁడో నన్నుపరీక్షసేయ నేతెంచిన పరమేశ్వరుఁడై యుండును. వేగంబుగ నరిగి యాతనిం బ్రసన్నునిఁ జేసికొనిమరలఁగొని తెచ్చెదఁగాక

(నిష్క్రమించును.

శివా—(కన్నులు తెఱచి) హరహరా! నీకింకనుఁ గృపరాలేదా ?

ఉ. ఎంతతపంబు జేసితి భజించితిఁ బూజ్యుల పూజచేసి నా
స్వాంతమునందు భక్తి ననిశంబు నిబద్ధుని జేసినాను నీ
వెంతయు భక్తివత్సలుఁడ వీశుఁడవే యనుకొంటిఁ గాని నీ
వింత శిలామయుండవని యే నెఱుఁగన్; గడు మోసపోయితిన్.

ఎన్నిదినంబు లెంత వెంగిలినై దురాసనంది నిరాసచెందితిని! ఛీ! నీ భగవంతుఁడవు! నీవు భగవంతుఁడవేయైన నా యాశ వీసరఁ జెందునా! ప్రయత్నము భగ్నమగునా? నాపూజ వ్యాజలగునా ? నాభక్తి నురుక్తియగునా? ఈశ్వరుఁడు లేఁడు. ఇది సిద్ధాంతము.

గీ. శవమునకు వందనంబులు సలిపినట్లు
శిలను శివుఁ డంచు మిగులఁ బూజించినాఁడ
ఈశ్వరుఁ డొకండు లేఁడు మహీతలమున
వెకలులై భక్తులగువారు వెర్రివారు.

శిలలు-విగ్రహములు-దేవాలయములు-జపములు-తపములు-పూజలు-పునస్కారములు-అన్నియు నసంబద్ధములు. జగద్వంచకుల కివి నిర్మింపఁబడియె. దేవుఁడు లేఁడు—దయ్యము లేఁడు - ఓరీ! ఈశ్వరా! నీవు మాయావులచేఁ గల్పితమైన పాపపూరిత వ్యక్తివి! కానిచో-నిన్ను నాకన్నఁ గొలిచి సేవించినవాఁడెవ్వఁడు? నాభక్తికి వశముగాని నీవు దేవుఁడవై నిజముగ నున్నను నాకు నీలెక్క-యేమి?

సీ. అతి భక్తిపారవశ్యమున నీపై దండ
కములు బాడిన మది గరుఁగదయ్యె
శ్రమఁజెంది వివిధపుష్పములు గడించి నిన్
బూజింప నవియెల్ల బుగ్గియయ్యె
క్షీరాభిషేకంబు జేసి సేవించిన
బూదిని పన్నీటివోలె నయ్యె
మహితోపహార సమర్పణంబుననైన
నీదర్శనంబు గాన్పింపదయ్యె

గీ. సాంబుఁడవుగావు నీవొక డాంబికుఁడవు
శంభుఁడవుగావు రా పాపసంభవుఁడవు
ఈశ్వరుఁడ వీవుగావు భూతేశ్వరుఁడవు
శంకరుండవుగావు నాశంకరుఁడవు.

ఛీ! ఇంక నిన్నుఁ దలంపఁగూడదు. నీతోడ నాకేమి పని?

(దేవలుఁడు ప్రవేశించును.)

దేవ—(తనలో) కటకటా!

గీ. తనకు నుపహారములను సిద్ధంబుసేయు
నన్ను బరీక్షింప నేతెంచినాఁడతండు

కరుణఁజూచిన జగదీశుఁ గాంచలేక
బాధసల్పితి నా బుద్ధి పాడుగాను.

గురునితో మనవిఁజేసెదను. (దగ్గరకుఁబోయి) మహాత్మా ! శివానంద మునీంద్రా! ఎంతయు మోసము ఘటిల్లినది. నేను భగవదప చారంబు సల్పి పాపం బొడిగట్టుకొంటిని.

శివా—దేవలా! నీకింకను భగవంతునియెడ పిచ్చి వదలలేదా ? ఐన నీకేమైనది?

దేవ—అయ్యా! ఏమని మనవిచేయుదును ! నేనీశ్వర నివేదనంబునకై నేఁడీ యుపహారంబులను సిద్ధముచేయుచున్నతఱి క్షుద్బాధచే నలసిన వృద్ధుని రూపంబున నా పరమేశ్వరుఁ డిందువచ్చె; నే నాతనిం బ్రహరించి పంప నీశిక్షే నీకుత్తర జన్మంబున నగునని శపించి యదృశ్యుఁడయ్యె.

శివా—(నవ్వి) వెఱ్ఱివాఁడా! ఇదియా నీ చింతకు హేతువు? చాలు— నీపరమేశ్వరభ్రమ! వానిం గొట్టి మంచిపనిజేసితివి ! కొట్టుట తోఁ బోనిచ్చితివా ? తలఁదఱుగవలసియుండెను.

దేవ—(తెల్లబోయి) మహాత్మా! ఏమిది? విపరీతముగ సెలవిచ్చితిరి ?

శివా—విపరీతమేమి? పరమేశ్వరుండనువాఁ డొకండు గలఁడని నీవిం కను వెఱ్ఱిభ్రాంతిఁ బెట్టుకొని యుంటివా! ఈశ్వరుఁ డెందును లేఁడు.

శా. ఏడీ! కన్పడఁడేమి కన్నులకు నాయీశుండొకండున్న వాఁ
డేఁడీ యెందునశించె? భక్తులకుఁగాఁడే వాఁడు ప్రత్యక్షమున్
లేఁడా కల్పితపూరుషుండు మొగలాలింపండు రక్షింపఁ డీ
యేడాగోడపు రాతిబొమ్మకయి కాదే! నే శ్రమం బొందితిన్.

ఈ యుపహారంబు వానికై సిద్ధముచేసితివా ? ఛీ!ఛీ! నాకన్నులకిది కలుషపదార్థంబుగఁ గాన్పించుచున్నది. (కాలితోఁదన్నును.)

దేవ—అయ్యయ్యో! ఏమిది మహాత్మా! మిగుల నపచారంబునల్పు
చున్నవారు. ఇంకొకక్షీరఘటంబు క్షీరంబుతో నభిషేకించిన
నాదేవుఁడు ప్రసన్నుఁడగును గదా! ఎందుల కీతొందఱపాటు.

శివా—ఏమీ! ఇంకను తొందరపాటనుచుంటివా?

సీ. ఉపహారముల ద్రోసి యుపవాసములు జేసి
జీర్ణించి నేను శుష్కింపలేదె?
పంచాగ్నులందుఁ దీవ్రతపంబు గావించి
భీమవ్రతము గావింపలేదె?
ధృతిన హోరాత్రంబు లీనల్లరాతికి
చేతులారఁగ బూజ సేయలేదె?
బలవంతముగఁ గంఠ మెలుగురాచిన జగ
దీశా! యటంచు నుతింపలేదె?

గీ. ఎట్టిలోపంబుఁ జేసితి నితనిసేవ
నితఁడె నిజముగు దైవంబ యేని నేఁడు
నాకు గాన్పింప కీయభిషేకమునకె
వేచియున్నాఁడె నీ కిది వెర్రిగాక.

ఈఘటంబుతోడ వీని నభిషేకించు టేఁక నెఱక్షీడివి? దీని నీలింగమ్ముఁ
బగులఁగొట్టి నాదారి నేను జూచుకొందును.

[క్షీరఘటంబును శివలింగముపైఁ బగులఁగొట్ట లింగము
బ్రద్దలై శంకరుఁడు ప్రత్యక్షమగును.]

శంక—ఓరి మూఢా! శివానంద! తాలిమిలేని దురహంకారి వగ
నిన్నుఁ బరీక్షింపఁదలంచిన నేనే యీశ్వరుఁడను—ఇంక నీ
కీజన్మంబున ముక్తిదొరకదు. ఈపాపంబునకై నీవు మ్లేచ్ఛజన్మ
ముం గాంతువుగాక!—నీశిష్యుం డగు దేవలుండును తన్ను

బరీక్షింప వచ్చిన శ్రీమహావిష్ణువు నెఱుంగలేక ప్రహరించెను. అందులకై పునర్జన్మంబునఁ దీవ్రంబుగ ప్రహరింపబడఁగలఁడు

శివా—(విభ్రాంతినంది) అకటకటా! ఎంతమూఢుండనై పరమేశ్వరు నెఱుంకలేకపోయితిని! (చేతులు జోడించి)

దండకము.

ఓదేవదేవా! మహాదేవ! కైలాసవాసా!—యజాండాఖిలేశా!—సమస్తారినాశా! భవద్దివ్యమహాత్మ్యము న్నీమహాత్తత్త్వవిజ్ఞానముం బొందఁగా నెంతవాఁడ గృపాపూర్ణభావంబునన్ గాచి రక్షింపుమా! నిస్సహాయుండ దీనుండ నజ్ఞానమోహాంధకారంబునం గన్నుఁ గానంగలేకిట్లు దూషించి నాశంబు నేఁగంటి నీవంటి యీశుం డధీశుండు. నావంటి పాపాత్మదోషంబులన్ సైచికాపాడఁగానొప్పుగాదే యుమానాధ! పాపాత్ముఁడన్ గోపుఁడన్, దుష్టుఁడంగష్టుఁడన్నైను, నాయందునం డిందు మూఢత్వముంబాపి నీరూపముం జూపినా వింకనే ధన్యుఁడైతిన్ మహాత్మా! దయంగావరమ్మా! భవచ్ఛాపముం బాపి కారుణ్యముంజూపి రక్షింపుమయ్యా! సురబ్రహ్మాదినీయుత్తమాంగాయుమార్ధామలాంగా!—యపాంగా! శుభాంగా! నమస్తే నమస్తే నమః. దేవ—దేవా! కృపాభావా!—

గీ. ఇంతవఱకును జన్మ లనేకములుగఁ
గాంచి యిఁకముందు నాకట్లు గలుగదంచు
సంతసించిన నిది యిట్లు సంభవించె
నెట్టులో మిమ్ముల ననుగ్రహింపు మయ్య.

శంక—శివానందదేవలుఁలారా! మహాభక్తులరగు మీకుఁ గల్గిన యీ ప్రాప్తికి నాకు మిగుల విచారముగ నున్నది. భావిజన్మంబు మీకుఁ దప్పనేరదు. అప్పుడు మీకు భగవత్కటాక్షము గలు

గును. శివానందుఁడే తానీపాగను, దేవలుఁడు గోపన్న యను రామదాసుగను జన్మింతురు. ఇంక మీార లరుగుఁడు.

(శంకరుఁడు తిరోహితుఁడగును.)

(తెర వ్రాలును.)

## ౭ ం గ ము.

[గొండపల్లియందు రామభజనమందిరసమీాపమున, గోపాలదాసు మాధవశర్మ ప్రవేశించుచున్నారు.]

గోపా—మిత్రమా! మన గోపన్న భక్తి నానాటికి హెచ్చుచున్నది. లోకమంతయు రామమయమే యని భావించుచు సర్వమును, మఱచియున్నాఁడు. ఈభక్తి యీాతనిని సంసారకార్యములను గూడ మఱపించుచున్నది.

మాధ—గోవిందశాస్త్రీ! అద్వితీయమైన శ్రీరామచింతనామృత పానంబున నానందమందు పరమభక్తులకు సంసారచింతయేల?

తే. గీ. పాపభీకరారణ్యదవానలంబు
భయదసంసారవారాసిభవ్యనౌక
రమ్యమైనట్టి రామమంత్రం బటంచు
జాటఁడే నేఁడు గోపన్న సఖుఁడ! మనకు.

ఈతనిభక్తిచూడఁగా గ్రంథములయందు మనము చదివిన ప్రహ్లాదుని కంటె మించియున్నది.

గోపా—ఏమో నీ వట్లు చెప్పుచుంటివిగాని నాకుమాత్ర మీాతనిభక్తి యం దంత విశ్వాసములేదు. ఏమందువా? ఇప్పుడీతనికి భక్తి యేల? ఇట్టిభక్తుఁడు వివాహము చేసికొననేల? ఈతని తాత తండ్రులు హైదరాబాదుసంస్థానమున గౌరవమైనపదవుల యందుండి మిగుల ఖ్యాతిగడించిరికదా? ఈతఁడుగూడ నట్టి

దానికై యేల ప్రయత్నింపఁడు. ఒకవేళ పూర్వు లార్జించిన ధనమున్నదికదాయని పలుకుదువేమో-అగుఁగాక ! ఏదియేని యున్నతోద్యోగమునకై యీతఁడు ప్రయత్నించినచో గోల్కొండయందు గాకుండునా? చూడు మాతని మేనమామలగు నక్కన్నమాదన్నలు తానీషాకు ముఖ్యమంత్రులై యెట్టి సంపదలతోఁదూఁగుచున్నారో! ఈమధ్య నేనొకసారి గోల్కొండ కేగినప్పుడు వారి వైభవముఁ జూచి యద్భుతమందినాను. అహా! ఏమిభాగ్యము! యేమి ఏనుఁగులు! ఏమిగుఱ్ఱములు ! వారి మందిరముముందెందరు రక్షకభటులు! విద్యావంతుఁడగు మన గోపన్నకూడ వారిప్రాపును బొంది యేదియైన నున్నతోద్యోగముఁ జూచుకొనరాదా ?

మాధ—వెఱ్ఱివాఁడా !

మ. తురగస్యందనమత్తసామజభటస్తోమాదిదివ్యాంబరా
భరణామూల్యసువస్తుసంచయముపైఁ బ్రాంతుల్ దలంపక్ రమే
శ్వరపాదాంబుజచింతనాపర మహాభాగ్యప్రభాశ్రీపరం
పరచే నొప్పెడి పుణ్యశాలికిఁ దృణప్రాయంబు కాదే సఖా.

గోపా—నీకుఁగూడ గోపన్న స్పర్శ తగిలినది. సంసారమునందు నీకుఁ గూడ విరక్తిపుట్టునుగాఁబోలు!

మాధ—గోపన్న కిప్పుడు సంసారముపై విరక్తి యున్నదా?

గోపా—ఇప్పుడు లేదు. ఈవెఱ్ఱిభక్తియిట్లేమనంబునఁగట్టిగ నాటుకొన్నచో నట్లే యగును. కాకున్నచో రాముఁడు భగవంతుఁడని నమ్మి యీతఁడిట్టిభక్తిని బూనినాఁడు. సామాన్యమానవుఁడగు నాతఁడు నారాయణుండని యెట్లు స్థిరపఱుపఁగలము.

గోపన్న—(తొందరగాఁ బ్రవేశించి) గోపాలశాస్త్రీ! ఏమంటివి ?

శ్రీరాముఁ డాదినారాయణుఁ డగుట యెట్లనియా? ఇంకను
నీ కీయజ్ఞానము విడువ లేదుకదా?

సీ. హరుని కోదండంబు నవలీలగాఁ ద్రుంచి
యవనిజన్ బెండ్లాడినందువలన
క్షాత్రకాంతారంబు ఖండించు భూసురు
నాజిలో కోపించినందువలన
ఖరదూషణాదిరక్కసుల నొక్కండె శౌ
ర్యమున గొప్ప దునుమాడినందువలన
బలశాలియైనట్టి వాలిని నొకకోల
నద్భుతంబుగఁ ద్రుంచినందువలన

తే. గీ. నబ్ధిపై సేతు నిర్మించినందువలన
సమరవైరి రావణుఁ గూల్చినందువలన
నాదినారాయణస్వామి యనుట తెలిసె
రమ్యగుణమూర్తి శ్రీరఘురామమూర్తి.

అమ్మహాత్ముని ప్రభావము మనవంటి యల్పజ్ఞానము గలవారు తెలియఁగఁ జాలరు. కావున నీ విటువంటి సంశయంబులను వీడి, భగవంతుఁడు; శరణాగతత్రాణపరాయణుఁడు; భక్తజనసంరక్షణ దీక్షాబద్ధకంకణుఁడు — అగు; ఆ శ్రీరాముని మనసార మన మందఱము గలిసి సంకీర్తనము సేయుదము. (ఎదుటఁజూచి) అరుగో! భజనపరులగు మన సంఘము వారిందాఁక వచ్చుచున్నారు.

[కొందఱు బాలకులు వత్తురు.]

గోప—

నాదనామక్రియ—చాపుతాళము.

శ్రీరామనామము మఱువాం మఱవాం
సిద్ధము యమునకు వెఱవాం వెఱవాం ॥శ్రీ॥

గోవిందు నేవేళ గొలుతాం గొలుతాం ॥
దేవుని గుణములు దలుతాం దలుతాం ॥శ్రీ॥
విష్ణుకథలు చెవుల విందాం విందాం ।
వేరేకథలు చెవుల మందాం మందాం ॥శ్రీ॥
రామదాసులు మాకు సారాం సారాం ।
రామదాసులు మాకు దూరాం దూరాం ॥శ్రీ॥
నారాయణుని మేము నమ్మేం నమ్మేం ।
నరుల నికను మేము నమ్మాం నమ్మాం ॥శ్రీ॥
మాధవనామము మరువాం మరువాం ।
మఱియును బొధకు వెఱవాం వెఱవాం ॥శ్రీ॥
అవనిజపతి సేవ మానాం మానాం ।
మఱియొకజోలంటే మానాం మానాం ॥శ్రీ॥
భద్రగిరీశుని కందాం కందాం ।
భద్రముతో మన ముందా ముందాం ॥శ్రీ॥

(అందఱును గలిసి పాడిరపిమ్మట)

గోప—శ్రీమద్రమారమణ గోవిందోహరి (అందఱునునట్లేయందురు)

(కబీరు ప్రవేశము)

కబీ—(తనలో) అహా! ఈప్రదేశమున శ్రీరామనామామృతము ప్రవహించుచున్నదే. (ఎవటఁజూచి) ఇదుగో! వీరందఱును శ్రీరామభజన సేయుచున్నారు. నేనుగూడ వీరితోడ నీయానందమును బొందెదను.

నవరోజు—అటతాళము.

భజరేమానసరామం ॥భజ॥ భజరేజగదభిరామం ॥భజ॥
కరధృత శరకోదండమ్। కరితుండాయత భుజదండమ్ ॥భజ॥
దాశరథే నరసింహాం ॥భజ॥ దాశరథే నరసింహాం ॥భజ॥

కౌసల్యా బహుభాగ్యం॥భజ॥ కైవల్యాలోచనయోగ్యం ॥భజ॥
అవనతలజభవేంద్రం । అగణితగుణగణసాంద్రం ॥భజ॥
మాయామానవదేహం । మునిమానస రుచిరగేహం ॥భజ॥
రూపమదనశతకోటిం । నతభూపమదనశతకోటిం ॥భజ॥
శ్యామం జలధరశ్యామం । సాంబశివాశ్రిత రామం ॥భజ॥
(గోపన్న మొదలగు వారిని సమీపించుచున్నాఁడు.)

గోప—(కబీరునిఁజూచి) ఆహా! ఈమహానీయుఁ డెవ్వరోకదా? ఈతని తేజ మద్వితీయమై యున్నది. ఆకారముఁజూడఁ దురుష్కునివలె నున్నాఁడు. రామనామచింతనగానంబున మహాహృదయంబుల కహరిమిత్రాహ్లాదంబు గొలిపినాఁడు. ఇట్టి మహాత్ముఁడు మ్లేచ్ఛుఁడైన నేమి!

గోపా—ఈతఁ డెవరో మ్లేచ్ఛుఁడుగా నున్నాఁడు. (కబీరునిఁ జూచి) ఎవరయ్యా స్వామీ! నీవు?

కబీ—నాయనా! శ్రీరామభజనానందపరులకుఁ గులముతో నేమి పనియున్నది?

గోపా—అదియంతా యిప్పుడెందులకు! నీ వెవ్వరవో చెప్పుము. నిన్ను చూచిన మా కనుమానముగనున్నది?

కబీ—ఏమని యనుమానముగనున్నది?

గోపా—మ్లేచ్ఛుఁడవని.

కబీ—నిజమునే కనిపెట్టినారు. ఇఁక సందియ మేమున్నది?

గోపా—అనుకొన్నమాట నిజమే! కొంపతీసినావు. తురకవు నీవు. బ్రాహ్మణులము మేము. ఏదోకొంచెం రామస్మరణ చేసికొనుచుండఁగా నిక్కడకుఁ జేరినావే, చాలు; చాలు. దూరముగ నుండుము.

గోప—మిత్రమా! గోపాలశాస్త్రి! మహాత్ములతో నిట్టి యనవసరప్రసంగ మేల చేసెదవు?

చ. అతఁడు తురుష్కుఁ డయ్యు నను నైనను నేమికొ యంత; జానకీ
పతిని మనంబునన్ నిలిపి భక్తిమెయిన్ భజియించు వీనిని౯
మతిని దలంపుమయ్య యెఱుక మానుష్యునిగా; సటుగాకయున్న నీ
గతిఁ దనరారునే! యదె జగన్నుతతేజము జూడు మోమున౯.

గోపా—గోపన్నా! నీ వెప్పుడును గాషాయవస్త్రములు కట్టుకొని గడ్డము పెంచుకొనినవాఁడు వచ్చినంతనే శ్లోకములు పలుకుచుందువు. (కబీరును జూచి) సాహేబు సన్యాసిగారూ! దయచేయుండి. మీరు మా సమీపమునకు వచ్చుటచే స్నానముగూడ జేయవలసివచ్చినది.

కబీ—నాయనా! నేను తురుష్కుఁడను; నీవు బ్రాహ్మణుఁడవు. నేను రామభజన సేయుట కష్టమనుగానా! నీవు పూనిన యీ యవివేకపుభక్తియందు ముక్తియున్నదనియేనా నీ యభిప్రాయము?

శా. ఆశేషాచలవాసు గొల్చినను విద్యాబుద్ధులన్ నేర్చినన్
గాశీసేతుగయాప్రయాగముల నత్యంతామతిం జేరిన౯
రాశీభూతకళాపమైన పరమార్థజ్ఞానమే లేనిచో
నీశుం డెట్టులొసంగు మోక్షమును నీ యీ భక్తికిన్ భూసురా.

నన్నుఁ దురుష్కుఁడని తిరస్కరించితివి. మీపురాణముల నెప్పుడయినఁ జదివితివా ?

సీ. రవివంశజుల గురుండు వసిష్ఠుని రమణి
ప్రావిర్భవించిన వంశమేది ?
రామాయణంబును వ్రాసి యశంబును
గొన్న వాల్మీకి యేకులమువాఁడు ?
భారతామ్నాయంబు వ్రాసిన యా పరా
శరుని కుమారుని జన్మమేది ?
జీవహింసనొనర్చి జీవించుచుండు ధ
ర్మవ్యాధుని కులంబు మంచిదగునె ?

తే. గీ. కులముతోఁ బనియేమి, నిశ్చలనుభక్తి
బూని హరిఁ గొల్చువారికిఁ బుణ్యమెయ్యదుఁ
బరమ విజ్ఞానముండనివాఁడ వగుటఁ
బలుకఁజాలితి వీభంగి బ్రాహ్మణుండ.

ఇట్లు పలికితివని నేనాగ్రహించువాఁడనుగాను. కాని నీకు జ్ఞానము లేకపోయినది కదా యని మాత్రము చింతపడుచున్నాను. మానవుఁడు ముందు తనయింద్రియములను దాను జయించుకొనవలయును. నేను నీవను భేదమును విడిచి, యహంకారరహితుఁడై నిష్కల్మషహృదయుఁడై విరాజిల్లుసత్పురుషుఁడే ధన్యుఁడు. ఇది యుండఁగాక; సజ్జనసహవాసముచేత జ్ఞానమును, జ్ఞానముచేత వైరాగ్యమును, వైరాగ్యముచేత ముక్తియుఁ గలుగును. అంతియే కాని చిత్తము నిర్మలము గాకుండఁ బిలిపించిన దాయని బలవంతము చేత వచ్చి భజన చేయుచున్నంతమాత్రమున నీవు ధన్యుఁడవు గావు.

రాధ—(తనలో) తురుష్కుఁడైనను నీతని వాక్యములు నాకద్భుతముఁ గొలుపుచున్నవి. తీఁగెకదిపిన డొంక కదలునన్నట్లీతఁడు పురాణములలో విషయములు చెప్పుచున్నాఁడు. వీనిమాటలకు గోపాలశాస్త్రి మరల జవాబు చెప్పక తలవంచుకొన్నాఁడు.

గోప—(తనలో) ఈమహానుభావుఁడు రామసేవాధురంధరుఁడుగాఁ గనఁబట్టుచున్నాఁడు. నిశ్చలమైన భక్తిచే, భూరివైరాగ్యముచే, శ్రీరామదేవుని నీతని హృదయమునందు గట్టిగ బంధించి విరాజిల్లుచుండిన మహనీయుఁడని, యీతనిముఖంబున నున్న తేజమే చాటుచున్నది. శ్రీరామచంద్రమూర్తి, నా మూఢభక్తికి సంతసించి, యీమహాత్మునిచే నన్నుఁ గృతార్థుని జేయించఁదలఁచి యిట్లు పంపినాఁడని తలంచెదను. నేనీ భక్తాగ్రేసరుని శరణుఁ

బొంది వఁగాక. (కబీరునుజూచి ప్రకాశముగా) మహాత్మా! మీ చరణారవిందములకు నమస్కరించుచున్నాను.

(నమస్కరించును.)

కబీ—(గోపన్నను బట్టుకొని) తండ్రీ! నీవును నేనును నమస్కరింప వలసిన దా రామునకే; మనలరక్షించు వాఁడాతఁడే. నాయనా! నీపేరెవ్వరో యడుగవచ్చునా?

గోప—గోపన్న యందురు. దేవా! తమ నివాసమెచ్చట?

కబీ—

చ. నిలచినచోట నిల్వకను నీరము ద్రావినచోటఁ ద్రావక
బలుస్థలముల్ జరించుచును భావమునందున రామచంద్రునిన్
నిలిపిభజించువారలకు నిక్కముగా నివసించునట్టి, స్వ
స్థల మొకఁడుండునే జగతి ధన్యచరిత్రుఁడ వీ వెఱుంగవే.

నన్నుఁ గబీరందురు. నేను కులమునకు మ్లేచ్ఛుఁడనే.

గోప—(కబీరుని పాదములపైఁబడి) మహాత్మా! నీవు సామాన్యభక్తుఁ డవు గావు. భగవత్స్వరూపుఁడవు. నాపాలిటికి గురుఁడవు. అజ్ఞానవార్ధియందు మునింగియున్న నన్నుద్ధరింపుము.

కబీ—(తనలో) ఈతఁడు మహాజ్ఞాని. శ్రీరామమంత్రోపదేశ మందు టకుఁ దగినవాఁడు. (ప్రకాశముగా) గోపన్నా! శ్రీరాముని యందు నీకున్నభక్తికి సంతసించినాను. జగంబున శ్రీరాముని మించినదైవములేఁడు. శ్రీరాముఁడే విష్ణుమూర్తి. శతసహస్రా హస్కరోజ్జ్వలమును, విస్ఫుల్లతికావదాతవిఘ్నోవ్యదివ్యజయం తీయుతమును, వేధఃకుధర ద్విట్ప్రముఖదేవాగ్రేసరోపాసితమును చంద్రమస్సూర్య నక్షత్ర సంకటకరప్రాసాద సౌధహర్మ్య వ్రజంబును, శతకోటిదినకర ప్రతికోటిమరవలోక తేజస్స మార్జితమును, నఖంపద్రిగచిత గేహవ్యూహ నిర్వ్యూహముచే

ఘృణిత్విషాళి తాంబరతలమునను, నక్రాంతశోకమోహక్షుత్పిపాసాజరామృత్యువర్జితప్రాణిగణమును నగు వైకుంఠపురంబున నెలకొనియుండి సర్వజగంబులఁ బరిపాలించు శ్రీమన్నారాయణుఁడే రామునిగా భావింపుము. ఆశ్రీరాముని ప్రభావంబు వర్ణించుట కా పద్మగర్భాదులకైన శక్యముకాదు. అతఁడే ముక్తిసంధాయకుఁడు. అతఁడే సంసారరత్నాకరోత్తారకతారకుఁడు, సర్వవేదములును, సర్వశాస్త్రములును, సర్వయాగములును, సర్వయోగములును, సర్వధర్మములును, సర్వకర్మములును, సర్వతంత్రములును, సర్వమంత్రములును — నాతఁడే. శంభువిశ్వంభరాంభోజరూపదృశ్యుఁడై పోల్చు నమ్మహానుభావుని, నాత్మయందు నిలిపి సేవింపఁజాలక, వారణాసీ హరిద్వార మాయా గయా ద్వారకాది పుణ్యక్షేత్రములను, జాహ్నవీ సింధు గోదావరీశోణ నర్మదాకృష్ణవేణీప్రముఖదివ్యస్రవంతులను, భగవంతుఁడున్నాఁడని కేవల భ్రాంతిని యజ్ఞానాంధకారమున మునిఁగి కొందరు చరింతురు. పూర్వాపరాలోచనజ్ఞులైన కొందఱు శ్రీరామదివ్యకథాజాలకల్లోలడోలామరాళాయమానాత్ములై, యంతఃపరితాపంబులం దోలి లోకోత్తరామూల్యకైవల్యలక్ష్మీ వివాహోత్సవోత్సాహముం గాంతురు. [ఇంచుక యూరకుండి] గోవన్నా! ఇటురమ్ము. నీకొక రహస్య మెఱిఁగించెదను.

గోప—స్వామీ! ఆజ్ఞ (సమీపించును.)

కబీ—పరమభక్తుఁడవగు నీకు రామతారకమంత్రము నుపదేశించుచున్నాను. వినుము.

శ్లో. శ్రీరామరామ రామేతి రమే రామే మనోరమే
సహస్రనామ తత్తుల్యం రామనామవరానసే.

గోప— (పైశ్లోకమును పఠించి) ఆహా! గురువర్యా! నీకటాక్షమున నేను ధన్యుఁడనైతిని. నాయజ్ఞానాంధకారమునకు దివాకరుఁడవై రామమంత్ర ముపదేశించితివి. మహాత్మా! ఈరామనామ మహిమకు సాటి మఱియొకటి లేదుకదా?

శ్లో. జయతు జయతు మంత్రం జన్మసాఫల్య మంత్రం
జననమరణభేద క్లేశవిచ్ఛేద మంత్రం
సకల నిగమమంత్రం సర్వశాస్త్రైక మంత్రం
రఘుపతినిజమంత్రం రామరామేతి మంత్రం.

శ్లో. నిఖిల నిగమమంత్రం నిత్యతత్త్వైక్య మంత్రం
భవకులహరమంత్రం భూమిజాప్రాణమంత్రం
పవనజనుతమంత్రం పార్వతీమోక్షమంత్రం
పశుపతి నిజమంత్రం పాతు మాం రామమంత్రం

శ్లో. ప్రణవనిలయమంత్రం ప్రాణనిర్వాణ మంత్రం
ప్రకృతిపురుషమంత్రం బ్రహ్మరుద్రేంద్రమంత్రం
ప్రకటదురిత రాగద్వేషనిర్నాశమంత్రం
రఘుపతినిజమంత్రం రామరామేతి మంత్రం

శ్లో. సంసారసాగర భయాపహ విశ్వమంత్రం
సాక్షాన్ముముక్షు జనసేవిత సిద్ధమంత్రం
సారంగహస్తముఖహస్త నివాస మంత్రం
కైవల్యమంత్ర మనిశం భజ రామమంత్రం॥

కబీ— గోపన్నా! ఇప్పుడు నేనుపదేశించిన మంత్రమును నీవు నిరంతరము జపించుచుండుము. ఈతారకమంత్రమే సకలశుభంబుల నొడఁగూర్చి మోక్ష సౌధారోహణమునకు సోపానము. మఱియొకమాట. నీవు గోలుకొండ కరిగి తానీషాను దర్శింపుము. కొలఁది దినములలో నీకున్నతోద్యోగము లభించును. దానం

జేసి, శ్రీరామభక్తి నీకు హెచ్చుటయేగాక, నీయశోడిండి మము దేశమెల్లడను మ్రోగును! ఇఁక నే నేగివచ్చెదను. నీకు శుభం బగుఁ గాక.

—స్వామీ! అప్పుడప్పుడు మీచరణసందర్శన భాగ్యము నాకు లభింపఁజేయఁ బ్రార్థించుచున్నాను.

—అట్లే యగుఁగాక. జయ్ సీతారాం. (నిష్క్రమించును.)

—(సంతోషముతో.)

ధన్యాసి—అది తాళము.

తారకమంత్రము కోరికదొరికెను-ధన్యుఁడనైతిని-ఓరన్న
మీరినకాలునిదూతలపాలిటి-మృత్యువుయనినమ్మకయున్న॥తా
మచ్చికతోనితరాంతరంబుల-మాయలలోఁబడఁబోకన్న
హెచ్చుగ నూటయెనిమిదితిరుపతు-లెలమి తిరుగబనిలేదన్న
ముచ్చటగా నాపుణ్యనదులలో - మునుఁగుట పనియేమిటికన్న
వచ్చెడిపర్వపుదినములలో-సుడి పడివడుటయు మానకయున్న॥
ఎన్నిజన్మములనుంచిచూచినను-ఏకోనారాయణుఁడన్న
అన్నిరూపులైయున్న పరమాత్ముని-నామమహాత్మ్యనికథవిన్న
ఎన్నిజన్మములఁ జేసిన పాపము-ఈజన్మముతో విడునన్న
అన్నిటికిది కడసాఁజన్మము - సత్యంబిఁక పుట్టుటసున్న ॥తా॥

... ... ... ... ...

—(గోపన్నను సమీపించి) ఏమి గోపన్నా! ఆమహనీయుఁడు నీ కేదియో రహస్యము నుపదేశించి యరిగినాఁడే.

ప—ఏమున్నది! జగమంతా రామమయమని; ఇంతకంటెఁగావలసిన దేమికలదు. మిత్రులారా! ఆశ్రీరామనామప్రభావము వర్ణింప సహస్రజిహ్వలు కలిగిన ఫణీంద్రునికైననుఁ దరముకాదు. ఈ శరీరము లస్థిరములని తలంచి శ్రీరామనామస్మరణము చిత్తము నందు స్థిరముగనుండునట్లు జేసికొనుఁడు. అయ్యది సమస్తపాప

ములను బోఁగొట్టును. మానవులనుకామక్రోధలోభమోహాహం
కారములయందు మునుంగనీయదు. కాని యొక్క విషయము
మాత్రమున్నది. నిశ్చలమైన భక్తి చిత్తమునఁ బదిలపఱచు
కొనుట మిగుల కష్టము.

ఉ. శ్రద్ధయుఁ దాల్మియుం దమము శౌచము నింద్రియనిగ్రహంబుహృ
చ్ఛుద్ధియు భక్తియుందమము సూనృతవాక్పరిపాలనత్వముల్
బుద్ధికి భూషణంబులుగఁ బూనవలెన్ సతతంబు దేవతా
సిద్ధమునీంద్రపూజ్యుఁడగు శ్రీరఘురాముని పాదసేవకుల్.

కావున ముందుగ వీనికై ప్రయత్నించి,

చ. వనజభవాదిదేవగణవందితుఁ డాహరియాటఁ దత్పదా
ర్చనమునకంటెఁ గాన మితరంబగు కృత్య మభీప్సితోప సా
ధనమటెయొండుఁ గాన; వితతంబగు భక్తిని వానిఁ గొల్చినన్
ఘనమతి నాతఁడిచ్చును, నగణ్యతరంబగు మోక్షలక్ష్మినిన్.

గోపా—మిత్రమా! గోపన్నా! ఇంతవరకును నీభక్తిని జూచి నే నది
యొక విధముగఁ దలఁచితిని. నీవు మహానీయుఁడ వను సంగతి
నేఁడు బోధపడినది. నాచిత్తమును మార్చుకొంటిని. నీ య
మూల్యమగు నుపదేశమున నేను రామసేవకుఁడ నయ్యెదను.
నన్ను దయఁజూడుము.

మాధ—నేఁటినుండి మన మేమయినను సరే. అసత్యమాడఁగూడదు.
క్రోధమోహములను వర్జింతము. సాక్షాత్ శ్రీమన్నారాయ
ణుఁడగు శ్రీరామచంద్రదేవుని హృదయమునఁ బాదుకొల్పి
సద్భక్తినిఁ బూజింతము.

గోప—మిత్రులారా! మన మిఁక గృహముల కరుగుదము. రండు.

(నిష్క్రమింతురు.)

ఇది ప్రథమాంకము.

శ్రీ

# రామదాసు

## ద్వితీయాంకము.

రంగము:—[గోల్కొండ. సభామందిరమున, తానీషాయు, అక్కన్న, మాదన్నలును ప్రవేశించుచున్నారు.]

తానీ—అక్కన్నగారూ! [అనుబంధము 3.]

మ. ధరణీభారము నిర్వహించునతఁ డాత్మక్షోణిలో నంతటన్
గరుణాయత్తమనంబుతో నరయుచున్ గాపాడుటల్ మాని, ని
ష్కరుణన్ రాజ్యమదాంధవృత్తిఁ బ్రజలన్ గారింపఁగా జెల్ల, ద
క్కరణిం జేసిన ధర్మహానియుఁ దిరస్కారంబు గాకుండునే.

అక్క—పాదుషాగారూ! మీరుచెప్పినమాట సత్యమే. కాని, యిప్పు డట్టి ప్రశంస యేలవచ్చినది?

తానీ—ఏమున్నది.

సీ. ధర్మజుండాది భూవరులు ప్రతిష్ఠింపఁ
జిరకీర్తి నందిన సింహపీఠి
అల తురుష్కనృపతు లాజులోనర్చి శా
సింపఁగాఁ జాలిన సింహపీఠి
పరదేశరాజులు వదలనికోర్కె నా
సించిమించిన ఘనసింహపీఠి

యఖిలభారతభూమి కాభరణ మగుచు
శ్రీలచే నొప్పినసింహపీఠి

తే. గీ. అఖిలభూతలమందున నలరుచున్న
సింహపీఠంబులను మించు సింహపీఠి
యట్టిహస్తినాపురపీఠ మకట! నేఁడు
దీనగతి నంది యుండుట తెలియరొక్కొ.

మాద—తురుష్కాగ్రగణ్యా! మీరట్లు సెలవిచ్చుచుంటి రేమి? మొగల్ చక్రవర్తియగు నౌరంగజేబుచే సర్వవిధముల నాఢిల్లీపుర సామ్రాజ్యలక్ష్మి యేకొఱంతయు లేక పరిపాలింపఁబడుచున్నది కదా!

తానీ—మాదన్నగారూ! ఔరంగజేబు రాజ్యపరిపాలనాదక్షుఁడని చెప్పఁగలను. కాని, యతిక్రూరుఁడు. హిందూమతద్వేషి. నేను సహజముగఁ దురుష్కుఁడనైనను మతద్వేషము వహింపక యుండినవాఁడనగుటచే నాతనిపరిపాలనము నాకు క్రూరముగ నున్నది. ఢిల్లీసామ్రాజ్యరమావధూటి యట్టివాని హస్తమునఁ బడవలసినది కాదు.

సీ. అది యుధిష్ఠిరుఁడు సమ్మోదముతో రాజసూ
యాధ్వరంబును జేసినట్టిచోటు
అదివీరశేఖరుండైన పృథ్వీపతి
యతిధర్మమున నేలినట్టిస్థలము
అదిపాదుషాయైన యక్బరు జాతీయ
భావంబునిలిపినభవ్యభూమి
అది శూరులౌ తురుష్కావనీశ్వరుల మ
యూరపింఛపుపీఠ మున్న నెలవు

తే. గీ. అనుచు జనులెల్ల వినుతింప నలరినట్టి
మహితఢిల్లీపురీమణి మాన్యులార!
క్రౌర్యమే ప్రధానంబుగాఁ గాంచఁబడెను
పాదుషా చేతఁ బాలింపఁబడుచు నుండె.

శిక్కు—మీరు నిష్కల్మషహృదయులును, ఉభయమతోద్ధారకులును నగుటచే నట్లు సెలవిచ్చుచుంటిరి. కాని, సహజముగా తురుష్కచక్రవర్తులకు హిందువులఁ జూచిన ద్వేషము.

కాసీ—అది వెఱ్ఱిమాట. మామహమ్మదీయులయందుమాత్రము సద్గుణగరిష్ఠులు లేకయుండిరా? అందఱును నౌరంగజేబువలె నన్యమతస్థులను బాధించిరా; ఇట్టి పన్నులుగట్టి ప్రజలను హింసించిరా?

సీ. తనకీర్తిచంద్రికల్ దశదిశల్ గాయ జ
లాలుద్దీను పృథివి నేలలేదె?
ప్రజలసౌఖ్యంబునే భావంబునం దెంచి
తురకఫిరోజిషా వరలలేదె?
జాతీయభావంబు జాటఁగాఁ జాలి య
క్బరుమహాపాదుషా పరగలేదె?
సమదృష్టి హిందూముసల్మానులం గని
మలక లింకెందఱో చెలఁగలేదె?

తే. గీ. తురకలైనను నేమి హిందువులె యైన
నేమి? గుణమె ప్రాధాన్యమై యెసఁగవలయుఁ
గాని, క్రౌర్యమూని ప్రజలఁ గాసినొందఁ
జేయు జన్మంబు గాల్పనే క్షితితలమున.

(భ)గవంతువిముఖముఁ జూచి నేను రాజ్యపరిపాలనము సేయుచుండినను మనుష్యుఁడనై యున్న కారణమున నన్నుఁ గూర్చికూడ ప్రజలే

మని చెప్పుకొనుచుండిరోయని సంశయమందుచునేయుందును?

అక్క — పాదుషాగారూ! మీయెదుట మిమ్ముస్తుతింపరాదు గాని మీరు నిక్కముగాఁ దురుష్కకులమునఁ బుట్టవలసినవారు కారు. మీయందెట్టిలోపమును వ్రేలుమడంచి చూపుట కెవ్వరికిని దరముకాదు.

సీ. తనభుజార్గళదగద్ధగితాసి రణరంగ
విజయేందిరకుఁ జారువేణి గాఁగఁ
దనదివ్యకీర్తి దిక్కామినీమణులకుఁ
బాటీరగంధ లేపంబు గాఁగఁ
ధనయసమాన ప్రతాపంబులు శత్రుప్ర
కరమునకును భయంకరము గాఁగఁ
దనదానధర్మముల్ దారిద్ర్యపీడితా
త్మకులపాలిఁటికల్ప తరువు గాఁగఁ

తే. గీ. మహితగోల్కొండ విమలసామ్రాజ్యలక్ష్మిఁ
బాలనము సేయుచున్నాఁడు భళిర! మ్లేచ్ఛుఁ
డయ్యుఁ, దానీష గుణశాలియై; యటంచు
సంతసబందుచున్నారు జనులుభూప.

తానీ — మీరు నాకు ముఖ్యమంత్రులై యుండుటయే దీనికిఁగారణము. (ఇంచుక యూరకుండి) అమాత్యవర్యులారా! ఆజన్మక్రూరుఁడగు నౌరంగజేబు మనగోల్కొండసామ్రాజ్యమును విధ్వంసముఁ జేయఁదలచి యున్నాఁడనుట మీరెఱింగిన విషయమే కదా? అతఁ డేసమయమున హఠాత్తుగ మనపై కెత్తివచ్చునో యని యొకింతసందియ మందుచుందును.

అక్క — మీరావిషయమునుగూర్చి సందియముగాని భయముగాని పొంద నవసరములేదు. ఇట్టిదెప్పుడైన సంభవించునేమోయను

సంశయముచేతనే శివాజితో మీకుసఖ్యముఁగూర్చితిని. మహారాష్ట్రరాజ్యోద్ధారకుఁడగు నాతని పేరు ఔరంగజేబు. పాదుషాకు సింహస్వప్నముగ నుండును. శివాజీ సామాన్యుఁడుగాఁడు.

సీ. ఇది ధర్మము నధర్మమిదియంచు వచియించు
విద్యామనీషియై వెలయునతఁడు
కార్యదీక్ష విడువక పనిజేసి యశంబు
నార్జించుచున్నట్టి యనఘుఁడతఁడు
పట్టిన ప్రతినకు భంగంబు రానీక
విలసిల్లుచుండిన వీరుఁడతఁడు
భయమేమి మాకంచుఁ బలుకు-నౌరంగజేబ్
పాదుషా ప్రక్క-లో బల్లెమతఁడు

తే. గీ. రాజమాత్రుండె మహారాష్ట్రమను
మహిని స్థాపించి నించిన మాన్యుఁడా శి
వాజి; మనకు మిత్రుండుగాఁ బరగుచుండ
భయ మదేటికి మొగలులవలన దేవ?

అది యట్లుంచుఁడు. అవసరము వచ్చెనేని మే మిరువురమును రణరంగమున కవతరించితిమేని యౌరంగజేబు సైన్యములు నిముషములోఁ బటాపంచలగును.

తానీ—మీయట్టిమిత్రులుండ నాకేమికొఱఁత. భవద్రక్షమునఁగాదె గోల్కొండసామ్రాజ్యేందిర చలింపకయున్నది.

మాద—దేవా! మీచిత్తమునఁ బాదుకొనియున్న యఖిలజాతీయ సమత్వమే మీకుఁ గీర్తిఁ దెచ్చుచున్నది.

సేవ—(ప్రవేశించి తానీషాను జూచి) సర్కా-ర్కు దేఖ్నాకువాస్తే ఏక్ బామ్మన్ ఆయే(అక్క-న్నమాదన్నలనుజూచి) ఆభామ్మడ్ మీకీ మేనల్లుడ్ కతే బోల్తే మహారాజ్!

తానీ—జరూర్సే ఆనాకరుక-బోలో. జల్దీజావ్.

సేవ—[నిష్క్రమించి వెంటనే గోపన్నతోఁ బ్రవేశించును.]

గోప—(తానీషాను విలోకించి) పాదుషాగారికి సలాములు.(అక్కన్న మాదన్నలఁజూచి) ముఖ్యమంత్రులకు నమస్కరించుచున్నాను.

తానీ—బ్రాహ్మణోత్తమా! ఆ యాసనముపైఁ గూర్చుండుఁడు.

గోప—(కూర్చుండును.)

తానీ—బ్రాహ్మణోత్తమా! భవదీయ నివాసస్థల మెద్ది? నా వలన మీకుఁ గావలసిన కార్యమేమి?

గోప—దేవా! నేలకొండపల్లి మానివాసము. మాయింటిపేరు కంచెర్లవారు, గోల్కొండ నవాబులయొద్ద భద్రాచలము తహసీల్ దారుగనుండి విమలకీర్తి గడించిన లింగనమంత్రి సుతుఁడను. మీముఖ్యమంత్రులగు నక్కన్న మాదన్నలకు మేనల్లుఁడ. గోపన్న నామధేయుఁడ.

తానీ—(అక్కన్నమాదన్నలను జూచి) అమాత్యులారా! మీ మేనల్లుఁడగు నీతనిఁగూర్చి యెప్పుడును జెప్పియుండలేదే. ఈతఁడిప్పు డేమిచేయుచున్నాఁడు?

అక్క— విద్యాబుద్ధులఁ గఱచి స్వగ్రామమునందే యున్నాఁడు. ఉద్యోగాభిలాషియై దేవరసందర్శనమునకు వచ్చినాఁడు.

తానీ—గోపన్నగారూ! మీకుద్యోగము కావలయునా?

గోప—పాదుషావారిచిత్తము.

సీ. న్యాయవిచారణంబందున నెవ్వాఁడు
మనుభూపతియశంబు మట్టుపఱచె
నతిధర్మవర్తనంబందున నెవ్వాఁడు
యమనందనుప్రశస్తి నవఘళించె

స్థిలోకావనంబందున నెవ్వాఁడు
రాధాకుమారుగర్వం బడంచె
రణరంగశౌర్యవిక్రమమున నెవ్వాఁడు
పార్థుని ఖ్యాతిని భంగపఱచె

తే. గీ. నతఁడు తానీషపాదుషా యంచు జనులు
చెప్పుకొనుమాటలకు సంతసించి యిట్లు
చేరినాఁడను నీకొల్వుఁ జేయఁగోరి
కలితకారుణ్యగుణధుర్య! క్షానువర్య!

సదిష్టదైవమగు శ్రీరామచంద్రదేవుని ప్రేరేపణంబున మిమ్ము దర్శింప వచ్చితిని. ధర్మసంస్థత నాకు సంగడీఁడైయుండ, తాము నన్నెట్టి యుద్యోగమున నియమించినను జాగరూకుఁడనై మెలంగుదునని మనవిచేసుకొనుచున్నాను.

తానీ—(తనలో) ఈతని వినయసౌశీల్యాదిగుణములు నాకెంతయు మోదమును గలుగఁజేయుచున్నవి. (అక్కన్న మాదన్నలను జూచి) మంత్రివర్యులారా! ఈతఁడు మీకు మేనల్లుఁ డగుటం జేసియు, నీతని పూర్వులీ గోల్కొండ సంస్థానమునందే యుద్యోగులై యుండుటం జేసియు, మనచే నీతఁడు గౌరవింపఁబడఁ దగినవాఁడై యున్నాఁడు. కావున నీతనికిఁ దగిన యుద్యోగమును నిర్ణయింపుఁడు. ధర్మసత్యగుణము లీతనికి భూషణములగుటచే నేదేని యొక తాలూకా తహశీల్ దారుపదవియందు నియోగించిన బాగుండుననని నా యభిప్రాయము. అట్టిదాని కిప్పు డేదయిన నవకాశమున్నదా!

మాద—పాదుషాగారూ! భద్రాచలము తహశీల్ దారు పదవికిఁ దగిన సమర్థు లెవ్వరును లేకపోవుటచేఁ బ్రస్తుత మా యుద్యోగము నచ్చటనున్న పెద్ద ముసద్దియే చూచుచున్నాఁడు.

తానీ—బాగున్నది. ఆతహశీల్దారుపదవియం దీతని నియమింతము. (గోపన్నంజూచి) గోపన్నగారూ! మిమ్ము భద్రాచలము తహశీల్దారుగా నియమించినాము. మీకు "హుకుం" యీరోజుననే యీయఁబడును. మీరచ్చటికరిగి యాయుద్యోగమునఁ బ్రవేశించి మాయందు భక్తివిశ్వాసములు గలిగి మెలంగుఁడు.

గోప—ఆజ్ఞ ననుసరించెద. [తనలో శ్రీరాము నుద్దేశించి] దేవా! రామచంద్రా! నిన్ను భక్తిమై సంతతము నర్చించు భక్తుల కెట్టికొఱంతలు గలుగకుండ రక్షించుచుందువుకదా! నీ చరణదాసుఁడనగు నన్నిచ్చటకుఁ బొమ్మని ప్రేరేచి యీ యుద్యోగము నాకిప్పించిన మహానుభావుఁడవు నీవకాదె.

ఉ. శ్రీరమణీమనోహర! యశేషగుణాకర! దీనలోకమం
దార! నిరుగ మనంబున, ముదంబునఁ గొల్చెడివారికెల్ల నా
ధారము నీవయై శుభము దద్దయుఁ గూర్చుచునుందుగాదె య
య్యారె! భవన్మహామహిమ నయ్యజుఁడైన నెఱుంగనోపునే.

తానీ—[అందరినిఁజూచి] మనకు వేళ యైనది. నేఁటికిఁ గొలువు చాలింతము,

[అందరును నిష్క్రమింతురు.]

—[o]—

రంగము:—భద్రాచలము.

[గోపన్నగారి గృహము, వీధియరుగుపై సోమయాజులు, దీక్షితులు నను బ్రాహ్మణులు ప్రవేశించుచున్నారు.]

సోమ—ఆహా! దీక్షితులూ! ఏమి గోపన్నగారోయి! ఇదివఱకు మన భద్రాచలమున కనేకమంది తహశీల్దారులు వచ్చినారు. కాని యీమహనీయునిఁబోలిన వారెవ్వరును లేరు. అబ్బా! ఏమి

దానధర్మములు—ఏమి సంతర్పణములు — ఏమి దైవతసమారాధనములు—ఇట్టివి మున్ను మన మెప్పుడును జూచియుండ లేదు. నాకుఁజూడగా సర్కారువారు యీయనకిచ్చు జీతమునకుఁ బదిరెట్లు ఖర్చగుచున్నది. ఇంత సొమ్మీయన కెక్కడనుండి వచ్చుచున్నదో కదా?

దీక్షి—గోపన్నగారి రామభక్తి వర్ణనాతీతమైనది. భగవద్భక్తులకు గొఱఁత యేమున్నది.

చ. గురుజనభక్తియుఁ శమము గూర్మియు నీవియు నీతి రూపవి
స్ఫురణ వివేకముఁ వినయముఁ మొదలైన సమస్త సద్గుణో
త్కరము కరంబు భూషణలుగా ధరియించి చరించునట్టి యీ
ధరణిసురాగ్రగణ్యునకు దైవమె తోడ్పడుచుండు నెప్పుడుఁ.

సోమ—నీవన్నమాట నిజమే. ఇదియంతయు శ్రీరామమూర్తి కటాక్షమే. (ఇంచుక యూరకుండి) అబ్బా! భక్తారాధనము హెచ్చుగనున్నది. ఈమహానీయుఁడిచ్చట తహశీలుదారుగా వచ్చినపిదప నన్నమోరామచంద్రా యనుబ్రాహ్మణులిట్టి మృష్టాన్నసమితి నారగించుచున్నారు. మోకాలు దిగకుండ నంగవస్త్రములఁ గట్టువారు చీనిచీనాంబరముల ధరించుచున్నారు. ఇట్టి పరమభక్తాగ్రగణ్యుండు పదివేలవర్షములు వర్ధిల్లుఁగాక.

దీక్షి—ఈ గోపన్నగారికి గృహిణికూడఁ దగినట్లే లభించినది. ఈయన చేయు కార్యములకామె యే మాత్రము నడ్డు గల్గింపక సర్వవిధములఁ దోడ్పడుచుండును. నిజము. నాతల్లి యన్నదానమునకు హరురాణి; సరసానులాపచాతురికి వాణి; భర్తృపదసేవాపరాయణతకు శ్రీరామచంద్రుని రాణి; క్షమాగుణంబునకు క్షోణి; సౌభాగ్యమునకు నంబుజపాణి; అనియుఁ జెప్ప

వచ్చును. భోజనసమయమునం దెవ్వరి కేమి కావలయునో స్వయముగాఁ గనుఁగొనుచుండునుగదా?

గోపన్న—(ప్రవేశించి)

కీర్తన.

రామభజన సేయవె మనసా ॥ శ్రీరాముని సేవింపవే
కామితంబు లెల్లదీర్చు । కల్పవృక్ష మాతఁడే ॥రామ॥
కామక్రోధలోభమోహాదుల సు । జ్ఞానంబున దున్మాడవే
నీమమూని నీవె దిక్కటంచు । నీరజాక్షుఁడైన శ్రీ ॥రామ॥

(ఎదుటనున్న బ్రాహ్మణులనుజూచి) సోమయాజులుగారా! సహూరా ధనయం దేమిలోపములున్నవో. భోజనసమయమున నేను కనుగొనలేదు. ఎట్టిలోపములున్నను బెద్దలు క్షమించవలయును.

సోమ—సరి సరి. ఎంతమాట సెలవిచ్చితిరి. గోపన్నగారూ! మీరు మాపురాకృతపుణ్యావశమున మాపురమునకుఁ దహశీల్ దారుగా విచ్చేసిరి. ఈగాతమీతీర్థభూసురులు తమ రిచ్చటికి వచ్చిననాటనుండియు దారిద్ర్యదేవతకు స్వస్తిఁ జెప్పిరి. మహానుభావా! ఇట్లు మేము చెప్పుట విఁమ్ముఁ బొగడుటకుఁగాదు. ఇది సత్యము. భగవంతుఁడైన శ్రీరామచంద్రమూర్తి మీ హృదయపద్మమున వసించి సర్వదా యిట్టి కార్యముల జేయించుఁగాక.

గోప—ఏదిచేసినను సర్వము నాభక్తరక్షణదీక్షాబద్ధకంకణుఁడగు రఘునందనుఁడే.

చ. సదయమనస్కుఁడై గురుఁడుచాత్రుని మానసకల్మషంబుఁ బో
విదలిచి విద్యనేరిపి, వివేకినిగా నొనరించు భంగి, స
మ్మదమున రామమూర్తి పరిపూర్ణకృపన్ వరభక్తకోటి నె
మ్మదులను నున్న పంకిలము మాపుచు నిట్టివి చేయుఁజూచెడున్.

ఆభగవంతుని యనుగ్రహము లేకయున్నచో మన మేకార్యమును జేయఁజాలము.

దీక్షి—మీరు సత్యము పచించితిరి,

(తెరలో) హా! కుమారా!

గోప—ఏమిది! (చూచి) అయ్యో! ఏమిది!

శుశీల—(మృతుఁడైన గోపన్నగారి కుమారుని నెత్తుకొని ప్రవేశించి) అయ్యో! నాథా! ఏమిచెప్పుదును. వేఁడిగంజిగుంటయందుఁ బడి మనకుఱ్ఱవాఁడు—అక్కటా! మాటు గాకున్నది. ఏమి చేయుదును—ప్రాణేశ్వరా! ఇదుగో!

గోప—హా! రామా! రామా! (మూర్ఛిల్లును.)

సోమ—దీక్షితులూ! ఇంతకుమున్దే యీబాలుఁ డాడుకొనుచున్నాఁడే. ఎంతలో నింతజరిగినదో చూచితివా! ఇట్టి యవస్థ గోపన్నగారికి రావలసినదేనా?

గోప—(కుమారుని సమీపించి రాము నుద్దేశించి) హా! రామచంద్రా! నాకీశోక మేలకల్పించితివి! ఇట్టి దుఃఖమునకు నేను పాత్రుఁడనా! అయ్యో! నిరంతరము నీచారణారవిందసేవఁ దప్ప యన్య మెఱుఁగనే!

సీ. నీపాదనీరజనిర్మలసేవయే
 నిఖిలభాగ్యములకు నిలయమంటి
నీకథాపఠనమే నిశ్చలానందముం
 జేకూర్చి సతతంబుఁ జెలఁగునంటి
నీమంత్రచింతనంబే నిగమార్థ మ
 టంచుఁ జిత్తమున భావించియుంటి
నీమూర్తిదర్శనంబే నన్నుఁ బాపదూ
 రునిగాఁగఁ గావించి ప్రోచునంటి

తే. గీ. నట్టి నీదాసుఁడను నాకు నకట! నేఁడు
గర్భశోకము గూర్తువా కరుణలేక
భద్రశైలనగరధామ! భవవిరామ!
రామ! జితకామ! జగదభిరామనామ!

తండ్రీ! రామచంద్రా! నిరంతరము నీచరణారవిందసేవచేఁ గాలము గడుపుచున్నందులకు నీవు నాకొసంగు ఫలమిదియా! నీయెడల నేనేమి మహాపరాధ మొనర్చినాను. (ఇంటిలోనుండి కుమారుఁ డిచ్చుచుండిన వాన్ యూర కుండి పుత్త్రుని మృతకళేబరమును తొడలపైఁ జేర్చుకొని) కుమారా! నీకింతలోనే నూఱేండ్లు నిండినవా? నీ ముద్దు ముచ్చటలుజూచి యానందమందుభాగ్యము మాకు నేఁటితోఁ దీఱినదా?

శా. చుంచల్లాడఁగ రావిశేకుగదలన్ జోద్యంబుగా ఘల్లు ఘ
ల్లంచున్ మ్రోయఁగ గజ్జెలందియలు నాహ్లాదంబు గల్పించు నీ
చంచద్బాలమనోహరాకృతిని నేచందంబునన్ వీడి జీ
వించన్ శక్తుఁడ నాదు నయ్యకొడుకా పృథ్విన్ ననుంబాసితే?

తనయా! మావంటి నిర్భాగ్యులకు నీవు దక్కుదువా! అకాలమృత్యువు నిన్ను మ్రింగునని కలనైనఁ దలఁపనైతిని. వంశవిస్తారకుఁడవై తల్లిదండ్రుల కిన్నినీళ్ళుచుక్కలు పోయుదువను మాయాస యడుగంటినది.

సుశీ—హా! కొడుకా! మమ్ములవిడనాడిపోతివా? నీతండ్రిగారి రామసేవాపరాయణత్వమైన నిన్ను రక్షింపలేకపోయెను గదా! అయ్యో! శరత్కాలరాకాసుధాకరుని హసించు నీముఖబింబమును నేనెట్లు మఱతును, నీలంబులఁబోలు నీకురులకు సంపంగి నూనె రాచి దువ్వు సంతోషము మాయమైపోయినదా? ఏదియేని పెట్టకయున్న సమయమున నీవేడ్చునపుడు లాలించు నా

సంతోషము నుగంటినదా! కెందమ్మిరేకులఁ బురడించు నీకన్ను లకుఁ గాటుక దిద్ది ముఖంబునఁ బొట్టుబెట్టి నీవాడుచుండఁగాఁ జూచు యానందము మాయమయ్యెనా? హా! తండ్రీ! విద్యా బుద్ధులు నేర్వలేదు. పెద్దవాఁడవు కాలేదు. అర్థులఁబ్రోవలేదు. అకటా! మృత్యుదేవత నిన్నింతలోనే తననోటఁ గఱచుకొని పోయెనా? (అనుబంధము. 4.)

సోమ—(గోపన్నను భార్యనుజూచి) పుణ్యదంపతులారా! విచారింప వలదు.

కీర్తన. పూరి.—ఆది.

కబీరు—

అరగడియు జీవనమునకై నీ । వాసింపకే వోమనసా ।
అరయఁగ రెండుదినంబుల మజిలీ ।
యనుకొనవే యీ ప్రపంచము మనసా ॥అ॥
నీకెవరులేరు । నీ వెవరికి గా ।
వొకడవె వచ్చితి । వొకడవె పోయెద ।
వకిలంకుఁడు శ్రీ విఠలవాసుఁడేగతి । యానాటికి నీనాటికి మనసా॥

( అని పాడుచుఁ బ్రవేశించును. )

గోప—(కబీరునిజూచి) గురువర్యా! నమస్కారములు.

(నమస్కరించును.)

కబీ—గోపన్నా ! ఈచింతయేమి ?

గోప—(దుఃఖముతో) గురువర్యా ! ఇదుగో! పుత్రుఁడు మృతుఁడై నాఁడు. (పుత్రుని నుద్దేశించి) హా! కుమారా!

శుశీల—(పుత్త్రుని నుద్దేశించి)

చ. కొడుకులు పుట్టలేదనుచుఁ గుందుచు సొక్కుచు సోలుచుండి యె
వ్వుడును ననేక దేవులకుఁ బొందుగఁ బూజలునల్పుచుండు న

ప్పడఁతుల కేరికైన భగవంతుఁ డొసంగక నాదుపాపముం
గడువున, బుట్టజేసెఁ గొడుకా! నిను, నేమని దుఃఖమాఁపుదున్.

గోప—హా! కొడుకా!

(అనుబంధము. 5)

కబీ—(గోపన్ననుజూచి) గోపన్నా! ఈవిచారమేమి? నీవజ్ఞానాబ్ధిలోఁ బడితివే! ఈమరణించినవా రెవ్వరు? నీతనయుఁడా? ఈతనికిని నీకును నెట్టిసంబంధము? నీ వెక్కడనుండివచ్చితివి? ఎక్కడికిఁ బోవుదువు. బాగుగ విచారించినచో నీవిచారమును విడుతువు.

శ్లో. మాతా నాస్తి పితా నాస్తి॥ నాస్తి బంధు సహోదరః
అర్థంనాస్తి గృహం నాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత!

అనుశ్లోకమును నీవు మఱచితివా?

శా. భార్యాబాంధవ పుత్రమిత్రధనసంబంధంబులందున్ మహా
దార్యం బొప్పు మమత్వమున్ విడిచి బ్రహ్మానందమున్ గ్రీడించుచా
తుర్యం బుండిన వాఁడె మోక్షమును బొందుంగాక, యీవట్టిగాం
భీర్యం బూనినవాఁడు వ్యర్థుఁడు సుమా విజ్ఞానచూడామణీ!

శా. గంగాస్నాన మొనర్చినన్ వివిధయాత్రశ్రేణి గావించినన్
సంగీతంబులు పాడినన్ సకలపుణ్యక్షేత్రముల్ మెట్టినన్
సంగంబుల్ విడనాడకున్నయెడ మోక్షం బబ్బదిన్నశ్వరీయ
బ్భంగుల్ పెక్కులునీవు మున్నెఱుఁగవే వర్ణింతే యజ్ఞానివై?

నిరంతరశ్రీరామచరణసరసీరుహ ధ్యానాసక్తచిత్తుఁడ వగు నీ విట్లు చింతింపఁదగునా? ఈకుమారుని నీకుఁ బ్రసాదించిన దెవ్వరు? రాముఁడు—ఇప్పుడు తోడ్కొనిపోయిన దెవ్వరు? రాముడు. కావున నమ్మహాత్మునే ప్రార్థింపుము. శోకమువలనఁ బ్రయోజన మేమియున్నది?

ఉ. సారససంభవుం డెవఁడు శౌరి యెవండు హరుం డెవండు బృం
దారకనాయకుం డెవఁ డనాథలకున్ గతి యెవ్వఁడో జగ
త్కారణభూతుఁ డెవ్వఁడు మొదల్ తుదిలేనిమహాత్ముఁ డెవ్వఁడో
యారయ నట్టిరాముని పదాంబుజముల్ శరణంబు నందుమా.

గోప——(చింతవిడిచి) గురువర్యా ! ఇంతవఱకును నజ్ఞానాబ్ధిలోఁ బడియుంటిని. వేదవాక్యములఁ బోలు మీనుడులు నన్ను జ్ఞానసమన్వితునిగాఁ జేసినవి (భార్యంజూచి) నారీమణీ! వగవక ధైర్యం బవలంబింపుము. సమస్తము భగవదధీనమై యున్నది. మనచే సౌఖ్యనాటక మాడించినను, దుఃఖనాటక మాడించినను——శ్రీరామచంద్రునిదేభారము. అజ్ఞానాబ్ధిలో మునిఁగి పుత్త్రశోకాతురుల మగుటచే నిట్లు విలపించుచుంటిమి. శ్రీరామచంద్రమూర్తి కరుణాసాగరుఁడు, మున్నమ్మహనీయునిరాజ్యపరిపాలనమున నొకవిప్రుని సుతుండు మరణింపఁగా, నావిప్రుఁడు, మృతుఁడైన తనకుమారుని శవము నెత్తుకొనిపోయి రామచంద్రుని యాస్థానమంటపము ముందుఁబడవైచి రామభద్రా! రక్షింపుమని వేఁడినంతనే బాలుని బ్రదికించిన యద్దేవదేవుఁడు మనకుమారునిమాత్ర మేల రక్షింపకయుండును. ఈసమయమున మనకాలోకరక్షకుఁ డగు రామమూర్తియే శరణ్య మగుఁగాక! (శ్రీరాముని నుద్దేశించి)

మ. తనయుం డీతఁడ కాలమృత్యువును బొందన్ గాంచి యిక్కాంతతో
ఘనదుఃఖాబ్ధిని మున్గినాఁడను వివేకజ్ఞానశూన్యుండనై
నను రక్షింపఁగ నేగుదెమ్ము కరుణన్ నాగోడు నాలించుచున్
వనజాతప్రముఖాదిదేవవినుతా! భద్రాద్రిరామప్రభూ.

శా. శ్రీరామా! రిపుభీమ! కల్పితబుధక్షేమా! ఘనశ్యామ! శృం
గారాకారవిధూతకామ! నయసంగ్రామా! యశోధామ! స
త్కారుణ్యామృతసీమ! దీనుఁడ ననున్ గాపాడరావే భవ
త్కారుణ్యంబున భద్రశైలపుర సీతారామచంద్రప్రభూ!

శా. దారాపత్యధనాదిసంపదలు తథ్యంబంచు భావించి సం
సారాంభోధి మునింగి యీకరణి లేశంబైన సౌఖ్యంబు నే
దారింగాంచకయుంటిఁ; బ్రోవుమిఁక నీదాసుండ సుమ్మా లస
త్కారుణ్యాకర; భద్రశైలపుర సీతారామచంద్రప్రభూ!

(అంత గోపన్నగారి కుమారుఁడు నిద్రనుండి లేచినవిధమున లేచును.)

సుశీల—(సంతోషముతో కుమారునెత్తుకొని) రామచంద్రదేవునకు మాయందుఁ బరిపూర్ణానుగ్రహాము వచ్చినది.

గోప—(శ్రీరాము నుద్దేశించి) రామచంద్రా! నీమహిమ యద్భుతమైనది.

సీ. జగమను నాటకస్థలమందు నఖిల జీ
వుల ముదంబుతోడ బొమ్మలుగఁ జేసి
గారడీఁడునుబోలె కనుఁగట్టి యాడింపు
చుండెద వొకచో సుఖముఁ గూర్తు
వింకొక్కచో దుఃఖ మెంతయో గల్పింతు
వింకొకచో రెండు నేకరీతి
నుంచు విధము జూతు వొకచోట నిట్టిదుః
ఖముగూర్చి యట్టి సౌఖ్యంబు నిచ్చి

తే. గీ. భళిర! నవ్వింపుచుందువు భారతీ మ
నోహరాదులైన నిన్ను నెఱుఁగంగఁ

జాలరే నెంతవాఁడను జలజమిత్ర
వంశపావన! శ్రీరామ! భవవిరామ!

దేవా! ఈదాసునియందు నీవు సంపూర్ణమైన కరుణవహించి మృతుం డైనసుతుని బ్రదికించి మాకు గర్భశోకము లేకుండ రక్షించి తివి. (కబీరునుఁజూచి) గురువరా! పుత్రమోహమున నజ్ఞానా బ్ధిలోఁ గూలి పరితపించుచున్న సమయమున నిమ్మోడకు విచ్చేసి నాయందుఁ గరుణాంతరంగుఁడవై యజ్ఞానమును బాపి చిత్త మును శ్రీరామచింతనము నిలుపునట్లు గావించి, యయ్యాది దేవుని కృపకుఁ బాత్రునిగఁజేసి మృతుండైన కుమారుని బ్రది కించితివి. మహాత్మా! నీ యుపకారము నేనెన్ని జన్మము లెత్తు చుండినను మఱవను.

కబీ—గోపన్నా! ఇందు నేనొనర్చిన దేమియు లేదు. రక్షించుటకును, శిక్షించుటకును శ్రీరామమూర్తియే కర్త. ఆతఁడు నీయం దుఁ గరుణవహించినాఁడు. నీనిశ్చలభక్తికి సంతసించి మృతుఁ డైన కుమారుని మరల నొసంగినాఁడు. శ్రీరామానుగ్రహము నకుఁ బాత్రుఁడవైన నీవు నేఁటినుండి "రామదాస"ను పేరఁ బరగుదువుగాక.

గోప—(సుశీలంజూచి) రమణీ! స్వామియనుగ్రహమున మనకు దుఃఖములేకుండఁ బోయినది. ఇఁకనీవు కుమారునిఁ దోడ్కొ-ని లేని కేగుము. నేనును మా గురుమూర్తులును దేవాలయమున కేగివత్తుము. (అచ్చటనున్న బ్రాహ్మణులఁజూచి) సోమయా జులుగారూ! వీరు కబీరుగారు. మాగురువులు. రామసేవ కులు. విజ్ఞానసంపన్నులు. వీరితో నేను శ్రీరామాలయమున కేగి వచ్చెదను. సెలవిచ్చెదరా!

సోమ—గోపన్నగారూ !

కబీరు—అట్లుగాదు. రామదాసని పిలువుఁడు.

సోమ—రామదాసుగారూ! నేఁడు మిమ్ము మీశ్రీరామభక్తియు, గురువర్యుల యాగమనంబును గాపాడినవి. తొలిజన్మమున మీదంపతు లిరువురు మహాపుణ్యమును జేసికొని యున్నారు.

గోప—(కబీరునుజూచి) గురువర్యా! దయసేయుఁడు.

దీక్ష—మేము కూడ స్వామిసందర్శనమునకు మీతోనరుదెంతుము.

(అందఱు నిష్క్రమింతురు.)

ద్వితీయాంకము.

శ్రీ

# రామదాసు

## తృతీయాంకము.

రంగము. రామదాసుగారి మందిరమున కచేరీ చావడి.

[రామదాసుగారు, గుమస్తాయగు ముకుందరావు ప్రవేశము]

రామ—ముకుందరావుగారూ! ఇంకను నేను చూడవలసిన కాగితము లేమైన నున్నవా?

ముకుం—ఇంక నొక్కటిమాత్రమే యున్నది.

రామ—ఏమది ?

ముకుం—అయ్యా! దుమ్ముగూడెము కాపురస్థుఁడగు వెంకటరెడ్డియను నతఁడు తనకున్న యొకయకరముపొలము మిగులఁబల్లమైయుండుటచేఁ దక్షిణపొలమునుండి వచ్చిననీరంతయుఁ దనపొలములోఁబడి మురుగెత్తిపోవుటచేఁ బంట పాడయినకారణమున నీసాలుకు శిస్తు నీయలేను. కావునఁ గటాక్షించిరద్దుచేయింపుఁడని విన్నవించుకొనుచున్నాఁడు.

రామ—రామ రామ! సర్కారున కీయవలసిన శిస్తుమాట కేమిగాని పంటపండక పోవుటచేతను, బీదసంసారియగుటచేతను, నీసంవత్సర మాతఁడు జీవయాత్ర యెట్లు వెడలఁదీయునోగదా! ఇట్టివారి నాశ్రితరక్షకుఁ డగు రామచంద్రమూర్తియే రక్షింపవల

యును. (ఇంచుక యూరకుండి) ఏదీ! కాగితము శిస్తుకద్దు చేయుడమైనదని వ్రాసెదను. (కాగితము పుచ్చుకొని వ్రాసి మరల నిచ్చి) గ్రామాధికారియగు భద్రారెడ్డికి పౌరముఖ్యులను దోడ్కొని రమ్మని వార్తఁ బంపితిని. అతఁడింకను రాలేదేమో!

ముకుం—(ఎదుటఁజూచి) అదుగో! అతఁడును, బాపినీడును వచ్చుచున్నారు.

[భద్రారెడ్డి, బాపినీడు ప్రవేశింతురు.]

భద్ర } దండాలండి
బాపి }

రామ—భద్రారెడ్డీ! వచ్చితివా? ఇదిగో బాపినీడునుగూడఁ దోడ్కొని వచ్చితివే. అటు గూర్చుండుఁడు.

(ఇరువురును గూర్చుందురు.)

రామ—నే నిచ్చటకుఁ దహసీలుదారుగా వచ్చినప్పటినుండియు నా యందు మీరు మిగుల భక్తిఁబూని చరించుచుండుటయే గాక నే నొనర్చుచున్న భగవత్కార్యములం దనేకవిధములఁ దోడ్పడుచున్నారు. నాయందు దయయుంచి ప్రతిగ్రామములో రైతులు రెండు మూడు సంవత్సరములనుంచి సర్కారున కీయవలసిన పాతశిస్తులన్నియు నిచ్చివేసి పాదుషాగారు నన్నుఁ గొనియాడునట్లు చేసినారు.

భద్ర—స్వామీ! మీరు తండ్రులు. మేము బిడ్డలము. అల్లాటప్పాడు మాకు మాటొస్తే ఒకటీ, మీకు మాటొస్తే ఒకటీనా? మొత్తానికి మీరిక్కడి కేంచేశాకే బకాయిశిస్తు అంత వసూలయింది బాబూ! ఇదియంతా తమ మంచితనంచేత తమరుచేసే సత్కార్యాలచేత తండ్రీ! వెయ్యేండ్లకీ మీరెమాకు తాసిల్దారుగా ఉండండి.

బాపి—బాబూ! మీరొచ్చిన తరువాత యెంతమంది బీదబ్రాహ్మలు కడుపునిండా కూడు తింటున్నారు. బ్రాహ్మలన్నమాటేమిటి శూద్రుల్లో యవసాయంలేక తిండికి తిప్పలుపడే వాళ్ళకి దరఖాస్తులమీఁద పొలములిచ్చి వాళ్ళను నిలబెట్టినారు. ఇంకేం కావాలి.

రామ—భద్రారెడ్డీ! నేను మిమ్ములనొకవిషయమును గూర్చి మాటలాడుటకు రావించితిని. ఆకార్యమున మీరు నాకు సంపూర్తిగఁ దోడ్పడవలయును.

భద్ర—మీరు మాపాలిటికి రామమూర్తులు. మీరేమి సెలవిస్తే అది చెయ్యడానికి మేము చేతులు కట్టుకొని నిలబడుతాము. మా విషయంలో మీరేమీ సందేహించవద్దు.

రామ—మన గ్రామమున వెలసియున్న శ్రీరామచంద్రమూర్తివారి యాలయము మిగుల జీర్ణదశలో నున్నది. ఆయాలయము నిర్మాణమున కెవ్వరును నింతవఱకుఁ గడంగకుండుట మిగుల విచారకరముగనున్నది! మున్ను తమ్మల దమ్మక యను శూద్రాంగన యాస్వామివారిని దనభక్తికొలఁది పూజసేయుచు, గ్రామస్థుల సహాయమునఁ జిన్నగుడి యేర్పాటు చేసినవిషయ మెల్లరకును దెలిసియేయున్నది. అయ్యది యిప్పుడు జీర్ణదశలోనున్నది. కావున నిప్పుడా స్వామివారికి దివ్యమైన యాలయ మొండుగట్టి గర్భగృహప్రాకారమండపధ్వజస్తంభరథాదులు నిర్మాణము జేయించవలెనని నాకభిలాష కలిగినది. ఇది నాకు రామదేవుని యాజ్ఞగనే మీరు భావింపుఁడు. (ఇంచుక యూరకుండి) మనది నాలుగునాళ్ళ బ్రతుకు. ఈభాగ్యభోగములను మనము వచ్చినప్పుడు తీసికొనిరాలేదు: పోవునప్పుడు తీసికొనిపోము. మన శరీరమున దార్ఢ్యం బున్నప్పుడే భగవత్కైంకర్యములఁ జేసి

కృతార్థులము గావలయును. భగవంతునికంటె మనకుఁగావలసినదేమున్నది ? ఆ సీతా కళత్రుని కృపకు మనమందఱమును పాత్రులము కావలసినదే.

భద్ర—బాబూ! అంతకంటెఁగావలసినదేమున్నది. దేవుని కార్యానికి సాయం చెయ్యనివా రెవరుంటారు. ఇందుల మమ్మేమి చేయమన్నారు. మీయాజ్ఞ శ్రీరామయాజ్ఞగా చేస్తాము.

రామ—మన మేశ్రమపడియైనను, శ్రీరామునకు దివ్యమైన యాలయముఁ గట్టించవలెను. ఈవిషయమున మీరు నాకు సంపూర్ణమైన సహాయము చేయవలెను.

బాపి—మీరేమీ సందేహించనక్కర్లేదు. మీరు తలపెట్టినకార్యం జయంగా సాగుతుంది.

రామ—ఇఁక నేను శిల్పులను బిలిపించి, మాట్లాడి, మంచిముహూర్తమునఁ దత్కార్యమున కుపక్రమించెదను.

భద్ర—చిత్తము. మాకు సెలవిప్పించండి వెళ్ళివస్తాము.

రామ—మంచిది.

[భద్రారెడ్డి, బాపినీడు నిష్క్రమింతురు]

రామ—ముకుందరావుగారూ! మీరు మధ్యాహ్నము నేర్పరులగు శిల్పులు మనగృహమునకు వచ్చునట్లు చేయవలయును. ఆలయనిర్మాణక్రమ మేరీతి నుండవలయునో వారితో నాలోచింపవలయును. ఈకార్యము మనము త్వరలోనే చేసి, శ్రీరామచంద్రుని యనుగ్రహమునకుఁ బాత్రులము కావలయును.

ముకుం—అయ్యా! నేనడుగుచుంటినని మీ రాగ్రహింపవలదు. మీరు చెప్పిన దేవతాభవన నిర్మాణకార్యము సామాన్యమైనది కాదు! ఇందులకుఁ గావలసిన ద్రవ్యము మనకింతలో నౌనఁ గూడునా.

రామ—ధనము విషయమై మనము సంశయింపఁ బనిలేదు. నాకీబుద్ధి

పుట్టించిన శ్రీరామమూర్తియే యందులకుఁగూడఁ దోడ్పడును. అదియుంగాక, ఈవిషయమునఁ దాలూకా గ్రామములో నున్న జనులు నెమ్మదిగాఁ దోడ్పడకమానరు. ఈలోపుగ గత సంవత్సరములతాలూకు వసూలైన శిస్తు ఆఱులక్షలు మన యొద్ద నిలువయున్నది. ప్రస్తుతము దానిని వినియోగపఱతును. పిమ్మట భగవంతుఁ డున్నాఁడు.

ముకుం——రామదాసుగారూ! తమమాట కడ్డము చెప్పుచున్నందులకు క్షమింపఁ గోరెదను.

తే. గీ. లేఁడు చూడంగ మ్లేచ్ఛుండు లేశ మీరు
ధనము వెచ్చించుమాట నతండు విన్న
నెట్టిహాని మీ కొనఁగూర్ప నెంచువాఁడొ
సంశయం బగుచున్నది డెందమందు.

మహానుభావా! సర్కారుపైకము తమరు వ్యయపఱచినచో నెట్టి యనర్థకములు వచ్చునో. ఒకవేళ తమ రాసొమ్మును మరల లెక్కల పరీక్ష వేళ కేదోతీరునఁ బూర్తి చేయవచ్చునని తలంతురేమో! ఆరులక్షల పైక మింతత్వరలో నాలయ నిర్మాణమునకై ప్రజల వలన మనకు వచ్చుట కష్టమని నా యభిప్రాయము.

రామ——ముకుందరావుగారూ! మీరీ విషయమున సంశయముగాని, భయముగాని పొందనవసరములేదు. అయ్యది సర్కారు పైక మనుటకు సందియములేదు. కాని దానిని మనము భగవంతుని గూర్చి వ్యయపఱచుచుంటిమి. శ్రీరామసేవకుఁడ నగు నాకుఁ దానివలన భయమావంతయుఁ గలుగదు. "తండ్రీ! శ్రీరామచంద్రా! నిన్ను నమ్మి నేనీకార్యము జేయుచున్నాను. నన్ను రక్షించుభారము నీయది" అని పరమాత్ముండగు రాముని వేడుకొని కార్యమున కుపక్రమించు మనకు సంశయమేల ?

భగవంతుఁ డగు నాతనిని నమ్మినవారి కెప్పుడును నాపదలు కలుగవు.

ఉ. తాటకిని దాటకిం దునిమి యాగముఁ గాచి యహల్యఁ బ్రోచి, సీ
తాలలనన్ వరించి రణ దర్పిత రావణ కుంభకర్ణము
ఖ్యాలి వధించి, రాజ్యము నయంబుగ నేలిన రామచంద్ర భూ
పాలుఁడు రంగశాయి మనపాలఁ గలండు విచారమేటికిన్.

కావున నిట్టిశంకలతోఁబనిలేదు. నేనుచెప్పినట్లుమీరుచేయుఁగోరెదను.

ముకుం—చిత్తము. నేను సెలవు తీసికొందును. (నిష్క్రమించును)

రామ—(శ్రీరాము నుద్దేశించి) తండ్రీ! రామచంద్రా!

మ. నిను నశ్రాంతము నమ్మి,నీకు గుడినిన్ నిర్మింపఁగాఁ బాదుషా
ధనమిప్పట్టున వెచ్చబెట్టఁగను జిత్తంబందు భావించినాఁ
డను గానన్ గృతకృత్యుఁ జేసి నను వేడ్కంజూచి, మోహానియున్
గనకుండన్ బొనరింపుమీ సుజనరక్షా దక్ష! సీతాపతీ!

(నిష్క్రమించును.)

[ బ్రాహ్మణులు, రామదాసు ప్రవేశము ]

రామ—విప్రోత్తములారా! మీయాశీర్వచన మహిమచే నింతవఱకు నిర్విఘ్నముగ శ్రీరామాలయము నిర్మింపఁగలిగితిని. శ్రీరామచంద్రమూర్తి నాకు దర్శన మొసంగఁడయ్యెనని మిగులఁబరితాప పడుచుంటిని. మద్గురువర్యుండగు కబీరు ననుగ్రహంబున నేఁడు నాకు శ్రీరామచంద్రుల దర్శనంబగును. నవరత్న ఖచితంబగు నీదివ్యాసనము, నీసుగంధద్రవ్యములు, నీ సహస్ర పుష్పమాలికలు, నీపూజోపహారములు — సర్వమును శ్రీరామచంద్ర కైంకర్యమునకై జాగ్రత్తపఱిచితిని? మీరందరును బుణ్యాత్ములు గావున నిందే వేచియుండి మనలఁ గన్నతండ్రియగు రామచంద్రమూర్తి దర్శనము గావించుకొనవలయును. ఆహా!

సువర్ణ తారహారాలంకృత కమనీయలక్ష్మీనివాస కౌస్తుభమాలాలంకృత దివ్యవక్షస్థలుండును,వనమాలికాబంధుర నీల నీరదశ్యామలకోమలాంగుండును, సహస్రమయూఖ దేదీప్యమాన దివ్యప్రభామయుండును, సుందరమందస్మిత నిండితేందు సౌందర్యశుభాలంకారచిన్మయవదనకమలుండును,మౌనిబృందసందోహసమర్చితసముంచితదివ్యపాదకమలయుగళుండును, బృందారకానీకచికురభ్రమరసమాక్రాంత సంఫుల్ల పాదపద్మండును, దేవేంద్రాదిసమస్త దేవతాకోటికోటీరకిరీటవిరాజమానవరత్ననీరాజితసుందరచరణతలుండును, చిదానందకందళితహృదయారవిందుండును, బ్రహ్మరుద్రేంద్రాదిలోకపాలకనికరజననహేతుభూతుండును. పిపీలికాది బ్రహ్మపర్యంత సమస్తజీవ లోకాంతర్యామతుండును, ప్రకృతికారణుండును, ప్రకృతిపరుండును, పరాత్పరుండును నగు నా శ్రీరామచంద్రుని—సీతాసుందరేందీవరాక్షీహృదయమందిరుని—భక్తజనమందారుని—నీభౌతిక దేహంబుతోడ నర్చించి తరింపఁగల మహాభాగ్యంబు నాకుఁ గాక—నే కాలంబునఁ గాని యెవ్వరికిఁ గాని లభించెనే? మహాత్ములారా!ఇదియంతయుఁ దమ యాశీర్వచనఫలముగాని వేఱొండు కాదు.

బ్రాహ్మ—రామదాసుగారూ! దివ్యప్రభావ సంపన్నులరగు తమయెదుట మేమెంతటి వారము? మముఁ బెద్దఁజేసెదరేమి?

రామ—కాదు—కాదు-మహాత్ములారా! ఇదియంతయు బ్రాహ్మణమహాత్మ్యమే.

శ్లో॥ దైవాధీనం జగత్సర్వం
మంత్రాధీనంతు దైవతం

తన్మంత్రం బ్రాహ్మణాధీనం
బ్రాహ్మణో మమ దేవతా॥
అనిగదా పరమేశ్వరు వాక్యము.

[రామదాసు భార్యయు, కుమారుఁడును పుష్పమాలికలతోఁ ప్రవేశింతురు.]

రామ—బ్రాహ్మణోత్తములారా! నేను మానవజన్మమునంది చేయఁదగిన యుత్తమకార్యము— శ్రీరామాలయనిర్మాణము పరిపూర్ణంబయ్యె. ఇఁక నేఁడు శ్రీరామదర్శనంబైన వెంటనే మత్సతీసుతులతోడ భగవత్పాద సన్నిధానమున దేహము చాలించి నిత్యమై-నిర్వ్యాజమై— నిరుపమానమై నిరంజనమై నెగడునేదివ్యపదవిగలదో దానినాకాంక్షించి యనుభవింతును, దయాస్వాంతమున పూజ్యులగు మీరందరును మాకుటుంబము నాశీర్వదించి యనన్యలభ్య కైవల్యసామ్రాజ్యమునకుఁ బంపవలయును. ఇదియే తుది కోరిక.

( నమస్కరించును. )

బ్రాహ్మ—రామదాసుగారూ! శ్రీరామచంద్ర దర్శనానంతరమున మేముమాత్ర మీ మొండిశరీరమును గాపాడుకొనుచు భూమిపైనుందుమా? మేమందఱమును మీతోడివారమే! అనుగ్రహించి మమ్ము నయితము తమవెంటఁ గొనిపొండు.

రామ—మిత్రులారా! మిగుల నానందమయ్యె? రామచంద్ర మహాతేజ మేవంకనుండివచ్చునో—మనల నెట్లనుగ్రహించునో తెలియరాదయ్యె! కావున మనమందఱము నైక్యకంఠ్యమున శ్రీరామచంద్ర సంకీర్తనము గావించుచు భగవత్కటాక్షమున కెదురు చూచుచుందము.

(అందఱును పాడుచుందురు)

కళ్యాణి—ఆది.

జానకీనాయక । సత్యప్రదాయక ।
సామజపాలన । సత్వగుణా ॥ ॥జా॥
దీనజనావన । దివ్యకృపాఘన ।
మానవపావన । మామవరామా ॥ ॥జా॥
శ్రీరమానాయక । సితశతసాయక ।
పారవార నిబంధనరామా ॥జా॥

(బురదలో పొరలిన దున్నపోతొకటి వచ్చి పుష్పమాలలను కొమ్ములకుఁ దగిలించుకొని యుపహారములం దిని సుగంధద్రవ్యముల నొలకబోసి యందుపొరలి శుభ్రమగు శయ్యపైఁపడి దొరలుచున్నది.)

బ్రాహ్మ—(తత్తరముతో లేచి) అయ్యయ్యో! రామదాసుగారూ! రామదాసుగారూ! భగవదపచారము; భగవదపచారము— బురదలో పొరలిన దుష్టమహిషమొకటివచ్చి పూజాద్రవ్యముల నల్లకల్లోలముచేసి శ్రీరామచంద్రమూర్తికై నిర్మింపఁబడిన శయ్యాతలమును కళంకముచేయుచు పొరలుచున్నది. లెండు. లెండు. కన్నులు తెరవుఁడు.

రామ—(లేచి ఆగ్రహముతో) ఆః! ఆఁ! ఎంతపని జరిగినది! నాశ్రీరామచంద్రపూజాప్రయత్నమును విఘ్నముగావింప నీదుష్టమహిషమెకడ దాపురించెను. ఓ పాపస్వరూపిణీ! మత్సంకల్పవిఘ్నకారిణీ! దేవపూజావిధ్వంసినీ! లెమ్ము—లెమ్ము! నాతండ్రికై నిర్మించిన సుఖాసనము నెట్లు కళంకపఱచితివి; పోవకుంటివా నిన్నిదే ప్రహరింతును.

(కొట్టుచున్నాఁడు. మహిషము అఱచుచు పాఱిపోవుచున్నది.)

రామ—(విచారముతో) విప్రోత్తములారా! నాదేవదేవునకు— నను
గన్నతండ్రికి నేఁడెంత యాగ్రహము గలిగినదోకదా! సమయ
మున కీదుష్టమహిమ యెక్కడనుండి వచ్చెను? సతీమణీ! ఇంక
మాటల కెడములేదు. భగవంతుఁడు ప్రసన్నమగు సమయము
కావచ్చినది. కళంకములగు నీపదార్థములను తీసివేసి నూతన
పదార్థములచే యథాప్రకారముగా నలంకరింపుము.

(తెరలో)

రామదాసూ! అవికళంకములుకావు. వానిని తీయవలదు. తీయవలదు.

రామ—ఎవరీమాటలాడునది?

(కబీరు ప్రవేశము.)

కబీ—గీ. వలదు; వలదాపదార్థంబు మలినమంచు
నవలఁ ద్రోయఁగఁబోకు;రమాంఘ్రిపద్మ
మలినలేశంబుగాని, దుర్మహిమ దేహ
పంకమాత్రంబు గాదు; దుశ్శంక లేల?

రామ—గురువర్యా! సమయమునకు వచ్చితిరి. నమస్కారము!
చూచితిరా నాప్రయత్నం బెట్లైనదో!

కబీ—నీప్రయత్నంబు సఫలంబైనది. కాని సాక్షాత్కరించిన శ్రీరామ
చంద్రమూర్తిని గ్రహింపఁజాలక, మందుఁడవైతివి.

రామ—ఆఁ! ఆఁ—అదియెటులు? శ్రీరామచంద్రమూర్తి నాకెప్పుడు
ప్రత్యక్షమయ్యెను?

కబీ—వెఱ్ఱివాఁడా! నీభక్తి యింకను బరిపక్వంబుగాని కారణమున,
నీవు మనలఁ గన్నతండ్రి నెరుంగఁజాలకపోతివి?

సీ. క్షుద్రాత్ము సోమకాసురుఁ ద్రుంప నెవ్వాఁడు
జలచర రూపమై జననమందె

నాదిత్యులనుగావ నలకూర్మ రూపమై
యుదధిలో నేదేవుఁ డుద్భవించె
వసుమతీ రమణిఁ గాపాడ నెవ్వాఁడు వ
రాహరూపంబయి ప్రభవమందె
బాలకుఁ బ్రహ్లాదుఁ బాలింప నెవఁడు పం
చాననాకృతితోడ నవతరించె

నణువు మొదలుగాఁగ నజుని పర్యంత చ
రాచరముల నెవని ప్రకృతి నిలచు
నతఁడె నేఁడు మహిమమై నీకుఁ గాన్పించె
నరయఁజాలవైతి వా మహాత్మ.

రామ—హా! శ్రీరామచంద్ర! శ్రీరామచంద్ర! (మూర్ఛిల్లును.)

కబీ—

సీ. ముజ్జగంబుల కాదిమునియైన నారదు
నఱువది బిడ్డల తరుణిఁ జేసె
నీలకంధరు మోహినీదేవి వెనువెంట
నోడ లెఱుంగకఁ బరువిడఁగ జేసె
రాయబార సభాంతరంబునఁ గురువంశ
భూపుల నప్రతిభులను జేసె
రామునిఁ గాంచి విభ్రములైన మునుల యా
దవ పద్మగంధీశతంబుఁ జేసె

నట్టి విష్ణుమాయ నజరుద్ర వాసవు
లైన నెఱుఁగఁజాల రనిన నింకఁ
బ్రకృతి మాయచేత బంధింపఁబడిన యీ
రామదాసుఁ డెంత రాము నెఱుఁగ.

రామ—(లేచి దుఃఖముతో) హా! హా! నా రామచంద్రుని—నా రఘువంశోద్ధారకుని—నా తండ్రిని—నా దేవదేవుని — నా సుందరశ్యామలాంగుని — నా తోయదశ్యాముని — నా భద్రగిరినిలయుని—నా విప్రదక్షకుని—నా స్వామిని—నా పాడుచేతులతోఁ బ్రహరించితినా? కుసుమసుకుమారమైన స్వామిమృదుశరీరము ప్రహారములపాలయ్యెనా? రామచంద్రా! నన్ను రక్షింపుమని దీనత్వంబున వేఁడుకొనఁదగిన నానోటితోఁడఁ దీవ్రనిందాభాషణముల నాడితినా? విస్ఫారిత శతపత్రసమానసుందరములగు నీ విశాలనేత్రములనుండి కన్నీరు మున్నీరుగాఁ గార్పించితినా? గురువర్యా! గురువర్యా! నాకింక నేదిదారి? రామచంద్రుని జూచుకోరిక నా కేటికి గలిగె—బ్రహ్మఘాతకుఁడ—శిశుఘాతకుఁడు—పితృఘాతకుఁడు — నాకన్నఁ బుణ్యాత్ములగుదురు గదా! రామచంద్రునకు నాపై నెట్లు కృపగలుగును ?—నాతండ్రీ! రామచంద్రా! రామచంద్రా! నినుఁ బ్రహరించితినయ్యా! రామా! నిను దండించితినయ్యా! రామా!—ఇట్టి నన్నేలనింక జీవింపఁజేసెదవు రామా! శ్రీరామా! నా కళ్యాణరామా! నీపట్టభంగము చేయ సంకల్పించినవారి నందఱ నొక్కపెట్టున హతమార్తునని బయలుదేఱిన యుగ్రస్వభావుఁడగు నీ తమ్ముఁడు లక్ష్మణుఁడు నేఁడింద్రజిత్తును సంహరించిన బాణములతోఁడ నాపైఁబడి శిరఃకర్తన మాచరించును గాఁబోలును? అట్లా మహాభాగునిచేతి మరణమైన కైవల్యమగునే. రామా! నాపైకి నీతమ్ముని నేలబంపవు రామా! నీకపకార మొనరించిన రావణాదిక్రూరదానవసమూహములలో నొకండనైతినే రామచంద్రా! తల్లీ! జానకీదేవీ! నాజననీ! నీపతిని—జగత్పతినిఁ బ్రహరించితిని. నీ తీవ్రశాపాహతులచే

నన్నేల భస్మీభూతము గావింపవు? రామా! రామా! దొంగ తనముగవచ్చి నన్ను మోసగించి నాచే నపచారము చేయించి తివా? రామచంద్రా! శ్రీరామచంద్రా! నీయనంతకోట్యవతా రముల నెఱుంగ నాసాధ్యమగునా? అల్పజ్ఞుండనగు నాతోడనా పరిహాసము! రామా! రామా! నిన్నుఁ బ్రహరించి పాపంబుఁ గట్టుకొంటిని; రఘురామా! నేనిఁక బ్రతుకలేను. రామ చంద్రా! రామచంద్రా! గురువర్యా! నాకిందు కేదేని తరుణోపాయ ముపదేశింపకున్న నేనునీపాదపద్మంబులను విడు వను—విడువను; (పాదములపైఁ బడును.)

కబీ—వత్సా! రామదాసూ! లెమ్ము — కన్నీరు దుడుచుకొనుము. దుఃఖింపకుము. తండ్రియెడ కుమారుఁ డపచారంబుసలిపిన నది తండ్రి గణించునా? భక్తవత్సలుండగు శ్రీరామచంద్రమూర్తి నీభక్తిం బరీక్షింపఁ దలఁచి యిట్లొనరించెనేకాని వేఱుగాదు; అదిగాక రామదాసూ! వాంఛారహితంబగు భక్తియే పరమో త్కృష్టంబనంబఱగు ప్రతిఫలాపేక్షాశూన్యంబగు భక్తిభావం బున నావరంధాముని గొల్చుటయే మనకర్తవ్యంబు గాని— యనంతరభారంబంతయు నాతనిదే! ప్రతిఫలాశా పరిపూరితం బగు భక్తిభావంబొక వర్తకమువంటిది; దాని నటులుండనిమ్ము మహిమావతారంబున నేఁడు నిన్ననుగ్రహించిన దేవదేవుని మహిమం బించుక నీకుఁ జవిఁజూపించెదను.—చూడుము.

(శయ్యపైనున్న మన్ను వాసనచూపి)

సీ. శ్రీరామచంద్ర శరీరసంగతమైన
మృత్తిక గాదిది మృగమదంబు

రామ—(కన్నుల కద్దుకొనును.)

కబీ—(పాదచిహ్నములంజూపి)

మహిమపాదాంక రమ్యమ్ములైన శంఖ చ
క్రాది చిహ్నముల నందందుఁ గనుము;

రామ—హా! రామచంద్రా! రామచంద్రా!
(కన్నుల కద్దుకొనును)

కబీ—మలినంబులా యివ్వి మహిజాపతి నివేది
తంబులౌ సదుపహారంబులివ్వి;

రామ—(కన్నుల కద్దుకొనును.)

కబీ—(శ్రీరామవిగ్రహముంజూపి)
కాంచుము నీ ప్రహరించిన దద్దు లీ
రామచంద్రుని శరీరమునఁగలవు;

రామ—(దుఃఖావేశముతో)
గీ. మార సుకుమార ! నాదు ప్రేమంపుస్వామి !
రఘుకులాంభోధిచంద్ర ! నారామచంద్ర !
తెలివిలేమిని నిన్ను బాధించినాఁడ !
రామ! నీపాదములె గతి రామ! రామ!

కబీ—నీమనోవైకల్యము భగవద్భజనచేఁగాని మానదు. మన మందఱ మిప్పుడుభక్తులతోఁగలసి శ్రీరామాలయమునకరుగుదమురండు.

(అందరు నిష్క్రమింతురు)

రంగము:—శ్రీరాముని యాలయము.

( ప్రవేశము:—సోమయాజులు, దీక్షితులు. )

సోమ—దీక్షితులూ! మొత్తముమీద రామదాసుగారుతలఁచుకొన్న కార్య మిట్టె చేసినారు. ఈ శ్రీరామదేవుని కైంకర్యమున కెంత సొమ్మైనదో కదా ?

దీక్షి—ఎంతగాకేమి? ఆరులక్షల వరహాలయినవఁట! ఈయాలయము-ఇందు గర్భగృహము—ముఖమంటపము—ధ్వజస్తంభము—ప్రాకారంబులు—రథము మొదలగునవి మన మేదేవాలయమునఁ జూచియుండలేదు. ఇవియన్నియు నట్లుండ శ్రీ సీతారామలక్ష్మణభరతశత్రుఘ్నులకు వేరువేరుగ నవరత్నఖచితములగు హేమభూషణములను జేయించి యలంకరించినారు. నిజముగా భద్రాద్రిరామస్వామిని దర్శించినవారిదే పుణ్యము.

సోమ—నిజము-శ్రీరాముని విగ్రహముఁ జూచుచు చేతులు జోడించి,

శ్లో॥ హేరామభద్రాశ్రయ హేకృపాళో
హేభక్తలోకైకవరేణ్యమూర్తే
పునంతుమాం త్వచ్చరణారవిందం
జగత్పవిత్రం చరణం మమాస్తే.

దీక్షి—[ఎదుటజూచి] ఏమండోయి సోమయాజులుగారు! రామదాసుగారు స్వామిసందర్శనార్థమై వచ్చుచున్నారు. చూడుఁడు. ఆమహనీయుఁ డెట్టి తేజముతో నొప్పుచున్నాఁడో!

సోమ—పరమభాగవతాగ్రేసరు లట్లే యుందురు.

రామ—[ప్రవేశించి]

నాదనామక్రియ—ఆదితాళము

భజరే శ్రీరామం । హే మానస భజరే రఘురామం ।
భజరే రఘురామం భండనభీమం । రజనిచరౌఘవిరామం
వనరుహాశయనం-కనదహిశయనం-మనసిజకోటి సమానం॥భజ॥
తారకనామం-దశరథరామం-శ్రీతులసీదళ శ్రీకరదామం॥భజ॥
శ్యామలగాత్రం-సత్యచరిత్రం-రామదాసహృద్రాజీవమిత్రం॥భ॥

ఓమనసా! పెన్నిధానమును, మోక్షసంధానమును నగు శ్రీరామమంత్రమును నీవు మరువవలదు. అశాశ్వతమగు సంసారఘోరా

టవిల్లోదూటి రామభజన విడనాడకుము. దాశరథీకథామృత సారములోని రుచి సమస్త పాపముల నిర్మూలనము చేయునని యెఱుంగుము. (శ్రీరామాదుల విగ్రహములఁజూచి) భగవత్సం దర్శన మెంత యుత్సాహమునుఁ గలుగఁజేయుచున్నది. ఆహా! శ్రీరామచంద్రుఁడు జన్మించినపుడు నేనుగూడ నయోధ్య యం దుఁ బుట్టియున్నచో సీతారాములకు సేవలుజేసి కృతార్థుఁడనై యుందునుకదా! శివధనుర్భంగముఁ గావించి యమ్మహాత్ముఁడు జానకిం గొనునప్పు డకల్యాణవైభవము నేను కన్నులారఁ జూచి యానందించియుందునుకదా! (ఇంచుకనడిచి) ఓహో! సోమయాజులుగారును, దీక్షితులుగారూనా? స్వామి సందర్శ నార్థమె యరుదెంచితిరా ?

దీక్షి—చిత్తము.

సోమ—రామదాసుగారు! తమకీర్తిచంద్రికలు దశదిశలఁ గాయును. మీారు నిశ్చలచిత్తమున శ్రీరాముని మదినిల్పి సేవించుచుండు వారగుటచే, నిట్టి యాలయనిర్మాణముఁ జేయించిరి. కాని సామాన్యులకు నిది యలవియగుకార్యముకాదు.

రామ—అయ్యా! ఇందు నేను నిమిత్తమాత్రుఁడను. శ్రీరామమూర్తి యే నాచే నిట్టికార్యముఁ జేయించినాఁడు. కాకున్నచో నల్పుఁ డనగు నావలననగు కార్యమేమున్నది. (ఎదుటఁ జూచుచు శ్రీరాము నుద్దేశించి) రామచంద్రా! కరుణాసాంద్రా!

శా. నీపైనిల్పితి భారమెల్లననుచుఁ జింతింపగా నాకునుఁ
బ్రాపై యీాగుడిఁగట్టఁజేసితివి వహ్వా! నీదు భక్తాళికిఁ
దాపం బింతయుఁగల్గునే! భువిని నీదాక్షిణ్యమే యున్నచో
నాపద్బాంధవ! జానకీరమణ! రామా! భక్తకల్పద్రుమా!

రామా! శుభనామా! తులసీదళదామాభిరామా ! జానకీరామా !
నీవీ భద్రగిరియం దాచంద్రార్కతారావనీశరథిస్థాయిగ నెల

కొనియుండి, భక్తులసేవలం గొనుచు వారిని నిరంతరము రక్షించుచుండుము.

సీ. పావనంబైన గోదావరీవాహిని
భవ్యమౌ విరజాస్రవంతిగాఁగ
నీకు నివాసమై నేఁడు రాజిలు భద్ర
గిరియె శ్రీవైకుంఠపురముగాఁగ
నిరతంబు నీదివ్యచరణసేవను సేయు
ధరణీసురాగ్రణుల్ సురులు గాఁగఁ
నిశ్చలచిత్తులౌ నిజభక్తతతమాన
సములు క్రీడాప్రదేశములుగాఁగఁ
తే. గీ. దలఁచి యిచ్చోటఁ గృపఁబూని ధరణిజాయు
తుండవై తమ్ముఁడగు లక్ష్మణుండు గొలువ
వెలసి రక్షింపుచుండుము పృథ్వినెల్ల
రమ్య కరుణాస్వభావ! శ్రీరామదేవ!

దీక్షి—రామదాసుగారూ! తామిచ్చటకు వచ్చిన పిదప నందఱును శ్రీరామభక్తులయిరి. శ్రీరామనామచింతనాప్రభావము వర్ణనాతీతము.

రామ—లోకమంతయు శ్రీరామభక్తులై యుండవలయుననియే నా తలంపు. దీక్షితులుగారూ! ఈమానవజన్మ కెప్పటికిని సుఖము లేదు. నరుని రేతస్సువలన నారీగర్భమునఁ బడిన శుక్లశోణిత మలమూత్రములలో దొర్లుచు, నెప్పుడు గర్భ నరకమునుండి విముక్తిఁగాంతునా యని భగవంతుని వేఁడుకొనుచుఁ గొన్నాళ్ళును, జన్మించినపిదప బాల్యావస్థలఁ గొన్నాళ్ళును, మద మత్సరంబులఁబూని మోహాబ్ధిని మున్గి కొన్నాళ్ళును, దారా

పుత్రాదిమోహంబులఁ గలిగి వర్తించి కొన్నాళ్లును, వృద్ధత్వము ప్రాప్తించినంతనే యొకరిని బ్రతిమాలుకొనుచుఁ గాలంబు గడుపుచుఁ గొన్నాళ్లును, చరించి తుదకు దేహంబుల వాసి, చేసిన పాపములకు యమునిచేఁ శిక్షలు పొందుదురు. కావున నట్లుగాకుండఁ బ్రతిమానవుఁడును, నాలిబిడ్డలచే హేయముగఁ జూడఁబడకమున్నే—వృద్ధత్వమునఁ గూలి మంచమునెక్కి— మలమూత్రములలో మునుఁగకమున్నే -కఫవాతపైత్యములు కంఠమున కడ్డుపడి మాటాడనీయకమున్నే-భగవంతుఁడు - పురాణపురుషుఁడు— సకలలోకైకచక్రవర్తి-ఆశ్రితజనరక్షాదక్షుదీక్షాకరుఁడు-అఖిలమునిదేవతాహృదయసంచారి— నీరదాభ్రవిమలశరీరుఁడు నిర్వికారుఁడు-కౌస్తుభవనమాలుఁడు-దైత్యవిఘాలుఁడు మాయామానవదేహుఁడు నగు శ్రీరామచంద్రుని భజించి కృతార్థుఁడు కావలయును.

పరమాత్ముఁడు—(ప్రవేశించి) అహ్హా! తహసీల్ దారుగారూ! వందనము లర్పించుచున్నాను.

రామ—ఓహో! పరమాత్ముఁడా! నీవు గోలకొండనుండియే కదా వచ్చుచున్నావు ?

పర—చిత్తము.

రామ—

సీ. కుశలంబుగందురే! శశిమౌళిపాదాబ్జ
మకరందరసపానమత్తచిత్తు
లైన మామామ లాయక్కన్న మాదనల్,
సౌఖ్యమే కద! పాదుషాకు; నతని
బంధుమిత్రకళత్రవర్గంబు సేమమే;
యోధానుయోధులై యొప్పునట్టి

జాఫర్ మొదలైన శౌర్యధనులకు భ
ద్రమే, గోలుకొండ సామ్రాజ్యలక్ష్మి
తే. గీ. భూరిశాత్రవభీతని బొందకుండ
సంతసంబున నుండునే; వింతలేమి?
నీవు వచ్చినపనియేమి? నిజము దెలిపి
రాముసాక్షిగ మోదంబు రహినిగూర్పు.

పర—దేవా! నేను అక్కన్న మాదన్నల పంపున మీసన్నిధికి వచ్చితిని. అమ్మహనీయులు, భద్రాచలము తాలూకాలెక్కలు తనకీచేయఁగా నాఱులక్షల పైకము నిల్వ యేర్పడినది గావునఁ దత్క్షణ మాపైకముఁ బంపుమనియు, మేమీవార్త తానీషాకుఁ దెలియకుండఁ బంపితిమనియు, నతఁడెఱిఁగెనేని మాటవచ్చుననియు మీతోఁ జెప్పుమనిరి.

రామ—పరమాత్మునీ[illegible]! మామామలు నాయందు దయాంతరంగులై పంపించిన వార్తకు సంతసించితిని. వారితో నావచనంబులుగా నిట్లు పలుకుము. "మామలారా! మీకటాక్షమున నేనియ్యెడ కరుదెంచి శ్రీసీతారామచంద్రమూర్తికి నాలయప్రాకారాదులఁ గట్టించి రామసేవకుండనై యొప్పుచున్నాను. శ్రీరామమూర్తి యనుగ్రహ మున్నచో సర్కారుపైకము త్వరలోనే పంపెదను. భూమిజానాథునికృపయున్న మీభూమీశుఁడు గూడ నాయందుఁ గరుణవహించును. అదిలేకున్న నిది యుండదు." [ఇంచుక యూరకుండి] ఓయీ! ఆలయనిర్మాణాది కార్యములఁ జూచితివా? స్వామివారిని దర్శించితివా?

పర—[శ్రీరామునకు నమస్కరించును.]

రామ—[శ్రీరాము నుద్దేశించి]

ఉ. పైకముఁ బంపుమంచిపుడు వార్తనుబంపిరి మంత్రివర్యులిం
కేకరణిన్ నవాబునకు నేనొసఁగం గలవాఁడ ద్రవ్యమున్
శ్రీకర! పంకజాక్షు! కృపఁ జేర్చి మనంబున నింద నాపయిన్
రాక తొలంగఁజేయఁగదె రామ! సుధీజన పారిజాతమా!

శా. వాలాయంబుగ నన్నుఁ గాతువనుచున్ భావంబులో నమ్మి నీ
పాల న్జేరితినయ్య! యిప్పుడు కృపాపాథోనిధీ! ధీనిధీ!
పాలన్మించిన నీటముంచిన సరే భారంబు నీదాట నా
కేలా వేఱొకచింత నందఁగను తండ్రీ! రామచంద్రప్రభూ!

(పరమాత్మునిఁజూచి)పరమాత్మా! రమ్ము గృహమునకుఁ బోవుదము.

(నిష్క్రమింతురు)

సోమ—దీక్షితులూ! మనముగూడఁ బోవుదము. రమ్ము.

(ఇరువురును నిష్క్రమింతురు]

రంగము:—గృహమందు రామదాసుగారు ప్రవేశము.

రామ—(తనలో) సర్కారుపైకము నేను వ్రయపఱచి శ్రీరామాలయనిర్మాణాది భగవత్కార్యములఁ జేయించినానని తానీషాకుఁ దెలిసినట్లు కర్ణాకర్ణికగా వినియున్నవాఁడ. ఒకవేళ తొందరగా పైకమునిమ్మని గోల్కొండనుండి యాజ్ఞాపత్రము వచ్చెనేని, మామేనమామలచేతనైన నిప్పింతమన్న వారు కాశీయాత్రకేగిరని వింటిని. ఇట్టిది తటస్థించునని యూహించియే, పరమాత్ముని నాకడకుఁ బుత్తెంచిరి. ఇప్పుడు నేనేమి సేయుదును? సర్కారునకుఁ బైకముఁ బంపుటయెట్లు! [ఆలోచించి] ఏమిది? అజ్ఞానాబ్ధిలోఁబడి యిట్లు చింతించుచున్నాను. భారమంతయు శ్రీరామునిపై నుంచితిని. రక్షించినను శిక్షించినను నాతఁడే కర్త. దీనికై విచారమందనేల? భగవంతుని యాజ్ఞ

యెట్లున్న నట్లగును. [ఎడమ కన్న
మకన్నదరుచున్నది. నాకెట్టి యశుభ

ఉ. "నమ్మితి రామచంద్ర! మదినమ్మితి రాజకు,
నమ్మితికీర్తిసాంద్ర! కడునమ్మితి దాసచకోరచం,
నమ్మిక లేమిచేసెదవొ నమ్మఁగ నర్హులుగాని వార,
నమ్మిన యాదయాబ్ధి వని నమ్మితి నిన్మది జానకీపతీ.

[యాకూబ్ హుస్సేన్ అను యిరువురు భటులు ఖడ్గపాణు
ప్రవేశించుచున్నారు.]

యాకూ—అరేహుస్సేన్! దేఖో. తాసిల్‌దార్ యిదర్ బైఠే.

హుస్సేన్—[రామదాసుగారిని సమీపించి] తాసిల్‌దార్ సాబ్ సలాం.

యాకూ—మహారాజ్! పాద్షాతానీషా ఫర్మానం దియే దేఖో. (కాగితమును రామదాసుగారి కిచ్చును.)

హుస్సే—ఉఠోజీ! గోల్కొండకు ఆవ్.

రామ—[ఫర్మానము చదివి తనలో] "ఆహా! భద్రాచలముతాలూకాపై నిదివఱకు నిలువయుండి, నీచేత వసూలు చేయఁబడినదని మాకుఁ దెలియవచ్చిన ఆఱులక్షలపైకము తత్క్షణము యీ హర్కారులద్వారా పంపనియెడల నీవు మాచేఁ గారాగృహంబున బంధింపఁ బడుదు"వని యీ ఫర్మానమున వ్రాయఁబడియున్నది. అకటా! ఇప్పుడు నేనేమి సేయుదును! (శ్రీరాము నుద్దేశించి) దాసజనచకోరచంద్రా! శ్రీరామచంద్రా! నీ చరణదాసుఁడనై యనవరతము నిన్నునమ్మి సర్కారుపైకమంతయు వెచ్చపెట్టితిని. నా నెత్తిపై నిందపడకుండ, నలువురిలో నవమానము గలుగకుండ రక్షింపుము. భారమంతయు నీయదియే.

• సు.

ుంగవ! నీచరణాబ్జసేవ సం
ంతతభక్తిని, సంతతంబు న
ంద్య! మనమందున దేనికిఁ గుంద, భక్తర
మని చకరంగ నమ్మితి జానకీపతీ!.

జవాబుచెప్పేదిలేక రాముశిరఃతలుస్తారు. పాదుషా హుకుం సూశార్ తాలూకామీనా మీకీ వసూల్ చేసి తరులచ్చల్ పైకం సిక్కా యిప్పుడుపెట్టాండీ. అదిలేకపోతే 'లోకాండకు అవ్, తివాసీదిండు లెక్కా దిగూ సాబ్.

స—హుక్కుకు అందర్ తాసిల్‌దార్లు పైకం అంతా వచ్చింది. బాకీ మీరు ఒకరే. నిమిషమైనా మీకి నిల్వనీయుడానికి మాకు హుకుంలేదు. పైకంయిచ్చేతోపర్వాలేదు. నైతో హుంక్యాకర్తే నవాబ్ కా హుకుం చెలాయిస్తాము. దేతే! దేతేనై? బోలో! దుస్రాబాత్ జరూర్ నై.

రామ—హర్కారులారా! ఏలయీలీల మీరు నన్నుఁ దొందరపెట్టెదరు. ఈక్షణమునఁ బైకమంతయుఁ దెమ్మన్న నెట్లు తెచ్చెదను. శ్రీరామచంద్రమూర్తి కరుణ రావలయునుకదా.

హుస్సే—సర్కార్ పైకంఅంతా సల్లగా ఖర్చుపెట్టి ఫరాకత్ గా కూర్చుండావు. మీరాముడు యిప్పుడు పైకం యిస్తాడేమో మాకీ సూస్తాం.

యాకూబ్—(హుస్సేనుని జూచి) క్యారే! ఫోజరుగుర్ బాత్ నైకూ. వునేపాస్ పైసానై, సర్కార్‌కా హుకుం అమల్ కరో.

హుస్సే—అచ్చా (రామదాసునుజూచి) గోపన్నగార్! మాకీ యేమీ సేస్తాము. మీకీ పాదుషాదగ్గిరకు రావాలి, పైకంలేదంటే మీకీ సంకెళ్ళు యేసి తెమ్మనిహుకుం, మాకి యేస్తున్నాము, దేఖో.
(రామదాసుగారి చేతులకు సంకెళ్ళు వేయుదురు.)

[సుశీల, కుమారుఁడు; కొందఱు పౌరులు ప్రవేశింతురు]

**సుశీల**—(తొందరగాఁ బ్రవేశించి రామదాసుగారిని జూచి) నాథా! ఇదియేమి?

**రామ**—నారీమణీ! శ్రీరామచంద్రుఁడు నాయందుఁ గరుణించి వీరిచే నాకు వేయించిన హేమకంకణములు.

**సుశీల**—అక్కటా! నేనేమిచేయుదును. శ్రీరామమూర్తి మిమ్ముఁ గరుణింపఁడా! సర్కారు సొమ్మునకై మిమ్ముఁ గారాగారబద్ధులఁ జేయుదురా! ఇఁక నేనెట్లు జీవింతును. వీరిప్పుడు మిమ్ము గోలకొండకు దీసికొని పోవుదురా! అయ్యో! అక్కడ తానీషా చక్రవర్తి యేమిచేయునో గదా! భగవత్కైంకర్యమునకై ధనము వెచ్చించిన మీకిట్టి పరాభవము రావలసినదా?

**రామ**—తరుణీ! దీనికై నీవు చింతింపవలదు. నాపైనున్న మోహముచే నట్లు పలికెదవుగాని మానవతత్త్వ రహస్యమును సంపూర్తిగ గ్రహించినచో నీ చింతయే యుండదు. అయినను నీవుగాని నేనుగాని యిప్పుడధైర్యమంది చింతించుట కవసరములేదు. నాచేత నట్టి మహత్కార్యములఁ జేయించిన కరుణాసాగరుఁడగు రామదేవుఁడు నాకు నిట్టి కష్టములఁ గల్పించునా? కల్పింపఁడు. నేను వీరి వెంట గోలకొండకేగి పాదుషాను దర్శించి చెప్పవలసిన దంతయుఁ జెప్పెదను. రఘునందనుఁ డాతని హృదయమునఁ బ్రవేశించి సద్బుద్ధిఁ బ్రసాదింపక యుండునా? నీవు ధైర్యచిత్తవై యుండుము. శ్రీరామసేవ నరమాత్రము మఱువవలదు. కుమారుని జాగరూకతతో నరయుచుండుము. నేను లేకున్నను శ్రీరామపూజాది సత్కృత్యములు యథాప్రకారము జరుపుచుండుము. లోనికిఁ బొమ్ము.

సుశీ—మి మ్మారామచంద్రమూర్తియే రక్షించును.

[నిష్క్రమించును.]

యాకూ—సర్కారు పైకం అంతా గల్లత్ సేసీ రాముడూ వుండాడని భోత్ ధైర్యంగా మాటల్ సెప్తార్.

వాలుస్సే—రండి—బేగి నడ్వండి.

రామ—హర్కారులారా! మీరు యీ మాత్రము నాకొక మహోపకార మును జేయవలయును. మన మేగునప్పుడు శ్రీరామాలయ మార్గమునను గోదావరినదీ మార్గముననుబోవుదము. దూరము ననుండియే మా శ్రీరామచంద్రమూర్తిని దర్శించెద.

యాకూ—మీ దేము పైకం యిస్తాడేమిటి వోయ్?

రామ—ఇచ్చినను నీయకున్నను నన్ను రక్షించు భారమంతయు నమ్మ హాత్మునిదే. అద్దేవాదిదేవుఁ డనుగ్రహించె నేని సర్కారు పైక మిచ్చుటకు నిమిషకాలము పట్టదు.

[మందిరము విడిచి యీవలకు వత్తురు. తెర వ్రాలును]

రామ—[కొంచెము దూరము నడిచి] ఇదిగో! దేవాలయమును సమీ పించినాము. దూరముననుండియే భగవంతునిఁ బ్రార్థించివచ్చె దను. [శ్రీరాము నుద్దేశించి] హే రామచంద్రా! భక్తరక్షణ పారీణా!

శా. సర్కార్ పైక మొసంగలేదనుచుఁ బాద్షాయాజ్ఞపై నన్ను నీ హర్కారుల్ గొనిపోవుచుండిరట కేయాపత్తు ప్రాపించునో తుర్కల్ హానియొనర్తురేమొ యని యెంతో భీతిగల్గెఁ సహ స్రార్క ప్రాభవ తేజ! కావుము ననుఁ సర్వేశ! సీతాపతీ!

ఓలోకనాయకా! నీభక్తుఁడనైన నాకు వంతలు ఘటింపకుము. నిరంత రము నీచరణసేవఁ జేసికొనుచు జీవయాత్ర వెడలఁదీయఁ దలఁ

చిన నాయుద్యమమున కంతరాయముగలిగింపకుము. సర్కారు పైకము హరించితి ననునింద నాకు రాకుండ రక్షింపుము. నిన్నుదప్ప గలనైన పరదైవంబుల వేఁడను.

ఉ. కోరినకోర్కులెల్ల సమకూర్చెడి జీవవిభుండు గల్గఁగా
స్వైరిణి వానివీడి పెరవారల పొందును గోరునట్లు, నిం
పార శుభంబు లిచ్చెడి మహాత్ముని నిన్విడి యన్యదేవతా
వారము గొల్వనేమిటికి వారిజలోచన! జానకీపతీ!

దేవా! నేను బంధితుఁడనై గోల్కొండకుఁ బోవుచున్నాను. భవదీయ దివ్యమంగళవిగ్రహ సందర్శనము మరల నాకుఁ ద్వరలో లభింపఁజేయుము. తండ్రీ! నేను నీకు దూరమైయున్నను నీమూర్తి నాహృదయపీఠమునఁ బ్రతిష్ఠించి యహర్నిశములు సేవ సేయుచునే యుందును.

మ. చిరకాలంబున నుండి నీచరణరాజీవద్వయంబుల్ మహా
దరభావంబునఁ గొల్చుచుంటిఁ, బరమార్థంబంచు భావించి, సు
స్థిరసౌఖ్యంబు నొసంగుమంటె, నిఁక నీచిత్తంబు నా భాగ్య మే
దరి జూపింతువొ భద్రశైలపుర సీతారామచంద్రప్రభూ!

(భటులనుజూచి) హర్కారులారా! అల్లదే గోదావరీ పావనస్రవంతి ఒకసారి దర్శించి పోవుదము.

(అందఱును నిష్క్రమింతురు.)

ఇది తృతీయాంకము.

శ్రీ

# రామదాసు

## చతుర్థాంకము.

రంగము:—తానీషా దర్బారు.

[తానీషాయు, సహాయమంత్రి యగు జాఫర్ ఖానుఁడును ప్రవేశించుచున్నారు]

తానీ—క్యాహై జాఫర్ ఖాఁ! గోపన్నాకు లకాయే. నైక్యాహై రాకార్

జాఫర్—అబిచ్ లాతే సర్కార్.

తానీ—జల్దీ లెకానాకువాస్తే దుస్రాజవాఁ భేజ్ దేవ?

జాఫర్—(ఎదుటజూచి) జరుగుర్ నై సర్కార్! వదేఖో! భద్రాచలంకా తాసీల్దార్ గోపన్నా ఆతే.

[బంధింపఁబడిన రామదాసుగారు భటులతోఁ బ్రవేశించును.]

తానీ— (రామదాసుగారిని జూచి) గోపన్నగారూ! మీరు మా ముఖ్యమంత్రులగు నక్కన్న మాదన్న గార్లకు బాంధవులనియు, నింతకుమున్ను మీతండ్రిగారు గోల్కొండసంస్థానమున నున్న వారనియుఁ దలఁచి మీకు భద్రాచలము తహసీల్ దారు. పని నొసంగినాము. కాని యిట్టివారగుదురని నే నెన్నఁడును తలఁచలేదు. సర్కారు పైకము వసూలు చేసినవెంటనే యిక్కడి

కేల పంపలేదు. మ్లేచ్ఛచక్రవర్తి నీతానీషా మీ సామాన్యుఁడుగాఁ గనిపించెనుగా? ఏదీ మీరు వసూలు ఆఱులక్షలపైకము మా యెదుట నుంచుఁడు?

రామ—పాదుషాగారూ! మీరు నాపై నాగ్రహముఁబూనక శాంతచిత్తులై నా వాక్యము లాలింపుఁడు. నేను తాశీల్దాఁ నుండి సర్కారునకు వ్యతిరేకమైన కార్యముగాని, నష్టమువచ్చు కార్యముగాని చేసియుండలేదు. నేను వసూలుచేసిన పైకమ ఎన్నియో సంవత్సరములనుండి తాలూకా గ్రామములలో నుండు రైతులవలన మనకు రావలసినదై యున్నది. ఇంతకు మున్నచ్చట తహాసీల్దార్లుగనున్న బుద్ధిమంతు లెల్లరును నా పైకము వసూలుకాదని వదలివేసిరి. నే నరిగినపిమ్మట శ్రీరాముని యనుగ్రహమునఁ గతిపయదినములలోనే వసూలుచేయఁ గల్గితిని.

తానీ—తెలివి కలిగి వసూలు చేసినవాఁడవు వెంటనే మా కేల పంపలేదు?

రామ—దేవా! దానిని తమకోటకే వినియోగపఱచితినిగాని దుర్వ్యయమేమియు చేయలేదు.

తానీ—ఏమీ! మాకోటకే వినియోగపఱచితివా? ఎట్లు?

రామ—వినుఁడు.

సీ. నిండారుఁబారు నఖండ గోదావరీ
పావన దివ్యస్రవంతితోడ
స్నానమాడినయంత సకలాఘములఁ బాపి
విలసిల్లు శ్రీకృష్ణవేణితోడ
కష్టంబులను ద్రోలి కమనీయసౌఖ్యతతుల్
నెలయించు కావేరి జలముతోడ

౮౦ గడుత్తుంగతరంగరాజిత యశాచుఁ
బరిఢవిల్లెడు తుంగభద్రతోడ

తే. గీ ॥ రాణ దీపించు నియ్యాంధ్రరాజ్యలక్ష్మి
కాభరణముగా నొనరింప నాత్మఁ దలఁచి
భద్రగిరియందు రామదేవాలయంబుఁ
గట్టినాఁడ మీసామ్ముచే ఖానువర్య!

సీ. మల్లికార్జునునకు మందిరం బైసట్టి
శ్రీశైలపర్వతశ్రేణితోడ
పానకాల్ రాయని వాసస్థలం బాచు
నలరిన మంగళాచలముతోడ
వేంకటేశాభిఖ్య వెలసిన శ్రీహరి
కాలయంబైన శేషాద్రితోడ
శ్రీరమేశునకు విహారప్రదేశమై
రాజిల్లు హరికుధరంబుతోడ

తే. గీ. సమముగానుండి యాంధ్రరాజ్యంబునందుఁ
బుణ్యభూమిగ భద్రాద్రి పొల్పెసంగ
స్వామికైకంర్యమును జేయఁజాలినాఁడ
నీధనముచేత జానకీనాథుకృపను.

తానీ—ఔరా! ఇదియంతయు స్వంతసొమ్మని తలంచియే ఖర్చుపెట్టితివి కాబోలు! గుండెబెదురు లేకపోయెనుగా? ఎంతధైర్యము! అందుకనే గోపన్నగారివంటి ధర్మపరుఁడును, రామభక్తుఁడును లేఁడని పేరువచ్చినది. పరధనముల హరించి యిట్టికార్యములు చేసినచో నిన్నుఁ బుణ్యము చెందునని తలంచితివా! మార్గములఁ గాచి పాంథులశిరముల బ్రద్దలుగొట్టి సంపాదించినధనమును

చోరుఁ డొకఁడింత ధర్మము చేసినంతమాత్రమున వానికిముక్తి వచ్చునా ? ఛీ! నీవిట్టి చోరుఁడవని నేనెఱుఁగలేక పోయితిని.

రామ—నవాబుగారూ! నేనొనర్చిన చౌర్యకృత్య మేమియులేదు. నేను శ్రీరామాలయనిర్మాణాదిసత్కార్యములకు వినియోగించిన ధనమంతయు మీదేయని లోకమున కెఱుఁగఁ జేసియే యుంటిని. ఈధర్మమంతయు మీయదే. దీనికి ఫలము భగవంతుఁడగు రామమూర్తి మీకేయొసంగును. మీవాఁడనై నేనొనర్చిన యీ సత్కార్యముల కాగ్రహింపవలదు. మీ రాజ్యంబున గోదావరీతీరంబుననుండి శ్రీరామచంద్రునకు నివాసమైన భద్రగిరి పుణ్యక్షేత్రమై యొప్పుట మీకుఁ గీర్తికరము కాదె. నేను వెచ్చించిన యీస్వల్పధనము మీనగరున నొక్కనాఁటి ఖర్చని తలంపుఁడు.

తానీ—(కోపముతో) నీవు బ్రాహ్మణుఁడవు గాన బ్రదికిపోయితివి. లేకున్న నిట్టి యకార్యము జేసినందునకు, నా కరవాలంబునకు నీశిరము బలిగా నీయవలసినదే. రాముఁడనియు, గీముఁడనియు వెట్టి పలుకులఁ బలుకుచు దొంగభక్తుఁడవై యందఱను వంచించుటయేగాక సర్కారు పైకమంతయు వెచ్చించి సిగ్గుచే జావక యేల యీలీల నింకను బ్రదికి యుంటివి? రాముఁడట దైవమఁట! ఇట్టి వాక్యము లింకను నీ విచ్చట నాడుచుంటివేని మా తురుష్కులు నిన్ను ఖండించి ముక్కముక్కలుగాఁ జేసి గ్రద్దలకు వైతురు.

రామ—ఖానువర్యా! నేను భగవత్ప్రీత్యర్థము మీ సొమ్మంతయు మీపేరున వినియోగించితిని గాని నా సంసారమునకై వ్యయపఱుపలేదు. మీరు నన్ను దూషించినను సమ్మతమే. కాని జగన్నాయకుండును, లీలామానవ దేహుఁడును, శరణాగత

త్రాణ బిరుదాంకితుండగు నగు మా రామదేవుని మాత్రము దూషింపవలదు. అయ్యది మీకు ధర్మముగాదు. ఇంతవఱకును మీరు హిందూ మహమ్మదీయ సమ్మేళన మొనర్చి రాజ్య పాలన మొనర్చుచు యశముగాంచుచుండిరి. తమరాష్ట్రమున నెన్ని మోమసీదులఁ గట్టించుట కెంత యోధనము వెచ్చించిరి మీరు వెచ్చించినదానిలో సహస్రాంశమైనను భద్రాద్రి శ్రీరామాలయ నిర్మాణమునకు నేను వెచ్చించి యుండను. కావున నాయందుఁ జలమువహింపక మన్నింపఁ బ్రార్థించు చున్నాను.

తానీ—ఇంతధనము వెచ్చించిన నిన్ను నేను మాటలతో విడిచిపెట్టు దునని తలంచుచుంటివా? ఇప్పుడు నీవు మాకు పైకమంతయుఁ జెల్లించెదవా? లేక చెఱసాల కేఁగెదవా?

జాఫర్—సార్కార్. ఐసాపూఛో.

రామ—(తానీషానుజూచి)

శా. రామస్వామిపదాంబుజంబు లెద నారాధించుచున్ సర్వదా
రామాజ్ఞన్ దలఁదాల్చి వర్తిలుచు మీద్రవ్యంబు నార్లక్షలున్
రామస్వామికె యిచ్చి సేవకుఁడనై రాజిల్లుచున్నాఁడ నిం
కేమాసిక్కన్ ధనమీయనోపుదును మీకీవేళ మ్లేచ్ఛాగ్రణీ!

కాని భగవంతుని కరుణయున్నచో ధనము సర్వస్వము మీకుచేరునని చెప్పఁగలను. దానికిఁ గాలపరిమితిమాత్రము బెట్టఁజాలను. మారామయ్యతండ్రి కేనాఁటికి దయవచ్చునో?

తానీ—నాకిదియంతయుఁ దెలియదు. నీవు మాకుఁ బైకమిచ్చు వఱ కును బందిగంబున నుండుము.

రామ—సీ. తనయధ్వజసముద్యద్ఝారి వాతంబు
వైరిప్రతాప దీపంబులార్పఁ

దనశౌర్యభాస్కరోదయకాంతి శత్రుగ
ర్వాంధకారంబును నడఁచివేయఁ
దనభేరిభాంకరణ నిఖిలారినృపాల
మండలిగుండెలు పిండసేయఁ
దనసైన్యధాటికోద్ధతధూళి రిపుసేన
నుప్పునుచును వేగ నూదివేయఁ

తే. గీ. ప్రబలగోల్కొండవిమల సామ్రాజ్యలక్ష్మిఁ
బాలనము సేయుచున్న నీవంటిప్రభుఁడు
రామభక్తుని నన్ను గారాగృహమున
నుంచుటది ధర్మమందువే యుర్విపాల?

పిచ్చుకపైన బ్రహ్మాస్త్రమన్నట్లు నన్నా నీవు సాధింపఁదలచితివి? నాయందేదైన దోషముగలదా? (ఇంచుక యూరకుండి) తురుష్కాగ్రగణ్యా! నే నీరీతి వచించుచుండుట చెఱసాలకు భయమంది యని తలంపవలదు. ఇదిధర్మముకాదని విన్నవించుకొనుచుంటిని. శ్రీరామచరణపద్మారాధకుండనైన నే నామహనీయునికొఱకెన్ని కష్టములయినను బొందుదును. పరమేశ్వరునిప్రీతికయి నే నందుకష్టములన్నియు నాకు సౌఖ్యములుగనే పరిణమించును. నిశ్చలానందచిత్తుఁడై శ్రీరాముని సేవించువాని కీప్రపంచసుఖములతోఁ బనిలేదు. అట్టివాఁడు నగరంబున నుండిననేమి? అరణ్యంబున నుండిననేమి? హంసతూలికాతల్పమునఁ బండిననేమి? కటికనేలను బండిననేమి? [ఇంచుక యూరకుండి] స్వామీ! మీచిత్తము. కారాగృహమున నుంచినను సరే—నన్ను ఖండించినను సరే.

ఉ. శ్రీలలనామనోహరుఁ డశేషగుణాకరుఁ డవ్యయుండు ది
క్పాలకిరీటదివ్యమణి కాంతివిరాజితపాదపద్ముఁడా

నీలగళార్చితుండు ఘననిర్మలతేజుఁడు రామమూర్తి నా
పాలిఁట నిల్చియుండఁగను భావమునందు విచారమేటికిఁ.

తానీ—(ఎదుటఁ జూచి) అరేయాకూబ్! గోపన్నాకు జైలుకా లేక్ జావ్ (సింహాసనమునుండి లేచి యీవలకువచ్చి) జాఫర్ ఖాఁ! ఆవ్.

(ఇరువురు నిష్క్రమింతురు.)

యాకూబ్—ఆరే గోపన్నగారూ! రండి. ఖైద్మేవుండాలి. బడాపక్కా పనిచేశావునీవు. సర్కార్ పైకంత్వరగాయిచ్చేతో తంటానహీ నైతో పాదుషాసర్కార్ మీకీఖలేజాతింటార్. ముసల్మానాకా తడాఖా తుంకు మాలుంనై. ఆవ్. జల్దీఆవ్. దుస్రాబాత్ చెప్పినావంటే దేఖో! హాత్ మేక్యాహై? తర్వార్ హై మాలుం?

రామ—(తనలో) రామచంద్రా! నీవేతప్ప నితరదైవము లేఁడనినిన్నే నమ్మి, నీకై యెంతయో సర్కారుధనము వెచ్చించి, యాలయ ప్రాకారాదుల నిర్మించిన నీభక్తుఁడనగు నాకీ కారాగృహవాసము వ్రాసిపెట్టితివా! నీసంకల్ప మెట్లున్నదో కనుఁగొనఁజాలనుకదా ?

సీ. ఒరుల కెప్పుడుఁ గీడు నొనరింపగాఁబోను
పరయువతులపైన భ్రాంతిగొనను
స్వప్నంబునందైన సత్యంబు దప్పను
న్యాయమార్గంబు నెన్నండు విడను
విమలమౌనీసేవ విడనాడి యెఱుఁగను
జనుల కెప్పుడు మేలె కనుచునుందు
సాంగత్యమేవేళ సజ్జనావళితోడ
నితరులసంపద కీర్ష్యఁ జెంద

తే. గీ. నట్టినిర్మలచరితుండ నైననాకు
నిట్టిశిక్షను విధియించి తేల నకట!

భవ్యకారుణ్యగుణధామ ! భవవిరామ !
రవికులాంభోధిసోమ ! శ్రీరామ! రామ.

తండ్రీ! నే నేదియో పూర్వజన్మమునఁ గొంచెముపాపము జేసికొని యుండుటచే నాకిట్టిశిక్షఁ గూర్చితివి. కాకున్నచో నన్ను రక్షింపవలయునని యుద్దేశమున్న రక్షింపఁజాలకయుందువా?

ఉ. "దీక్షవహించి నాకొలఁదిదీనల నెండఱఁ గాచితో జగ
ద్రక్షక! మున్ను నాద్రుపదరాజతనూజ తలంచినంతనే
యక్షయమైనవల్వ లిడి తక్కట! నామొఱలాలకించి ప్ర
త్యక్షము గా వదేమిటికి దాశరథీ! కరుణాపయోనిధీ."

యాకూ—రోతేకైకూ! సంక్కార్ పైకం గల్లంత్ కరే, అవ్.

రామ—రామా! చెఱకేగుటకు సెలవిచ్చెదవా?

కీర్తన. నాదనామక్రియ—ఏకతాళము.

సెలవా మాకు - సెలవా యీ చెఱ కేగ ॥సెల॥
సెలవా మాకిఁక - జలజసంభవనుత
జలజాతనేత్ర - సజ్జనమిత్ర శ్రీరామ ॥సెల॥
నీవాఁడ నన్నేలుకోవా - యిటు వేగరావా-
సమయముకాన - రామయ్య ॥సెల॥
వాసిగ భద్రాద్రివాసా - వరరామ-
దాసహృదయనివాసా - రామయ్య ॥సెల॥
(అని పాడుచు భటునితో నిష్క్రమించును)

రంగము:—చెఱసాల.

[రామదాసుగారు విచారముతోఁ బ్రవేశము]

రామ—(తనలో శ్రీరాముని నుద్దేశించి) దేవా! రామచంద్రా! నా యందేమి యపరాధముఁ గనిపెట్టి నన్నీ చెఱసాల ననుభవిం

పఁ జేసితివి! చతుర్గోపలభిత్సంవృతంబును, సాంద్రాంధ రచ్ఛటాన్వితంబును, ఘోరకృపాణపాణిభటనిర్భిద్ర ప్రచారంబును నగు నీ కారాగృహమే నాకు నీపాదారవిందభజన మందిరముగాఁ జేసితివా?

సీ. శబరి యిచ్చినపండ్లు చవిఁజూచి మోక్షంబు
నిడు నల్పసంతోషి నీవుకాదె
యట్టిచో నీ చరణారవిందములనే
భావంబులోపలఁ బాదుకొల్పి
భజనసేయుచు నీకుఁ బాదుపాద్రవ్యంబు
చేతఁ గైంకర్యంబుఁ జేసినందు
కా! తండ్రి! యీరీతిఁ గారాగృహంబందు
నన్నుంచగాఁ జేసినావు; భళిర !

తే. గీ. యీ దురక్షణదక్షుఁడ వన్నమాట
నిలుపకొనుటన్న నిదియెనా నిర్మలాత్మ!
దాసుఁడను వేఁడుకొనుచుండ దయనుబూన
వేల? రావేల? జానకీలోల! రామ!

మాటిమాటికిని బైకము నొసంగుమని యహంకారమును నా యెడల ననేక క్రూరకృత్యములఁ జేయుచున్న యీతురుష్కభటుల ముందు నిలువఁజాలకయున్నాను. రామచంద్రప్రభో! ఆర్తుఁడనై నీశరణుఁ బొందిన నన్నేల రక్షింపవు? నీవు కృపాసాగరుండవే!

మ. అతసీపుష్పసమప్రకాశ! పరిపూర్ణానందసందోహ! సం
తతసీతాహృదయానివాస! జలజాతప్రోద్భవాధీశ! యా
యతపాపౌఘవినాశ! భాసురకటాక్షావేశ! సర్వేశ! నా
మతియందెప్పుడు నిల్పుమీ కృపను రామా! భక్తకల్పద్రుమా!

# చతుర్థాంకము.

మహానుభావా! యమకింకరసన్నిభులగు నీ తురుష్కుల దండనలకు తాళఁజాలక యున్నాను.

సీ. "సరాకరుపైకంబు ఝూడగా దేవురే"
యంచుఁ గోపమునఁ దూషించినారు
"దేవురే పైస పై దేఖోతమాషా" యంచు
మోటులాటీలచే మోదినారు
"రామ్ముకైసా తుమార పయిసా దేతహాం
దేకా" యనుచుఁ బడదిట్టినారు
"నిల్వాబే బేకూబ్ నిల్చిమాటాడు బే"
యంచు మించి పరాభవించినారు
తే. గీ. క్రూరమత్తులై తురుష్కులు కొంటెలగుచు
నింక రక్షింపరాకున్న నేమిసేతు
నఖిల సజ్జనమందార! యఘవిదూర!
రమ్యగుణహార! శ్రీదశరథకుమార!

మహానుభావా! చతుర్దశభువనపరిపాలా! నీనిమిత్తము నేను వెచ్చించిన పైక మొసంగునందాక, బందిగంబునందే యుండుమని తురుష్కచక్రవర్తి యాజ్ఞ. నేనా పైక మెట్లు చెల్లింతును. ఎట్లు చెఱనుండి విముక్తుండ నగుదును.

భటుడు— (రామదాసుగారిని జూచి) ఏమ్రాబోయ్! మాకీ రాత్రి పగల్ ప్రాణాల్ కొఱకేస్తుండావ్. నోరుమూసుకొని పండు కొనేదిలేదూ. రామ్ము! రామ్మూ! యని యేడ్సేలో ఫాయిదా క్యాహై; రామ్మూలేదు - దేమ్మూలేదు.

రామ—ఓ తురుష్కభటుఁడా! నేను శ్రీరాముని భజించుకొనుటకూడ మీకే కష్టముగ నున్నదా? నాయనా! నేను మహాకష్టములో నున్నవాఁడనుగాన, భగవంతుఁడగు శ్రీరామచంద్రమూర్తి, నన్నుద్ధరించునని వేఁడుచున్నాఁడ.

**భటు**—వేడుకొంటున్నావు. ఏడ్చుకుంటూన్నావు. రామ్డూకు మెహర్బా నినై. ఆయాతో, జైల్ మే భోత్ కష్టం మీకుయెందుకు, నీకి మింగిన సర్కార్ పైకం రామ్డు యిస్తాడువోయ్. రామ్డూకో?

**రామ**—తలఁచుకొన్నచో రాముఁడు పైకమంతయు నొసంగి, నన్ను రక్షింపఁగలఁడు. అతనిని మీ రలఁతిగ జూడవలదు. సకలసృష్టి స్థితిలయంబులకుఁ గారణుఁడు- ఆదిమధ్యాంతరహితుఁడు- అవ్యయుఁడు- అప్రమేయుఁడు మోక్షకర్త—

**భటు**—ఐసాబోల్తే క్యారే! రామ్డూ మన్సీ కాదువోయ్. అట్లా చెప్పు. ఆషురాజ్, మాకీ మాలుంలే. బడాఅద్మీనీకు దొరికాడు. మీకీ ఆడు రచ్చిస్తాడ్ వోయి.

**రామ**—మా దైవమగు శ్రీరాముడు నిజమైన మానవుఁడని నీవు తలంచవలదు. దుష్టులవధించి భూభారము దీర్చునిమిత్తము మానవుఁడైన పుట్టినాఁడు. ఆతనిమహామహిమ నెఱుంగుటకు బ్రహ్మాదులకైనను దరము కాదు.

సీ. మనువంశతిలకుఁడై మహిమీఁద జన్మించి
              కౌశికమౌనియాగంబుఁ గాచి
శివువిల్లుఁ దున్మాడి సీతనుఁ బెండ్లాడి
              జనకాజ్ఞఁ గైకొని వనుల కేగి
ఖరదూషణులఁ దోలి ఖరకరసుతు నేలి
              వాలిని నొకకోలఁ గూల నేసి
మించి హనుమంతు మన్నించి జలధి దాఁటి
              శంక యింతయు లేక లంక కేగి

తే. గీ. రావణాదుల ఘోరసంగ్రామమందుఁ
గూల్చి విమలయశంబుఁ గైకొన్న రాముఁ

డాదినారాయణస్వామి యగుట నిజము
కేవలము మానవుం డౌట కేళిసుమ్మ.

భటు—ఎందూకు వూరికే గోలాచేస్తావు మీరాముడికి మారహీంకు లడాయి సేపిస్తావ్! ఎక్వా తక్వా మాకీదేక్తా!

రామ—[తనలో] ఈయవివేకులు రాముఁడన నేమో? రహీం మన నేమో యెఱుంగుదురా?

[యాకూబ్, హుస్సేన్ ప్రవేశింతురు]

యాకూ—(రామదాసుగారినిజూచి) క్యాజీ! గోపన్నసాబ్ ! పైసా సరాకార్కి యిస్తావు లేహూ. ఒక్కబాత్ బోలో. లేకపోతే మీకీ షర్మం తియ్యమని హుజూరు హుకుం- క్యాబోల్తే ?

రామ—హరాకారులారా! ఏల యీలీల మాటిమాటికి నన్నుఁ బైకమిమ్మని బలవంతపఱచెదరు? శ్రీరాముఁడు నన్ను దయతోఁ జూచినప్పుడు గాని పైకముఁ జెల్లింపజాలనని రూఢిగాఁ దెలిసికొనుఁడు.

భటు—రామ్డూ రామ్డూ అని మమ్మల్ని మర్గయా చేస్తుండావు బొమ్మనే.

హు—మాకీ పైకంసంగతి అడిగేతో, భోత్ జబర్‌దస్తీగా మాట్లాడుతావు యేంవోయ్!

యాకూబ్—సరాకార్ నీకి సఫాయిసేయ్యాల అని మాకీ హుకుం యిచ్చి వుండార్. [భటునిజూచి] ఏ దర్వాజా కోలేరే!

భటు—(చెఱసాల తలుపు తీయును)

యాకూ—(రామదాసుని జూచి) దివానాలా నిల్చడు తావు యేం. ఇదరావు జల్దీ. (రెకకబట్టుకొని యీవలకు యీడ్చుచున్నాఁడు.)

రామ—హా! రామచంద్రా! భక్తపరతంత్రా!

చ. కటకట! రామచంద్ర! ననుఁ గావఁగదే యిటు వేగ రాఁగదే
కుటిలమనస్కులై రిపులు క్రూరభయంకరతర్జనంబులన్
పటుతరరోషభీషణత బాధలఁ బెట్టఁగఁ దాళఁజాల నీ
పటువిశిఖంబులం దునిమి పాఱఁగఁ దోలవె జానకీపతీ!

యాకూ—ఏబొమ్మ్నాకు పగడోకే.

హుస్సే—(రామదాసును పట్టుకొనఁగా యాకూబు త్రాళ్ళతోఁ గట్టుచున్నాఁడు.)

రామ—శ్రీరామమూర్తీ! నీ వెచ్చటనున్నావు?

శంకరాభరణము—రూపకతాళము.

రక్షింపుమిదియేమో రాచకార్యముపుట్టె రామచంద్రా, నన్ను
రక్షింపకున్న రక్షకు లెవరింక రామచంద్రా!
అప్పులవారిడే అరికట్టుకున్నారు రామచంద్రా, స్వామీ
చెప్పశక్యము కాదు చక్షుర్గోచరమాయె రామచంద్రా ॥రక్షిం॥
కుక్షిలో మీమీదకోరికపుట్టెను రామచంద్రా, స్వామీ
యిక్ష్వాకుకులతిలక యిఁకనైన గావవే రామచంద్రా ॥రక్షిం॥
పక్షి వాహన నన్ను పాలించి దయజూడు రామచంద్రా, స్వామీ
అక్షయకటాక్ష అభిమానముంచవే రామచంద్రా ॥రక్షిం॥
అధికునిచేపట్టితి అడ్డమేమనుకొంటి రామచంద్రా, స్వామీ
అధములకన్నను అన్యాయమైపోతి రామచంద్రా ॥రక్షిం॥
భయమేమి నేరామదాసుండ ననుకొంటి రామచంద్రా, స్వామీ
భయముబాపిబ్రోవుమయ్య భద్రాద్రిపురనిలయ రామచంద్రా ॥రక్షిం॥

హుస్సే—ఈయేడుప్పా యేద్వకపోతే సర్కార్ పైకం యియ్యరాదూ వోయ్. (కొట్టుచున్నాఁడు)

రామ—హా! రామ! దైవతలలామా! శరనన్నవారిని గరుణించి రక్షించు మహానుభావుఁడవు నా మొఱనాలింపవేల; ఈముష్కర

తురుష్కులు పెట్టుబాధలకు నే నెట్లు తాళుదును. దీనులకు దిక్కైన నీ విప్పుడు నాకు దిక్కు కావేల?

చ. "కుక్షి నజాండపఙ్క్తు లొనగూర్చి చరాచరజంతుకోటి సం
రక్షణ జేయుతండ్రివి, పరంపరగాఁ దనయుండ నైన నా
పక్షము నీవు గాఁ దగవె పామరుఁడన్ గరుణించు మో జగ
ద్రక్షక! కర్త నీవెకద దాశరథీ! కరుణాపయోనిధీ!"

ఉ. నను నొక యల్పజీవిగ మనంబున నెంచి దురాత్ములక్కటా!
తనువున రక్త మొలుకనటు దండన సేయఁగసాగినారు; నీ
ఘనకృప నాపయిన్ బఱపి క్రన్నన వీరిని బాఱఁదోలి నా
తనువును గావవే యిఁకను తాపసవందిత! జానకీపతీ!

ఈయమదండనలనుండి నన్ను శీఘ్రముగ విముక్తుఁ జేయుము. ముప్పిరిత్రాళ్ళను నన్నుఁగట్టి నా తేజంబెల్లఁ దూల, దురుక్తులఁ బలుకుచు, సర్కారుపైకముఁ జెల్లించుటకుఁ గొరడాలతో బాదుచున్న వీరభటులకు నాయందు మంచిబుద్ధినిఁ బ్రసాదింపుము. ఈసమయంబున నీశరణాగతత్రాణబిరుదంబు దాఁచుకొనకుము.

శా. గంధేభేంద్రుఁడు నీరు ద్రావఁగ మహాగ్రాహంబు తత్పాదముల్
బధింపం ధృతిఁదూలి ముక్తికితరోపాయంబు లేకన్ జగ
ద్బంధున్ నిన్నుఁ దలంపఁ జక్రమున నవ్వైరిన్ మహాబాదగ్రు గ
ర్వాంధుం ద్రుంచి జగంబుఁ గాచుగతి నన్ రక్షింపవే రాఘవా!

హుస్సే—(యాకూబునుజూచి) అరే—క్యారే—గోపన్నాకు కొట్టితే నాకు వొళ్ళ్యా మంటల్ పెట్తుండాయి. నాకీకొట్టడానికి షానా భయం వేస్తుంది.

యాకూ—హాంకూబి హైసాహై—నీకంటెమాకీ నిండామంటల్ గావుంది. [రామదాసుగారినిజూచి] ఆరేబొమ్మన్! నీదివొళ్ళు కాదువోయ్ ఉక్కుగుండు. మాకీదెబ్బల్ తగలలేదువోయ్.

రామ—భటులారా! మీ దెబ్బలు నన్నేమిసేయును?

చ. దినకరవంశమందు ఘనదేవతలెల్లరు వేఁడఁ బుట్టి, యు
మ్మునిసుఖ మోమి, జానకిని బొందుగఁ బెండిలియాడి, తండ్రి
వనములకేగి, దేవపరిపంథులఁ గూల్చి నట్టి రా
ముని మది నమ్మియుండఁగను బొందఁగనేల భయంబు నా కిఁక

యాకూబ్—అరేహుస్సేన్! ఈయనీకి కొట్టితే కుచ్ ఫాయిదా లేద
గోల్కొండపైకం వచ్చేదిలేదు. ఈమంగలి మనము తానీష
సరాకరీకి బోలేతో, వాణి దిల్మేవున్నట్లు సేస్తార్. అవ
జల్దీ జావుంగా.

హుస్సేన్—ఈబొమ్మనీకి మళ్ళీఖైదుమేవుంచిపోదాము. (రామద
సును మరల ఖైదులోబెట్టి భటుని జూచి) అరే! ఈమంగ
మాకీ తానీషాపాదుషాకి బోల్నేకు జాతే! నీకీయిక్కడ జా
త్రగా ఫారాయిస్తూవుండు.

(ఇరువురును నిష్క్రమింతురు.)

భటు—(తనలో) ఇది భోత్ హాశ్చర్యంగావుంది. గోపన్నాకిదేహం
దెబ్బల్ తగ్లపూ! మాకీ జర్రా సోజాతే. (పండుకొనును.)

రామ—(తనలో) దేవా! వైకుంఠవాసా! నీప్రభావ మతిచిత్ర
నది! దానినెఱుంగుటకు బ్రహ్మాదులేశక్తులు గానప్పు
మానవమాత్రుఁడ నగు నేనెంతవాఁడ!

మ. కొరడాల్ గరమందుఁ బూని యటు గొంకుం జంకులేకుండ, 
ర్భరకోపంబున నన్ను దుర్మదులు దర్పంబేర్చి కొట్టంగ, నీ
వరకారుణ్యకటాక్షవీక్షణసుధన్ వర్షింపఁగాఁ జేసి నన్
బరిరక్షింపఁగఁ జాలినావు; వరదా! భద్రాద్రిరామప్రభో!

తండ్రీ! ఇట్లే నాయందు నిరంతరమును దయఁబూని రక్షిం
చుందుము.

అరే! క్యాబాత్ బోల్తేతూ! గోపన్నాకుడర్తెక్యా! వుస్కా మాఠ్కె కువాస్తే తుంజాతానై క్యా! తూ! బద్మాష్— దుస్సాహర్కారీకు భేజ్ దాల్తే-చలో!

రామ—(ఎదుటజూచి) ఆహా! ఈయార్భాటములేమి! (పరికించి) అదిగో! తానీషా దండతాడితమహోరగంబుకరణి మండిపడుచు, భుజాదండంబుల సాఁచి, పెటపెటమని పండ్లు కొఱుకుచు, నిజచరణ సంఘట్టనంబున కిలాతలంబు బ్రద్దలువారనన్ను దండించుటకు తురుష్కభటులతో నిట్లువచ్చుచున్నాఁడు ఓదీనరక్షామణీ! రామచంద్రా!

మ. భటులన్ వెంటనుబెట్టుకొంచు నకటా! పాదూతురుష్కుండు దాఁ జటులాహంకృతి వచ్చుచుండె నదిగో! స్వామీ! భయంబయ్యె నీ వెటు లింకన్ గృపతోడ నన్నరసెదో? యేభంగిఁ దానీమకున్ గుటిలత్వంబును బాపఁగాఁ గలిగెదో? కోదండరామప్రభో!

[అంత తానీషా భటులతోఁ బ్రవేశించును.]

తానీ—వీరభటులారా! యాకూబును, హుస్సేనును, గోపన్నను దండించుటకుభయంబందుచున్నారఁట! కారాగృహమునబంధింపఁబడినవానిని జూచి యింత భయంబందిన యామహావీరులెప్పుడయిన నవసరమువచ్చినప్పుడు రణరంగంబులయందేమి నిలువఁగలరు? (కారాగృహమందుఁ బందుకొనియున్నభటుని జూచి) అరే! సోతే క్యారే?

భటు—(తొందరగాలేచి తనలో) అరే—మాకీ ఎంతపనిచేశాము. పాదుషాసర్కారు వచ్చినారు. వీరు వస్తారని మాకి తెలిసింది లేదు—(ప్రకాశముగా) జీ! సర్కార్; సలామాలేకుం.

తానీ—తుం హ్యాకు సోతేకువాస్తే ఆయేక్యా!

భటు—నైనై సర్కార్—రాత్రి మాకు నిండా నిద్రనై మహారాజ్ !
గోపన్న రాంరాం మాకొంప తీస్తావుంది పాదుషాసాబ్ !

తానీ—(రామదాసునుజూచి) గోపన్నా !

చ. పరధన మంచు నెమ్మదిని భావనసేయక మాధనంబు దు
శ్చరితుఁడవై హరించి జనసంఘము దిట్టఁగ సిగ్గు లేక, యీ
కరణిని బందిగంబునను గాసిల నేమిటి; కింకనైన స
త్వరితగతిన్ ధనం బెసుము తప్పకనిన్ జెఱముక్తుఁ జేసెదన్.

ఉ. భూసురవంశమందు మణిపూసవిధంబున జన్మమంది, య
భ్యాసముజేసి విద్యలను భవ్యతరం బగు పేరు గాంచి, నిన్
నీసరివారు నవ్వ నవనీపతిపైకము వెచ్చఁబెట్టియుం
గాసిలఁ జుంటి పీచెఱను గాఁగలకార్యమిఁకేమి తెల్పుమా?

నీవు మాపైకమునిచ్చువఱకును విడువము. మాపైకమిచ్చెదవాలేదా? ఇంక నాభటులు నిన్ను నైపకు—నీప్రాణంబులఁ దీయుదురు. ప్రాణంబులపై నాస కలదేని సత్వరముగ నీవు వెచ్చఁబెట్టిన యారులక్షలను నొసంగుము.

రామ—తానీషాగారూ! అనవసరముగ నన్ను దూషింపవలదు. నేను మీధనంబును బుద్ధిపూర్వకముగ హరింపలేదు. నాయాలుబిడ్డలకు వస్తువులఁజేయింపలేదు. గృహములఁ గట్టించుకొనలేదు. సర్వము శ్రీరామార్పణము జేసినాఁడను. నేనొనర్చిన యీసత్కార్యమునకై సంతసించుటకు మారుగాఁ గినుకవహించి నన్ను బందిగంబునఁబడవైచి బాధలను బెట్టినందువలన మీకుఁ బ్రయోజన మేమున్నది ! శ్రీరామచరణసేవకుఁడనైన నేను వెచ్చించిన యాధనము—భక్తపరతంత్రుఁడగు నాభగవంతుఁడు నన్నుఁగారాగృహ విముక్తునిఁగా జేయఁదలఁచెనేని—యాతఁడే నాకు మారుగ మీకొసంగవలయును. కాని, నేను

మాత్రము మీకిప్పుడొసంగజాలను; ఇదియే నానిశ్చయము.

ఉ. కొట్టినఁ గొట్టుమయ్య నృపకుంజర! యింకిట నెట్టిబాధలున్
బెట్టినఁబెట్టుమయ్య మది భీతిని బొంద నొకింతయైన ని
ప్పట్టున జానకీరమణపాదసరోరుహచింతనంబునున్
గట్టిగఁ బట్టినాఁడ మదిఁగాంచఁగనేల భయంబు శిక్షకై॥

మీరెట్టికష్టములు నాకు ఘటిల్లఁజేసినను కరుణాసాగరుఁడు ఆర్తావనుడు—నన్నుఁ గన్నతండ్రి—నా యిలవేల్పు—ప్రభాకరవంశరత్నాకరసంపూర్ణసుధాకరుఁడు — అగు శ్రీరామమూర్తి నన్ననుగ్రహింపకపోఁడు. అట్టియెడ నేను చింతింపనేల?

తానీ—ఏమి నీధైర్యము! నిన్ను రాముఁడు రక్షించునుగా?మాపైకము హరించుమని శ్రీరాముఁడే బోధంచెనాయేమి? ఇట్టివానినేనా నీవు భగవంతుఁ డనుచుంటివి. భక్తరక్షణపరాయణుఁడగు నాతఁడు నిన్ను మాభటులు బాధలు పెట్టుచుండఁగాఁ జూచి యూరకొనెనేమి? తుఱకల ధాటికోర్వక మరల దండకారణ్యముల ప్రాంతములకుఁ బోయెనాయేమి?

రామ—దేవా! మా రామయ్యతండ్రిని నీ వలఁతిగ వీక్షింపవలదు. భక్తుల కష్టములు తనకష్టముగ భావించుకొని రక్షించువాఁడని తలఁపుడు. అంతియేగాని, యాతని నొకసామాన్యనరపాలునిగాఁ దలఁపవలదు. ఆతని మహామహిమ మీకేమి తెలియును. సనకసనందనాదిమునులును, బరమేష్ఠిప్రముఖాది దేవతలును వర్ణింప శక్తులుగారఁట.

మీనంబై జలరాశిఁజొచ్చియును బల్మిన్ సోమకున్ ద్రుంచి వే
దానీకంబును దెచ్చి యబ్జభవశక్రాదుల్ సుఖంబంది బ్ర
హ్మానందంబును బొందఁజేసిన జగన్మాన్యుండు లక్ష్మీశుఁ డౌ
శ్రీనారాయణుఁడే రఘూద్వహునిఁగాఁ జింతింపు మ్లేచ్ఛాగ్రణీ!

అమృతమునకై సురాసురులు పోరాడునప్పుడు మంధరపర్వతంబును
వీపునఁ దాల్చిన యా కూర్మమూర్తియే రాముఁడు.

మ. కనకాక్షుండు వధూటికోరికకునై భూచక్రముఁ జాపఁ జు
ట్టిన చందంబునఁ జుట్టుచుండఁ గని కుంఠీభూత చిత్తంబుతో
జనసంతాపనివారణంబునకునై సౌకర్యరూపంబునన్
దనుజుఁ ద్రుంచు రమామనోహరుఁడె సీతానాథుఁగా నెంచుమా.

శా. గంభీరంబగు రూపుతోడ నసురున్ ఖండింపఁగా నెంచి య
య్యంభోజాసనరుద్రులెల్లరు ననూనాశ్చర్యముఁ బొందఁగా
స్తంభంబందున నుద్భవంబయి మహాదైత్యున్ సురల్ మెచ్చఁగా
దంభప్రక్రియఁ జంపు నాహరియే సీతాకాంతుఁగా నెంచుమా.

మ. వడుగా యీతఁడటంచు నెల్లజనముల్ వర్ణింప బ్రహ్మాదులున్
గడుమోదింపఁగఁ దానవేంద్రు బలినిన్ గానంగ నేతెంచి మూఁ
డడుగుల్ దానము వేఁడి పుచ్చుకొని భూమ్యాది త్రిలోకంబులన్
గడు సొంపొందఁగ నింద్రు కిచ్చిన రమాకాంతుండు శ్రీరాముఁడే.

తననిజకుఠారధారాహతిని నిరువదియొక్కమారులు సమస్త క్షత్ర
కాంతారమును బరిచ్ఛేదించి తదీయ కళేబరములను నిర్జరలోకం
బునకు సోపానములుగఁ జేసి, తద్రుధిరముచేఁ బితృక్రియం
దీర్చిన పరశురాముఁడే శ్రీరామునిఁగ భావింపుము

మ. యదువంశంబునఁబుట్టి శైశవమునం దానందముం దన్ యశో
ద దయంజూచి వినోదలీలలను మోదంబందఁగా జేసి దు
ర్మదకంసాదులఁ ద్రుంచి యాదవుల సన్మానించుచున్ రుక్మిణీ
మదిరాక్షిం గొనినట్టి శ్రీహరిని రామస్వామిఁగా నెంచుమా.

శ్రీరాముఁ డవతారపురుషుఁడు ధరాభారము వాపుటకు దేవతలు
ప్రార్థింపఁగా రవివంశంబునఁ బ్రావిర్భవించినాఁడు.

మ. అరవిందాప్తకులంబుఁ బావనము సేయన్ బఙ్క్తికంఠాది దు
ర్భరదైత్యాళిపిగూల్ప దేవతలు సంప్రార్థింప విష్ణుండె యు
శ్కరణిన్ రాముఁడుగా జనించి సురలోకద్వేషులం ద్రుంచి స
త్కరుణన్ గాచెను సర్వలోకముల నిక్కంబెద్ది మ్లేచ్ఛాగ్రణీ!

తానీ—మీరాముని నుతించి యలసిపోయితివి. నేఁడు మాపైక
ముసంగెదవా? లేక నిన్ను మాయిచ్చవచ్చినయట్లు సేయు
మందువా?

రామ—పాదుషాగారూ! మీరేమిచేసిననుసరే; నేనందులకుబద్ధుఁడను.

తానీ—కానిమ్ము. నిన్ను బాధలుపెట్టినచో మీరాముఁ డడ్డమువచ్చి
మాతాలూకు పైకము నిచ్చునేమో చూచెదను. (భటులను
జూచి) భటులారా! ఈతని నాముండ్లకంచలపై నడిపించుఁడు.

భటు—ఆవ్- ఈయూల నీకు షాణాల్ తీస్తాం. (లాగుచున్నారు.)

రామ—

సీ. కాపాడఁగా రాదె కరిరాజు మొఱవిని
 మకరి దున్మాడిన మహిత గుణుఁడు
అడ్డపడఁగ రాదె యసురాధమునిఁ గూల్చి
 ప్రహ్లాదు నేలు కృపాకరుఁడు
రక్షింపఁగా రాదె యక్షయ వసనముల్
 పాండుపత్నికి నిచ్చు భవ్యయశుఁడు
భయముఁ బాపఁగ రాదె నయచరితుండు వి
 భీషణు నేలిన వీరమూర్తి

తే. గీ. అక్కటా! నాదు ప్రార్థన మాలకించి
 భక్తరక్షణ బిరుదంబు బయలుపెట్ట
 రాకయుండునె నను బ్రోవఁ బ్రాకటముగ
 రమ్యగుణమూర్తి భద్రాద్రి రామమూర్తి.

ఓ దేవాదిదేవా! సీతారామచంద్రప్రభో! నను రక్షించు పరమాత్ముఁడవు నీవే యని నమ్మియుంటిని. నీవు రక్షింపకున్న నాకెవ్వరు రక్షకులు. నీదాక్షిణ్యము నాపైఁజూపుట కిదియే సమయము. భక్తుఁడనైన నన్ను విడనాడఁదగదు. నేనేమియు నీయెడల నపరాధముఁ జేసియుండలేదు.

భటు—జల్దీ ఆవ్. సూస్తావేమి! ఈ ముళ్ళకంచల్ మీఁద మెక్కు.

(ముళ్ళకంచెలపై నెక్కించుచున్నారు)

రామ—(రాముని నుద్దేశించి)

సాకీ.

హే సచ్చిదానందపరాత్పర తారకబ్రహ్మస్వరూపా
హే బృందారకబృందవంద్యమాన సందీప్త చరణారవిందా
హే ప్రభాకరవంశరత్నాకర పరిపూర్ణసుధాకరా
హే భక్తజనసంరక్షణదీక్షాకటాక్షా
కడు గినుకవహించుచు మలకలు నాకిడు బాధల
వడి దోలుచు రక్షించుము నీపాదంబుల నెరనమ్మితి ॥హే॥

(ముండ్లపై త్రొందరగా నడచుచున్నాఁడు.)

భటు—అరే! ఇదియేం తమాషా! (తానీషానుజూచి)జీ! సర్కార్! తమాషా కైసీ హై దేఖే!

రామ—శ్రీరామదేవుని యనుగ్రహమున నాకీముండ్లు పూవులవలె మెత్తగ నున్నవి. (శ్రీరామునుద్దేశించి) మహానుభావా! ఇంత వఱకును నాశరీరమున కలసట గలుగకుండ రక్షించుచుంటివి. నన్నిప్పుడీచెఱనుండి విముక్తునిగాఁజేసి నీచరణదాస్యమొసంగెదవు.

చ. అగణితజన్మజన్మదురితాంబుధిలో బహుదుఃఖవీచికల్
దెగిపడ నీఁదలేక జగతీధవ! నీపదభక్తినావచేఁ

దగిలి తరింపఁ గోరితి పదంపడి నాదుభయంబుఁ దీర్పవే
తగ వగు దిక్కులన్నిడక దాశరథీ! కరుణాపయోనిధీ!

ఈశిక్షలు నన్నుఁ బొందకుండ నెట్లు కరుణించుచుంటివో యట్లే నీవు తలచినచో చెఱవిముక్తిఁగూడఁ గల్పింతువు. కాని యేకారణము చేతనోగాని యింతవఱకును నాయందుఁ గటాక్షము వహింపక యున్నావు. కానిమ్ము. పూర్వజన్మమున నేనుచేసిన పాపమెట్టిదో యనుభవింపవలయునుగదా? రామా!

తానీ—(భటులనుజూచి) ఈతనిని బాధించుట నేఁటి కాపుఁడు. రేపు మఱియొక విధముగ శిక్షింతము. మరల నీతనిని బందిగంబునఁ బడవేయుఁడు.

(నిష్క్రమింతురు,)

భటు—అచ్ఛా; సర్కార్! (రామదాసునుజూచి) రేపు మళ్ళీ మాకీ వచ్చేటప్పటికి పైకం ఇచ్చే మార్గం చూడు. లేకపోతే నీకీ తల్వార్సే ముకడ్ ముకడ్ సేస్తాం. అవ్ బందిఖానాకు.

(అందరు నిష్క్రమింతురు.)

రంగము:—చెఱసాల.

(రామదాసుగారు ప్రవేశము.)

రామ—(తనలో) హా! కౌసల్యా నందనా! భక్తపారిజాతమా! నే నెన్నాళ్ళీకష్టంబుల ననుభవింపవలయును తండ్రీ!

మ. పగలున్ రాత్రియు నిద్రలేదు, తనువుఁ బ్రాణంబులున్ డస్సె హా!
పగ సాధించుచునుంటివో యకట! నా ప్రారబ్ధ మెట్లుండెనో?
జగమెల్లన్ గని నన్ను నవ్వఁగ నొనర్పన్ జూచినావేల? యో
ఖగరాడ్వాహనా! సాధుదీనజనరక్షా జానకీ నాయకా!

అంధకారబంధురమై సమస్త సంతాపములకును నిలయమై యున్న

యీ కారాగారమే నాకుఁ జెఱసాలఁ జేసితివా? నేను నిరంతరము నీ కొనర్చుచున్న పూజలకుఁ బ్రతిఫలమిదియా?

సీ. మకరంబును హరించి మత్తేభనాథునిఁ
బ్రోచినయట్టి సంపూర్ణకరుణ
ప్రహ్లాదు రక్షింప రహింభీకరాకృతి
నారసింహుండ వౌ నాఁటి ప్రేమ
గుహుని సద్ధర్మ గృహస్థుని సంభావించి
రక్షించు భక్తానురాగ గరిమ
పగవాఁడటంచును భావింపఁగాఁబోక
యల విభీషణుఁ బ్రోచు నలఘు ప్రేమ

తే. గీ. పరమభక్తుఁడనైన నాపైన నేల
చూపకున్నావు నేఁ జేయు పాపమేమి?
నీరదాభఘనశరీర! నిర్వికార!
రఘుకులోద్ధార! గుణధీర! యఘవిదూర!

దేవా! భద్రాద్రిపురమునందుండి యనుదినంబును బరమపావనమైన గోదావరీ స్రవంతియందు స్నానమొనర్చి, పరమభక్తిని నీచరణ సేవను జేసికొనుచు, నిరతిశయానందభావమునఁ జెలంగఁ దలఁచిన నన్ని మ్లేచ్ఛమధ్యమునఁ బడవేసితివా! అనవరతము నీసత్కథల నాలించు నా శ్రవణరంధ్రంబులయందు, మ్లేచ్ఛభటహుంకారంబులును, నుచ్చరింప నలవిగాని దూషణములును బడవేయుచుంటివా! రామచంద్రా! భద్రాచలపురమునకు శివాశీలుదారుగాఁబోయి నీపేరున బ్రాహ్మణసమారాధనఁ జేయునప్పుడు విధవశోంబున వేఁడిగంజికుండయందుఁ బడిన నా తనూజాతుని పునర్జీవితునిఁ జేసి మాకానందముఁ గూర్చిన దాక్షిణ్యాంతరంగుఁడనైన నీవు నన్నేల కరుణింపరావు!

మ. చెలఁ జికెక్కఁ బతియంచు లోవగచు రాజీవాక్షి కై యేడ్తునా
నిరతంబుఁ మురిపెంపుఁ జూపుఁగొమరుఁ జిత్తంబునం దెంతునా
కరుణఁజూడవు నన్నునీ వనిమదిఁ గాంక్షించి చింతింతునా
యరవిందాప్తకులాబ్ధిశీతకర! రామా! దైవచూడామణీ!

భటు—(తనలో) ఈబొామ్మన్ యెవ్వడూ రాముడీకి మఱచేది లేదు. బడామన్సీవున్నాడు. మాకీమొదటా యీడికీ తిట్టామ్. ఈయన షర్యసూచి గాభ్రాపడ్డాం. హెకర్వ్రాతక్వ లేకుండా యీయనీకి మాట సెప్పరాదు. తానీషాపాదుషా యీయన్కీ యిస్సె పెట్టేతో బాగావుంటాది. తిప్పల్ పెట్టేలో ఫాయిదా లేదు. ఈయన్కీసూస్తే మాకీ భయమేసి ఒకమూల రాంరాం సెవూ గాలసోగయా. ఈయన మంచిమన్సి. ధేడ్డుయీయన దిల్మేవున్నాఁడు. (ప్రకాశముగా) అరే! గోపన్నగార్! మీకీ సూస్తె మాకీ సిండా కుషిఅవుతాది. రాతిర్ మీకు తేలూకుట్టే యేద్వలేదు వోయ్. తుమారాపాస్మే కూచ్ మంత్రం తంత్రం హాయేక్యా?

రామ—ఓయిభటుఁడా నేను రామదాసుఁడను. ఆమహానుభావుఁడు నిరంతరము నాకు సహాయుఁడై రక్షించుచుండును. అట్టి నేను యమకింకరులకైన జంకను. యముసైన ధిక్కరించెదను. అమరేంద్ర వైభవమునైన లక్ష్యము సేయను.

భటు—రాముఁడుపేరు సెప్పేతో అంత జబర్దస్తీ వస్తుంది. ఓ! అది యేమి గోప్పాది సాబ్.

రామ—శ్రీరామనామమునకుఁ దుల్యమైనది మఱియొకటి లేదు. అది మహారుచికరమైనది. ప్రహ్లాద నారద పరాశర పుండరీకాదులను గాచిన దదియే. ఆపతితపావననామము కదళీ ఖర్జూరాదిఫలములకంటెను, నవరస పరమాన్న నవనీతములకంటెను

పనస జంబూ ద్రాక్ష ఫలరసములకంటెను, రుచికరమైనది. సారములేని సంసారవారాశిఁ దరించుటకు నౌక రామనామంబును సర్వకాలసర్వావస్థలయందు దృఢంబగు భక్తినిఁబూని స్తుతిసేయుచుఁ బూజించెడు భక్తబృందమునఁ కెట్టి కొఱతయు నుండదు.

భటు—అచ్ఛా! గోపన్నాసాబ్! మాకీ రోజూ రాంరాం అంటాము. దానిమే యేమితమాషావుంది సూస్తాం. హమాకు సందేహం మీరాముడికి మాకు చెప్పేతో మాకులంమే భ్రోత్ తంటా ఆతైనె? దానికి యేమిచెప్తార్!

రామ—మూఢాత్ములట్లు తలంతురు. అందలి రహస్యమును గుర్తెరింగిన వానికే సందేహముండదు. భగవంతుఁడందఱికి నొక్కఁడే. కాని; యాయామతసాంప్రదాయముల ననుసరించి వేఱు వేఱు నామములతో భాసిల్లు నద్దేవాదిదేవుని ననేకవిధములఁ బూజించుచుందురు.

భటు—[ఎదుటఁజూచుచు] క్యాజీ! గోపన్నా! మీకీ దేఖ్నకువాస్తే హర్కారీ ఆతే. వాళ్ళుమమ్మీ యేమిసేస్తారో మీకీ నాకీ నిండా భయంగావుంది. మాట్లాడకుండా హిఫ్దాకూర్చుంటాం మేం.

[తురుష్క హర్కారులు ప్రవేశింతురు.]

హర్కా—[చెఱసాల తాళముఁదీసి రామదాసునిఁజూచి] క్యాహై గోపన్నా. పైకం తయారుచేసినావూ లేదూ! ఏ రోజ్ పైసా దేతానైతో మీకీ వుంది.

రామ—పైకమా. ఈరోజున నీయవలయునా! రామచంద్రమూర్తికింకను దయలేదు.

హర్కా—అరే! క్యాబాత్ బోల్తే! తుం. దేముడికి దయవచ్చి పైసా యిస్తాడువోయ్. నీవు మాకీ మంపేస్తుండావు. హెప్పటికి హెప్పు

పాదుషాసాబ్ మాకీ బందిఖానకు జావ్. గోపన్నకూ పూ
చోకరు— హుకుం దేతే తుం పైసా దేతాహై. ఇప్పుడిచ్చేది
లేకపోతే నీకు నిండా బాధసెయ్యమని హుకుంఅయింది. ఏమి
సెప్తావు!

రామ—హరకారులారా!

శా. పైకం బేమియు లే దొసంగఁగను నాప్రారబ్ధ మిట్లుండె సీ
తాకాంతాధిపుఁ డైన సత్కృపను జిత్తంబందుఁ బూనండు, మీ
కీకార్పణ్య మదేల? కొట్టినను మీ కేమైనఁ బ్రాప్తించునే?
శ్రీకాంతుండు సహించునే యకట! దూషింపంగ మీ కేటికిన్.

హర్కా—అరే! ఏమిమాటసెప్తావు. మాకీ సర్కార్ హుకుం చలా
యించవద్దా! రా! [ఈవలకులాగి] ఈయెండలో యిసకలో
నిలుచుండు.

రామ—[శ్రీరాముని నుద్దేశించి] హా! రఘునందనా! నాయెడల
నిట్టి దారుణకృత్యము లాచరించుచున్న ఈదుర్మతులను సైరిం
చెదవేల? శరణుఁ బొందిన నన్ను రక్షింపకుండుట నీకు ధర్మ
మనితోఁచినదా! స్వామీ! నన్ను రక్షింపవేమి? కలనైన
నీనామస్మరణంబు మఱువక నిన్నే నమ్మియున్న యీదీనుని
నిట్టి సంకటములపాలు సేయుట తగునా! ఓ భుజగశయనా!
సన్నుతించినవారి నెల్ల దయతోఁ బ్రోతువని వినియుంటినే.
తండ్రీ! నేను నిన్నేమికోరితిని? మకరాలు చెక్కిన హారంబు
లడిగితినా! కనకాంగుళీయంబులు గోరితినా! బంగారు సరి
గంచుశాల్వ లడిగితినా! అనిశము నీదివ్య పాదసరోరుహసేవ
నొసంగి నాకష్టములఁ దప్పింపుమని వేఁడుకొంటిని. [పైనఁ
జూచి] అబ్బా! మార్తాండుఁడు నభోమండలమునఁ దన చండ
కిరణముల కాంతిని సంపూర్తిగఁ బ్రసరింపఁజేయుచున్నాఁడు.

హారామా! పైన నెత్తియుఁ గ్రింద నడుగులును మాడిపోవు చున్నవి. శరీరమంతయుఁ జెమ్మటలు గ్రమ్ముచుండెను.

కీర్తన.

దీనబంధో । సుగుణసింధో । మొఱవిని ననుగావవా॥
మానసమున నిన్నే యను । మానములేకను నమ్మితి ॥దీన॥
వేడియెండలోన । శిరము మాడుచుండె గా
పాదతలఁపుబూని రావదేల ॥దీన॥

హారా—సరీగా నిల్చుండువోయ్! (గెంటుచున్నాడు)

రామ—హా! రామచంద్రా! నా ప్రార్థనము వ్యర్థము సేయకుండ రక్షింపుము.

మొదటి-హార్కారు—అరే! క్యాజీ! బొమ్మన్కు కాళ్ళు కాలడం లేదు. నెత్తిమాడడం లేదు. భోత్ హుషార్‌గా నిలుసుండాడు.

రెండవహార్కారు—నాకీ అదేషూస్తుండాది.

మొ-హా—ఇంక వీడికి సఫాయిచెయ్యాలి. [రామదాసును యీవల లాగి] క్యా! పైసా యిస్తావు లేక చస్తావు. దేఖో! మేరా హాత్మే తల్వార్. [కత్తితోఁ బొడువఁబోవును.]

రామ—(రాముని నుద్దేశించి]

సీ. ఇదికదా వేళ దుర్మదపరిపంథులౌ
హార్కార్లఁ దోలి నన్నరయుటకును
ఇదికదా సమయం బహీనకటాక్షంబు
పైఁ జిమ్మి నన్నుఁ గాపాడుటకును
ఇదికదా యదను మునీంద్రసన్నుతుఁడవౌ
నీవు ముదమున నన్నేలుటకును
ఇదికదా కాల మున్మద చిత్తులౌ తురు
షుకులగర్వ మెల్లను గ్రుంగుటకును

గీ. తండ్రి! యిదికదా సమయంబు ధరణియందు
రామదాసనుపేరు సార్థకముఁజేసి
కష్టములఁదోలి నన్నును గాచుటకును
రామ! రాఘవా! రఘురామ! రామ! రామ!

మొ-హా—పైకం మీరాముఁడు తెస్తాడ్. మాకి సూస్తాం —
[అని కత్తితోఁగొట్టుచున్నాఁడు.]

రామ—హా రామచంద్రా! నేనెంతపిలచినను నన్ను రక్షించుటకు రాకుంటివేమి! ఈదుష్కరతురుష్కుల ఖడ్గంబులకు నా దేహము బలి యొసంగవలసినదేనా! ఆర్తత్రాణపరాయణా! నీవింతకుము న్నెందఱో భక్తులను రక్షించినావు.

ఉ. దాచినచుట్టమా శబరి దాని దయామతి నేలినావు; నీ
దాసుని దాసుఁడా గుహుఁడు తావక దాస్యమొసంగినావు; నేఁ
జేసిన పాపమా వినుతిఁజేసినఁ గావఁగరావదేమి! నీ
దాసులలోన నేనొకఁడ దాశరథీ! కరుణాపయోనిధీ!

రెం-హా—(మరల కత్తితోఁబొడుచుచున్నాఁడు.)

రామ—శ్రీహరీ! రామచంద్రా! దయఁజూనవా! హే శ్రీమన్నారాయణపరిపూర్ణావతారా! భక్తపరాధీనా! భవబంధవిమోచనా! అహల్యాశాపవిమోచనా! సుజనరక్షణకుజనశిక్షణబద్ధకంకణా! నీభక్తరక్షణబిరుదంబు నెందు దాచితివి! పిలచినఁబలుకకున్న నన్నెవ్వరు రక్షింతురు. నీవు నాయెడల గాఠిన్యము వహించితివేల? క్రూరతురుష్కుల ఖడ్గప్రహారములకు నాయొడలెల్ల ముక్కలగుచున్నది. రామా! ధరణీభారనివారణంబునకుఁ బెక్కండ్ర రక్కసుల నుక్కడఁగించి దేవతలకు హితము గలిగించి, తాపసగణంబును బ్రోచిన నీకు— నన్ను ఈతురుష్కులబాఱినుండి తప్పించుట కష్టమా?

సీ. స్తంభంబు వెల్వడి దానవేంద్రుని నర
మృగమవై చంపిన మేటిబలము
నరకాసురాదిబల్ న క్తంచరుల లీల
సంగరంబునఁ గూల్చు శౌర్యపటిమ
జవసత్వములయందు సాటిలేనట్టి య
వ్వాలిని గూల్చిన బాహుబలము
జగమెల్లఁ గంపింప సల్పినరావణు
దర్పం బడంచిన ధైర్యగరిమ

తే. గీ. నెచట దాచినాఁడవు తండ్రి! యెంత మొత్తు
కొన్నను రావు, నీవే దురాత్ము
లైన మ్లేచ్ఛులకును భయం బందియున్నఁ
జెప్పఁగానేల మముబోంట్ల జలజనాభ!

నీవు మహమ్మదీయులకు భయంబంది భక్తుఁడనగు నన్ను రక్షింపఁ జాలక యుంటివేమో యని తలంచెదను. అట్లు కాదేని యేల రక్షింపవు?

సీ. ఖలు హిరణ్యాక్షు వ్రక్కలుగఁ జేసిన వాడి
గోళ్ళపటిమ్మత గోలువడితె?
రక్కసిముక్కును జక్కజేసిన మేటి
దారుణాసిపదును తప్పెనేమో?
నొకకోల వాలిని నుర్విపైఁ గూల్చిన
సునిశితాస్త్రమునకు సూటిలేదె!
నాహవక్రీడలో నమరాని రావణుఁ
జంపిన బాణాగ్ని చల్లఁబడెనె!

తే. గీ. కాకయుండిన రావేల, నాకు రక్ష
ణంబొసంగ వదేల! దున్నాడ వేల?

శౌర్యధైర్యముల్ ప్రకటించి సాహసమున;
దర్పకారాతిభీమ! కోదండరామ!

మొ-హా-ఈదెబ్బతో సఫాయిచేదామ్.

రెం-హా-నాకత్తిదెబ్బ దేఖో—నీకి యడ్డం యెవ్వడు వస్తాడో హాం దేఖా.

(ఇరువురును రామదాసుపైఁ గత్తులు విసరగాఁ గత్తులుకనఁబడకుండ మాయమగును.

రామ—రామచంద్రా!

మ. వరఖడ్గంబులఁ బూని తీసెదము నీప్రాణంబులన్ నేఁడు నీ
శరణం బెవ్వరొ చూచు కొమ్మనుచు రోషంబేర్చిఖడ్గంబులన్
బరపన్ నాపయిఁ బ్రేమఁబూని వరగన్ ప్రాణంబు రక్షించితీ
వరయన్ భక్తజనార్తిభంజన! మహాత్మా! దైవచూడామణీ!

మొ-హా-అరే-క్యారే బొమ్మన్కి మీద యేస్నికత్తుల్ మాయమై పోయినాయి. ఈలాంటి సిత్రం మనకు హెక్కడసూడాలేదు. హీడికి సంపడం మనికి సేతికాదు. మన్కి-ఫాణంమీాదికి వస్తాది! [రామదాసును జూచి] గోపన్నసాబ్ ! మీాకీ ఫర్వానై! మాకి మీాజోలీకి-రాం—మీాకు రాంరాం సర్కార్ హుకుంకు మీారు కొతిడీమె వుండంశి. ధేముడికి-మీామీాద సానా దయవుండాది. ఇదర్ ఆవ్ మహరాజ్ ! జైలుకు జావ్—
[నెమ్మదిగాఁ జెఱసాలలోనికిఁ దీసికొని వెళ్ళుదురు.]

రామ—[తనలో] ఆర్తత్రాణకళాప్రవీణుఁడవన నీకే చెల్లును. తురుష్కుని కత్తివేటులు నాశరీరమున కొకటియైనఁ దగులకుండ రక్షించి మించితివి. ఇఁక నన్నుఁ జెఱనుండి శీఘ్రముగ విముక్తునిఁజేసి యేలుము.

మొ-హా——ఇంక మనం యీషంగతి పాదుషావారికి సెప్పవాలి పైన ఆయనసెల్వా——ఆవ్.

(తెర వ్రాలును.)

రంగము:——చెఱసాల.

(రామదాసుగారు విచారముతోఁ బ్రవేశము.]

రామ——[తనలో] హా! రామచంద్రా! నేనెంత వేఁడికొన్నను నింత వఱకును నన్ను దయఁజూడకున్నాఁడవు గదా! నేనెంత కాల మీరీతిఁదురుష్కభటులచే బాధింపఁబడుచుఁ గారాగృహమున వసింపవలయును స్వామీ! ఆజన్మాంతమువఱకు నాకిదియే వ్రాసియుంచితివా తండ్రీ! అయ్యో! యమకింకరులఁ బోలిన భటులు నాకరచరణముల బంధించి గ్రక్కున నుక్కుగుండొ కటి తెచ్చి నావీఁపునఁ బెట్టి పురంబెల్లఁ ద్రిప్పిరి. ఈకఠినశిక్షల కంటె వారాడు దుర్భాషణంబుల భరింపఁజాలక యున్నాను. దేవా! నాభారమంతయు నీయదే యని నమ్మి ధైర్యముతో నుంటిని. భవదీయదివ్యనామస్మరణము నిఖిలరోగముల నిర్మూలముఁ జేయుననియు, భవభయంబులనెల్లఁ బాఱదోలు ననియు. సమస్తవిధమైన యాపదలను నలిమివేయుననియు, శాత్రవవిజయంబుఁ జేకూర్చుననియు, సకలమంగళములఁ గూర్చుననియు మహానీయులు వచింతురు కదా! అట్టియెడఁ బ్రపంచమున నీపాదారవిందచింతనమునకన్న నన్యచింతన మెఱుంగక నిన్నే యాశ్రయించియుండు నామీఁదఁ గరుణఁ జూపింపకయుండుట మిగుల వింతగ నున్నది. రామా! నీవా నాఁడు మహిమాకారంబునవచ్చిన నిన్నెఱుంగక ప్రహరించితి నని నాపై నీకలుకా!

సీ. అందమా యిది నీకు చందమా నన్నిట్లు
గుందఁజేయుట నీకు సుందరాస్య ?
కోపమా లేక నాపాపమా ఘోరసం
తాపముఁ గూర్పంగ భూపమౌళి !
నేరమా నాయందు భారమా నీకు విం
చారమ్ము గల్గింప సారసాక్ష ?
ధర్మమా యిదినీకు మర్మమా లేక నా
కర్మమా యిటుచేయఁ గర్మసాక్షి ?

తే.గీ. ఎంతపిలచిన నేఁడు రావో? సుంత
యైన కృపఁజూపవేల ? నీ యలఘుకరుణ
బాధలను మాపి యీ చెఱఁ బాపవేల ?
దాసజనహృద్విలాస ! సీతానిజేశ !

మహానుభావా! నాయం దేమయిన నేరములున్న క్షమియింపుము. దాతవని నిన్ను నమ్మిన నాయెడలఁ బాతకము లెంచవలదు. ఒకవేళ నాయందు లోపములున్నను నీ పాదారవిందసంస్మరణముచే నవియన్నియు మాయమైపోవునుగదా! తండ్రీ! నీవు నన్ను రక్షింపఁదలచితివేని నీకు శక్యముగానిదేమున్నది? అక్షయమగు ద్రవ్యమొసంగఁదలంచితివేని నీ జ్యేష్ఠ భార్యయగు లక్ష్మీదేవి లేదా ? ద్వితీయసతీమణియగు భూదేవి రత్నగర్భ గాదా? కల్పతరువు, కామధేనువు, చింతామణియు నీయధీనమున లేవా ? శ్రీరామునినారమగు మాకేమి విచారమని తలంచి, నీవే యాధారమని నమ్మియుంటి. ఘోరాంధకారమగు సంసారము నిస్సారమని యెఱింగితిని. నిన్నుఁ జింతించుటే సారమని తెలిసికొంటిని. కాని నన్ను రక్షింపరాకుండుటకు మాత్రము గారణ మరయఁజాలకయుంటిని.

మ. కరి రక్షింపవొ; ద్రౌ[illegible] జపించ యెట్ట గాపాడవో ద్రౌపదీ
పరవస్త్రంబు [illegible] పవో ప్రహ్లాదు [illegible] స్సిద్ధి [illegible]
ధరణీశున్ [illegible] మనెంచకయె లంకారాజ్యముం దుంచవో;
శరణన్నన్ నను బ్రోవవేమి బుధపోషా! జానకీనాయకా!

(ఇంచుకయాగారకుంగి) దేవా! ఇంక నీవు నన్నుఁ గృపఁజూతువు కష్టములన్నియు నేను నీనిమిత్తముగదా పడుచుంటిని. సమస్త జగములను గుక్షియందు నిలిపికొని నీవు నాహృదయమున నిల్చి బాధలఁ బాపి, శైలి విషింపచవేల? నాప్రార్థనమంతయు వ్యర్థముసేయుచుంటివి కదా! నీయందు [illegible] నయముఁ జిత్తముఁ జేర్చి సర్కారువైకమంతయు నీకైంకర్యమునకై వెచ్చపెట్టి, నే నీకీర్తిని వంతల మునింగి నిన్నుఁ బ్రార్థించుచుండఁగా నాయెడల నొకింత కరుణఁ జూపవేల! తండ్రీ! నీ వింతకఠిన హృదయుఁడవని యెఱుఁగనైతిని. నీసేవావిషయమై నేనొనర్చిన లోపమేమియున్నది. నాయిష్టదైవతమగు నీవు జీర్ణాలయంబునయుండుట మంచిదికాదని తదాలయోద్ధారణగావించి చుట్టును బ్రాకారములఁగట్టించితినే! భగవంతా! రామచంద్రా! ఆప్రాకారమునకుఁ బదివేలవరహాలు పట్టెఁగదా! ఎంతయో ధనము వెచ్చించి గోపురమంటపాదులనిర్మించితినే! సీతమ్మకుఁ[illegible] భరతునకుఁ బదివేలవరహాలుపెట్టి పతకముపు, లక్ష్మణునకు ముత్యాలహారమును, శత్రుఘ్నునకు మొలత్రాడును, చేయించితి గదా! దేవా! మాసీతమ్మతల్లికి జగన్మాతకు, సింగారాంగికి, సుగుణసంఘాతకు, భువనవిఖ్యాతకుఁ జింతాకుపతకము జేయించితినే! మాతండ్రివగు నీకు వాహనంబులు సేయించితినే!—ఇవి యన్నియు మీకుఁ జేయించినందులకేగదా నాకీ సంకెళ్ళు వేసిరి! రామా! కువలయదళశ్యామా! పరంధామా!

నేను పడుచున్న కష్టములన్నియుఁ జూచిన నీకు సంతోషముగ నుండెను కాఁబోలు! నేను నీకుఁ జేయించిన కలికితురాయి మొదలగునవి పెట్టుకొని కులుకుచుంటివి. ఇయ్యవి మీతండ్రి యగు దశరథుఁడుగాని మీమామయగు జనకమహారాజుగాని పెట్టెనని తలంచుచుంటివా! ఇదియంతయు దాసుఁడు నీయందున్న భక్తిచేఁ జేయించి ముదమందుచు, నీచెఱంబడెనని తలంచిరక్షింపక జాగుచేసిన, నేనిఁక నెవ్వరిమఱుఁగుజొత్తును [ఇంచుక యూరకుండి] హే! జగన్నాయకా! దశరథనందనా! నేను నీయెడల నింతకఠినముగాఁ బలుకుచుంటినని యాగ్రహింపవలదు. స్వామీ. తురుష్కులు నన్నుఁ బెట్టుచున్నకష్టంబుల కోర్వఁజాలక యిట్లుపలుకుచుంటిని.

కాంభోజి—ఆదితాళము.

ఇక్ష్వాకుకులతిలక - యిఁకనైన బలుకవె - రామచంద్రా, నన్ను
రక్షింపుమీపట్ల రఘుకులతిలకా శ్రీ - రామచంద్రా ॥ఇ॥
చుట్టుప్రాకారములు - సొంపుతోఁగట్టిస్తి - రామచంద్రా, ఆ
ప్రాకారమునకుఁ బట్టె - బదివేవరహాలు - రామచంద్రా ॥ఇ॥
గోపురమంటపా - లుద్దుకుగా గట్టిస్తి - రామచంద్రా, నన్ను
క్రొత్తగ జూడగ - నిత్తిత్రి బో్రివుము - రామచంద్రా ॥ఇ॥
భరతునకు జేయిస్తి - పచ్చలపతకము - రామచంద్రా, ఆ
పతకమునకుబట్టె - పదివేలవరహాలు - రామచంద్రా ॥ఇ॥
శత్రుఘ్నునకు నేను - చేయిస్తి మొలత్రాడు - రామచంద్రా, ఆ
మొలత్రాటికిబట్టె - మొహరీలు పదివేలు - రామచంద్రా ॥ఇ॥
లక్ష్మణునకు జేయిస్తి - ముత్యాలపతకము - రామచంద్రా, ఆ
పతకమునకుబట్టె - పదివేల వరహాలు - రామచంద్రా ॥ఇ॥
సీతకుజేయిస్తి - చింతాకుపతకము - రామచంద్రా, ఆ
పతకమునకుఁబట్టె పదివేల వరహాలు - రామచంద్రా ॥ఇ॥

వాహనములు మీకు - వరుసతో జేయిస్తి - రామచంద్రా, జగ
న్మోహన సంకెళ్ళు - వేసిరి కాళ్ళకు - రామచంద్రా ॥ఇ॥

కలికితురాయి నీకు - పొలుపుగ చేయిస్తి - రామచంద్రా, నీవు
కులుకుచు తిరిగెద - వెవరబ్బసొమ్మని - రామచంద్రా ॥ఇ॥

మీతండ్రి దశరథ-మహారాజు పెట్టెనా-రామచంద్రా, లేక, మీ
మామ జనక మహారాజు పంపెనా - రామచంద్రా ॥ఇ॥

అబ్బ తిట్టితినని - యాయాసపడవద్దు - రామచంద్రా, ఆ
దెబ్బల కోర్వక - అబ్బతిట్టితినయ్యా - రామచంద్రా ॥ఇ॥

ఏటికి జల్లిన నీళ్ళాయె నా బ్రతుకు - రామచంద్రా, నేను
అధమునికంటె - నన్యాయమైతిని - రామచంద్రా ॥ఇ॥

సరాసరుపైకము - తృణముగ నెంచుము - రామచంద్రా, ఈ
దెబ్బలనుగాచి - యప్పుదీర్పుమయ్య - రామచంద్రా ॥ఇ॥

కౌసల్యపుత్రుండ - దశరథ తనయుండా - రామచంద్రా, గాంపు
క్షేమముగ - భద్రాద్రినెలకొన్న శ్రీరామచంద్రా ॥ఇ॥

భక్తులనందఱిని - పరిపాలించెడి శ్రీరామచంద్రా నీవు
క్షేమముగ శ్రీ - రామదాసుని నేలుము శ్రీ - రామచంద్రా ॥ఇ॥

తండ్రీ! రామదేవా! నన్నేల రక్షింపవు? నేను పరులను వేఁడను. పైక
మిమ్మని, నన్నీబందిఖానాయందు, తానీషా యునికట్టినాఁడు.
దేవా! నీవు నాఋణముఁ దీర్పవేమి! నీచేతకానున్నచో
మాతల్లియగు సీతామహాదేవితోనైన మనవిజేసికొందును.
(ఇంచుక యూరకుండి) రామా! నన్ను రక్షింపకయున్నచో
నిన్ను విడువను. రట్టుచేసి నిన్నరికట్టుదును. నేను నీపదాంబు
జంబులనే గట్టిగఁ బట్టినాను. నిన్ను వేఁడినకొలఁదిని వెనుకకుఁ

బరుగిడుచుంటివి. ఏమైననుసరే! నీసేవయొనర్చి నిన్నురవ్వజేసె దను. మహాత్మా! ఇంక నేను తాళఁజాలను. నాకు బంధవిముక్తిఁగూర్చి నీదొరతనము దాచుకొమ్ము. రక్షించెదనని నాకభయ మీయక యుంటివేని యడుగుదాఁటి నిన్నవతలకుఁ గదలనీయను. నీసేవయొనర్చి విసికిపోయితిని. మొగమోటము విడిచి నీపదకమలములను నా హృదయమున బంధించి వేయుదును. నీపతితపావనబిరుదముఁ గాచుకొమ్ము. ఇంకనన్ను రేవనియు, మాపనియుఁ ద్రిప్పక రక్షించి నీమహాత్మ్యమును బ్రకటింపుము. (ఇంచుకయూరకుండి) ప్రణతార్తిభంజనా! పరమపురుషా! నన్ను రక్షించుటకు నీకు సామర్థ్యము లేకపోయినచో సీతామహాదేవికైనం జెప్పి, నన్నుఁ గష్టరహితునిగాఁ జేయింపుము. హా సీతమ్మతల్లి ! శ్రీరామచంద్రమూర్తికి నాయం దింతవఱకుఁ గరుణరాకయున్నది. అమ్మహానీయుఁడు నాయందు చలము వహించినాఁడు. దీనజనరక్షకుఁడని నమ్మినే నొనర్చిన సేవయంతయు నడవిఁగాచినవెన్నెలభంగి వ్యర్థమైనది. అమ్మా! నీవైనను నాయందుఁ గరుణాంతరంగవై, నేను పడుచున్న కష్టములన్నియు రామచంద్రమూర్తితో విన్నవించి నన్ను రక్షింపుము. నేను పడుచున్నశ్రమలఁ బాపుటకు రామమూర్తి యిదెవచ్చునదె వచ్చుననియనుదినంబును నెదురుచూచుచుంటిని. ఓజగజ్జననీ! ఇఁక నీవైనను దాసుని రక్షింపకయుండుట ధర్మముగాదని బోధించి తానీషాకు నే నీయవలసిన పైకముతో రామయ్యతండ్రిని బంపుము. ఇంక మీరు నన్ను రక్షింపకయున్నచో శీఘ్రముగఁ బ్రాణముల వాసి మీచరణసన్నిధికిఁ జేరుకొందును.

మ. జననీ! రాముఁడు సత్కృపారహితుఁడై చన్దేరఁడయ్యేఁ
గని రక్షించుటకై; యింకేవిధిని వైకంబంతయుఁ దీర్చి,
ర్జనులౌ మ్లేచ్ఛులబాధఁ దాఁటుదును; సంరక్షింపు మీవే
ఘన కారుణ్యకటాక్ష వీక్షణసుధా కల్లోలవారాసివై.

మ. అమ్మా! రామపదారవిందయుగళ ధ్యానైకచిత్తుండ, నే
నిమ్మాడ్కిన్ జెఱఁ గుందుచుంటను నీవీక్షించి సైరింప
యమ్మా! రాముఁడు బ్రోవకున్న, నిఁక నీవైనన్ ననుం గా
రమ్మా! మొక్కెదఁ భక్తి నీకిదె రమారామామణీ! జాన

[తురుష్కభటుఁడు ప్రవేశించును.]

తు॥భ—(రామదాసుని జూచి) అరే! మియ్యా! భోత్ గల
స్తావు. మాకు నిద్దర్ పోయేదిలేదూ! రాముడిక నవ్వు
తుండాన్. ఆడు వచ్చేదిలేదు. నీకీ పైకం పెల్లించేటా
ఖైద్ విడిసేదిలేదు. జరా సోజావ్ బొమ్మన్. నిద్ర
చేస్తామ్. మాకీ నిద్దరనైతో మా ద్రేహంకి భోత
వస్తాది.

రామ—(తనలో) దీనబంధూ! రామచంద్రా! ఇఁక నీవు
రక్షింప నసమర్థుఁడవు కావు గావున సీతమ్మతల్లి శరణు
నాను. (సీతాదేవి నుద్దేశించి) ఓతల్లీ! జానకీమహాదేవీ

మ. ఇఁకనైనన్ నను సత్కృపం గనఁగ మీ రేతెంచకున్నం
బ్రకరంబుల్ సతతంబుఁ బోవుచెడు భవత్పాదేశ దివ్యాం
త్యకలంకస్థితి నాత్మఁ జేర్చి రఘునాథా యంచుఁ బ్రార్థిం
మక జీవంబుల వీడి చేయుదు మదంబా! మిమ్ముభూపుత్రిక

(భటునిజూచి) ఓయీ! భటుఁడా! నామూలమున మీ
నిద్ర లేకయున్నది కదా! ఇఁక మీశ్రమలును నాశ్రీ
గూడఁ బోవును. ఇఁక మారామయ్యతండ్రి కాని, మ

## చతుర్థాంకము.

తల్లి కాని, పాదుషాకు నేనొసంగవలసిన పైకమిచ్చి రక్షింపరేని నేను ప్రాణముల బాసి సుఖించెదను.

తు॥ భ—అరే! బొమ్మన్ బలవంతముగా ఫానాల్ పీడిసేతే తంటా వస్తుంది. మమ్మల్ని సంపకూ జ్రా పండుకో.

రామ—హా! రామభద్రా!

[తెరవ్రాలును.]

రంగము—శయనగృహము.

[ శ్రీరాముడు; సీత, వేఱువేఱు తల్పములయందు నిద్రించు-

సీతా—(త్రుళ్ళిపడి లేచి) హా! ఎవరు? ఆర్తుండై నన్నీరీతిని చుచున్నాఁడు ?

శ్రీరా—(హఠాత్తుగ లేచి) రమణీ! ఏమది! కలవరించుచుంటి

సీత—నాథా! కలవరించుటలేదు. నిశ్చయముగా నన్నెవ్వర రక్షింపుమని కోరుచున్నారు. (ధ్యానము నటించి) స్మ సినది. మీచరణభక్తుఁడగు రామదాసనామమునఁ ద గోపన్నయే. (శ్రీరామునితో) ప్రాణేశ్వరా! ఇంత మీకు వినఁబడుచుండుటయే లేదా ?

మ. చెఱలోఁ జిక్కితి, బాదుషాకు ధనముఁ జెల్లింపలేదంచు
గ్గురువంబేర్చి తురుష్క సేవకులు నన్ గారింపుచున్నాఁ
చరణంబుల్ మది నమ్మినాఁడ జగధీశా! బ్రోవవే! యం
వరభక్తుండగు రామదాసు నినుఁ సంప్రార్థించుటల్ గాంచ.

ఆ రామదాసు మీకుఁ బరమభక్తుఁడుకదా! ఆతఁడు వెచ్చిం చుంతయు మనకొఱకేకదా! ఆర్త్రత్రాణపరాయణు రతని మొఱ వినియు నూరకుండుటకుఁ గారణమేమి

చ. దినకరవంశదీపకులు దీనజనావను లంచు లోకముల్
ఘనముగఁ జాటుమాటలను గాంచవె! నీపదనీరజంబులే
మనమున నమ్మి యెప్పుడు సమంచితభక్తినిఁ గొల్చు రామదా
సుని గృపఁ బ్రోవఁజూడ విది చోద్యము గాదె! విపక్షశిక్షణా!
దానపోషణ బిరుదమునకు భంగము గల్గించుకొందురా?

శ్రీరా—

మ. రమణీ! భక్తుఁడు రామదాసు చెఱ సంతాపంబునుం బొందుటల్
బరిశీలించుచునుంటి; నాకునయి ద్రవ్యం బెంతొ వెచ్చించి యా
కరణిన్ బాల్పడెనం చెఱుంగుదును; వేగన్ వాని రక్షింపఁగాఁ
దెరు వూహించుచు నుంటిఁ, బ్రోతు నిఁక సందేహంబు నీ కేటికిన్॥

ఆగోపన్న దీనాలాపములన్నియు నా చెవులఁ బడుచునేయున్నవి.

సీత—అట్లయిన జాగు సేయ నేల? ఈయాలోచన యెందుకు? ఆప
ద్దోద్ధారకుండ వనుబిరుదము గాపాడుకొనఁదలంచితి వేని రామ
దాసును నేఁడు రక్షింపుము. ధ్రువప్రహ్లాదాదిభక్తులను ధ్రువ
ముగఁ గాపాడిన మహనీయుఁడ వేని, యాతనినిఁ గాపాడుము.
(ఇంచుక యూరకుండి) మనోహరా! ఇంక నాలోచనతోఁ
బని లేదు.

బేహాగ్.

మనవి విని సరగున - రామదాసునేలఁగ జనుమా॥
ఘన చెఱ బాపుమ - మనదాసుని మొఱ - వినుమా॥ మన॥
సర్కార్ పైకమొసఁగుమని - హరాహరు లతిక్రూరులై
తురకవజీర్ యనుమతిఁగొని - తరికించుచుతుండిరినాథా॥ మన
వాసిగ దాసుని నీవిపు డేలకయున్న
భూసుపఁ డాతఁడు మనకై - ప్రాణము వాయును ॥మనవి॥

శ్రీరా—రమణీ! ఆతఁడు భక్తాగ్రేసరుఁ డనుమాట నాకు సంపూర్తిగఁ దెలియును. కాని యింతవఱకును గొండొక కారణము చేత నతని రక్షించుట కాలస్యము గావించితిని. లేకున్నచోఁ బరమభక్తుఁడగు నాతఁడింతవఱకు బందిగమునఁ గృశింపనవసరము లేకనేయుండును.

సీత—దేవా! కారణ మెఱుంగవచ్చునా?

శ్రీరా—యోషామణీ! ఈతఁడు పూర్వజన్మమున దేవలుండను మునియై నన్నుఁ బ్రహరించుట నీవెఱింగినదేకదా! అదిగాక యీతఁ డొక కీరమును దెచ్చి పంజరమునఁ బెట్టి, దానికి "రామ" యనుశబ్దమునేర్పి ముద్దుగాఁబెంచెను. దానికి రామనామస్మరణము నేర్పినకారణమున నీతఁ డీజన్మమున నాకుఁబరమభక్తుండై విలసిల్లెను. శుకమును బంధించిన కారణమున నిప్పుడు చెఱఁ బడవలసివచ్చెను. ఆపాపము నశించినది. ఇఁక నతనికిఁ గారాగృహ విముక్తి గూర్చెద.

సీత—నాథా! అతనికిఁ గారాగారవిముక్తి యెట్లుగూర్చెదరు?

శ్రీరా—రామదాసు తానీషా కొసంగవలసిన పైకమును నేను చెల్లించుదును. నేను లక్ష్మణసమేతంబుగా నీక్షణంబునఁ దానీషాకడకరిగెదను.

సీత—అతిపాపాత్ముఁడును, తురుష్కకులసంభూతుఁడును నగు తానీషాకు మీదివ్యదర్శన మొసంగెదరా?

శ్రీరా—చకితాక్షీ! తానీషాను మన మలంతిగఁ జూడవలదు. సేవకసేవ్యసంబంధమును బట్టి యీతఁడు రామదాసు నట్లు బంధించినాఁడు. అదియుఁగాక,
దక్కినవారుకూడ న
కుఁ గొంతభయము

మఱియు సందర్శనము చేసికొనుటకు ముక్తినొక విశేషమున్నది. ఈకాశీపురాభ్యంతరమున శివానందుఁడను నొక బ్రాహ్మణుండొక్కయుండెను, గంగానదీతీరమున వసించుచుఁ బరమేశ్వరునిఁ గూర్చి తపము సేయుచుండెను. ఎన్నాళ్ళకును నమ్మహాని యుండు దర్శనము సంగనందుకు విసిగి క్రిగములను నొంపుచుం ద్రమాశీరమునకుఁ బడవేయ, నాతఁడు సాక్షాత్కరించి "నీవు బ్రాహ్మణుండ వయ్యును తామసుండవైతివి. ఆకారణమున ముందుజన్మమున మ్లేచ్ఛుఁడవై రాజ్యాధిపతివై శ్రీహరి సందర్శనమున నను సకలపాపముల బాయుదువు" అని యానతిచ్చెను. పరమేశ్వరుని వాక్యము నిలుపుటకు నే నిప్పుడు ఆతనికి దర్శనం బొసంగవలయును.

సీత—జగన్నాటక సూత్రధారులగు మీచిద్విలాస మెవ్వరికిఁ దెలియును?

శ్రీరా—సతీమణీ! ఇఁక నే నాలసింపరాదు. లక్ష్మణునితో నిప్పుడే యరిగెదఁగాక. నీవు శయనింపుము.

(నిష్క్రమించును.)

ఇది చతుర్థాంకము.

శ్రీ

# రామదాసు

## పంచమాంకము.

రంగము:—తానీషా యంతఃపురము.

[తానీషాయు, భార్యయుఁ బ్రవేశము.]

భార్య—నాథా! తొందరగ నన్ను మేల్కొలిపితిరే! మీకేమయిన స్వప్నము వచ్చినదా యేమి?

తానీ—రమణీ! నీవుతలంచినట్లు నిజముగా స్వప్నమే వచ్చినది.

భార్య—ఎప్పుడును మీకేదియో స్వప్నము వచ్చునే యుండును.

తానీ—నిజముగా నిప్పుడు నాకొక గొప్పస్వప్నమే వచ్చినది. ఆస్వప్నవృత్తాంతముఁ జెప్పుటకు మేనఁ బులకలు వొడముచున్నవి. ఎవ్వరో యిరువురు సుందరపురుషు లరుదెంచి, రామదాస పైకము చెల్లించి రసీదుఁ గొనిపోయిరట. కలలోఁ గో యాపురుషులు మహానుభావులవలె నున్నారు.

భార్య—ప్రాణేశ్వరా! ఏమి!

కారాగృహమునఁ జిక్కిన

మిచ్చుటకు వత్తురు?

(తలుపు చప్పు

తానీ—ద్వారము తెఱవఁబడి

[శ్రీరామ లక్ష్మణులు ప్రవేశింతురు]

శ్రీరా—తమ్ముఁడా! భక్తరక్షణమహోద్యోగము వహించి, సప్తద్వారములయం దుండురక్షకభటులను దాఁటి యీతానీషాయంతఃపురమును బ్రవేశించినాము. ఇఁక శీఘ్రముగ మనము తానీషానుజూచి, పైకము చెల్లించి రసీదు పుచ్చుకొని రామదాసు. కడకరిగి యతనికి ధైర్య మొసంగవలయును.

లక్ష్మ—అగ్రజా! ఇదిగో! తానీషా శయనమందిరము. కవాటములు బంధింపఁ బడియున్నవి.

శ్రీరా—అయిననేమి! తలుపుతీయు మని తానీషాను పిలువుము. మనకిట భయమేమున్నది?

లక్ష్మ—(తలుపు దగ్గరకేగి) తానీషా! తానీషా! ద్వారము సత్వరముగఁ దెఱువుము?

తానీ—(తొందరపడుచు దనలో) ఈయర్ధరాత్రి నన్నుఁ బిలుచువా రెవరు?

భార్య—ఈయర్ధరాత్రిసమయమునఁ జేయవలసిన రాచకార్యవ లేమున్నవి? ఈ వచ్చినవారు సప్తద్వారములను దాఁటి శయమందిరము నెట్లు సమీపింపగలిగిరి. నాకేమో వింతగనున్న

శ్రీ—(తానీషా నుద్దేశించి) తలుపు తీయవేమి! మేము మ సత్వరముగఁ బోవలయును.

రు మీరారు? ఈయర్ధరాత్రిసమయమున నేలవచ్చితిరి?

వచ్చినాము. ముందు తలుపుదిసి

నీవు లోని కేగుము. వారెవరో గూర్చి తొందరగా మాటాడ

భార్య—(నిష్క్రమించును.)

దాసీ—(లేచి తలుపుఁ దీయును. రామలక్ష్మణులు దాసీపాను సమీపింతురు.)

దాసీ—(ఆశ్చర్యమునందుచుఁ దనలో) ఇట్టి దివ్యమంగళస్వరూపులను మున్నెన్నఁడును జూచియుండలేదు ద్వారరక్షకభటులను దాఁటి యీయర్ధరాత్రి వీరిచ్చటికేవిధమున రాఁగలిగిరోగదా!

లక్ష్మ—(నేలపై వరహాలు గుమ్మరించును.)

దాసీ—(తనలో) వీరిని జూడ నాకు మిగుల యద్భుతము కలుగుచున్నది. నెమ్మదిగా వీరియుదంతమరసెదఁగాక!(ప్రకాశముగా)

సీ. ఏది దేశము మీది? యెవ్వరంపిన నిట్లు
వచ్చినా? రిచ్చోట భయములేక
హరిహరాదులకైన నలవికానట్టి నా
సౌధ మెట్టుల చేరఁజాలినారు?
అర్థమంతయుఁ జూడ నాశ్చర్యమయ్యెను
భూరిభారము నెట్లు మోపినారు?
భవదీయరూపముల్ పరికింప మాయగా
నాకును దోఁచె మనంబునందు!

తే. గీ. యింతయర్ధరాత్రివేళ యేల మీరు
వచ్చినారు? ధనమిదేమి? భళిర! మిమ్ముఁ
గాంచ నాశ్చర్యమెంతయో గలుగుచుండె-
దథ్యముగఁ దెల్పుడీ మీర-

శ్రీరా—వీరభటపరిరక్షితమైన
పైకము మేమెట్లు మె
చున్నదా! మాయుడ

మోహన—అట.

భద్రాద్రిపురమున మేము - బహుదినములనుండి కాపురము॥
అద్రిజాధిపబ్రహ్మేంద్రాదులకెల్ల॥
భద్రములొసఁగెడి భవ్యనిదానము॥ ॥భ

ఇనవంశజులము మేమిద్దరము - చాలా - దినములనుంచియున్నాము
అనిశము రామదాసుని యాజ్ఞచొప్పున
పనులుసేయుచు నింటియొద్దనే యుందుము॥ ॥భ

ఖయిదుచేసినవార్త దెలిసి-యిల్లు-బయలుదేరి మిమ్ముగలసి
పైకముచెల్లించి భక్తునియాపద
బాపి గొంపోయెడి పనికై వచ్చితిమి॥ ॥భ

భక్తుఁడైనరామదాసుని-యెంతో-సక్తుజేసిరి మంచిమేలని
ముక్తినిదానమగా యుక్తి తెలియక యా
సక్తినర్థాపేక్షకై యిటుచేసిరి॥ ॥భ

మించినకార్యమే మాకాయె-యెంతో-వంచన సేయుటలాయె
సంచులన్ని మీరే యెంచి రసీదు వ్రా
యించి సెలవు నిప్పించండి వేగమె॥ ॥భ

రామదాసుని రప్పించు-అతి-ప్రేమతో మాకప్పగించు
స్వామియగా భద్రాద్రిసదయుని కనుఁగొన
-మదాసునిగూడి రయమునఁ బోవలె॥ ॥భ

* ... ...గుల నాశ్చర్యముగానున్నవే! రామ
విడిపించుకొనిపోవుటకు వచ్చి
...రా! సర్కారునకుఁజెల్లించ
దాసు చెఱయందు బంధింపఁ

శ్రీరా—అవును. ఆసంగతిమాకుఁ దెలియును. ఇదిగో మేముపైకము తెచ్చినాము. ఇది మీరు గైకొని మాకు రశీదువ్రాసి యొసంగుఁడు. రామదాసుని యాలుబిడ్డలతనికై పరితపించుచు క్షేమ మరసిరమ్మని చెప్ప నిట్లువచ్చితిమి. క్షణకాల మాలస్యమున కైనను మే మోర్వఁజాలము.

తానీ—మీ నివాసస్థల మేదియో తెలుపరేమి?

శ్రీరా—గోదావరీతీరముననున్న భద్రాచలమని చెప్పియుంటిమికదా!

తానీ—మీ రెవ్వరిసేవకులు? ఎవ్వరిపంపున నిట్లు వచ్చితిరి?

శ్రీరా—దాససేవకులము. రామదాసు పంపఁగ వచ్చితిమి.

తానీ—మీకుల మేది?

శ్రీరా—రఘు కులము.

తానీ—మీరిరువురు నేమగుదురు?

శ్రీరా—అన్నదమ్ములము. రామోజి లక్ష్మోజి నామంబుల నొప్పుచున్నాము.

తానీ—ఎన్నితరములనుండి మీరు రామదాసుకొలువుసేయుచున్నారు?

శ్రీరా—తాతముత్తాతలనుండియు.

తానీ—మీ కేమి జీతమిచ్చెదరు?

శ్రీరా—జీతముతో మాకుఁ బనిలేదు. ప్రసాదమే.

తానీ—మీ రెందుకువచ్చినారు?

శ్రీరా—రామదాసు చెల్లించవలసిన పైక మిచ్చుట ముందే చెప్పితిమికదా?

తానీ—ధనమంతయుఁదెచ్చితిరా?

శ్రీరా—తెచ్చితిమి.

తానీ—రండు! ఈయాసనముల

శ్రీరా—అయ్యా! మేమిచ్చుటఁ

తానీ—అట్లు పలికెద రేమి ? (ఇంచుక యూరకుండి) పోనిండు. ఆఱు లక్షలు దెచ్చితిరా ?

శ్రీరా—అంత పైకము మేమిప్పుడొసంగఁగలమా? సగ మిచ్చెదము.

తానీ—సరే! తెచ్చినది యొసంగుడు. ఆ పైన చిత్రము చూచెదరు గాక!

లక్ష్మ—పదివేలుమాత్రమే తెచ్చితిము.

తానీ—ఏమిది! నాతో హాస్యమాడుచుంటిరా?

శ్రీరా—మేము హాస్యమాడువారము కాము!

తానీ—మీదగ్గఱ నున్న పైక మిచ్చి మీరుకూడ బందిగమును బ్రవేశింపుఁడు.

శ్రీరా—మే మట్లు ప్రవేశించువారము కామని యెఱుఁగుము. నీ పైక మంతయు నొసంగెదము. (క్రిందనున్న పైకముజూపి) ఇదిగో పైక మెంచుకొని వెంటనే మాకు రశీదు నిచ్చి పంపుము.

తానీ—ఈయగ్రగాత్రి రశీదెట్లొసంగుదును?

శ్రీరా—ఉంగరము విడెమందు నద్ది చేరుమాలుపై మోహరు జేసి యిమ్ము.

నాీ —అంతతొందరయేల? ఉదయమునరాగూడదా?

కాదు. కాదు. ఈపని యిప్పుడే జరుగవలయును.

-(పైకము నెంచుకొని తనలో) ఆహా! ఇదియంతయుఁ జిత్రముగ (చేరుమాలుపై రా ... చెప్పినవిధమువరశీదు వ్రాసి ... గో! రశీదు.

పోయెదము. (కొంచెమీవ నమగును.)

కన్ను తెఱచువంతలో నేమా సపోయితిని. నిశ్చయముగా

మ్మహానుభావులు రామలక్ష్మణు లనుటకు సందియము లేదు. నే నెంతయవివేకి నైతిని. (ఎదుటఁజూచుచు) సతీమణీ! సతీమణీ! నిద్రించుచుంటివా ?

(నిష్క్రమించును.)

[తెరవ్రాలును]

రంగము:—చెరసాల.

[రామదాసు ప్రవేశము.]

రామ—[శ్రీరాము నుద్దేశించి] హా! రామచంద్రా! నీవు కఠినాత్ముఁడవని తెలియక నిన్ను సేవించి నేను మోసపోయితిని. కాకున్నచో,

మ. చెఱసీరీతినిజిక్కి నీచరణరాజీవంబులే నాకునుం
శరణంబంచుఁ దలంచియుండఁగ గృపన్ రక్షింపరావైతి, నీ
పరిభావంబును దీర్పవైతివి చెఱన్ బాపంగలేవైతి వే
కరణిన్ దీనులనేలఁజాలతివో ముక్ గహ్యాణరామప్రభూ!

నిన్నెందఱో భక్తులు సేవించి కృతార్థులైరని వింటిని. వారి నెట్లురక్షించితివో !

సీ. పస యింతయును లేని భవదీయఘనమంత్ర
పఠనంబు గిరిజ యేభంగిఁ జేసె ?
ఆదిపరబ్రహ్మ మంచును నిన్ను న
వ్వరమేష్ఠి యేరీతిఁ బ్రస్తుతించె ?
పరమద్రోహివి నిన్నుఁబతి పతితపావనుఁడని
ప్రహ్లాదుఁ డేమూడిక్కి భక్తిఁగొలిచెఁ
పరసతీమణులను భంగపఱచునిన్ను
భర్తగా నెటు రమ బడయఁగలిగె?

తే. ఎంత వెదకిన నీయందు సుంతయేని
దుర్గుణము కానిపింపదు; సకలమునులు
దేవతలు నిన్ను దేవాదిదేవుసిగను
దలఁచి సేవించుచుండిరో దైవరాయ!

నిన్నుఁ గలనైన మఱువక నీనామస్మరణము చేసినందులకిట్టిదయఁ గరుణఁ జూపింపకపోయితివి కదా! ఇఁక నెందాఁక నిన్ను వేఁడుదును! నా కేయిగతి! నన్నిప్పుడు నీవు కరుణఁజూడవేని, యీ విషము గ్రోలి ప్రాణములఁ బాసి సుఖించెదను. (విషపుగిన్నె బల్లపైఁ బెట్టి) అయ్యో! పాషాణమునకంటెఁ గఠినమైన హృదయముఁగల నీవు నేను విషముఁ ద్రాగి చచ్చెదనన్న జాలిఁబూని రక్షింపవచ్చెదవా? ఏమి నా వెఱ్ఱి!

తే. గీ. నిండుచూలాలు అర్ధాంగి నిర్మలాత్మ
యైనసీతామహాదేవి నడవి కంపి
నట్టి కఠినచిత్తునకు నాయందుఁ గరుణ
వచ్చునా! కేవలము వెఱ్ఱిభ్రాంతి గాక.

తండ్రీ! రఘునందనా! ఇదిగో నాకడసారి ప్రార్థన వినుము.

సీ. ప్రహ్లాదు నేల, స్తంభంబునం దుద్భవం
బై నట్టిమాట సత్యంబ యేని
కరినాథుఁ గావ మకరినాథునిపయికిఁ
జక్రంబు పంపుట సత్యమేని
పగవానితమ్మునిఁ బాలించి రాజుగా
సల్పినవాక్యంబు సత్యమేని
రక్షింపవేయన్న ద్రౌపదీసతికి వ
స్త్రంబు లిచ్చిననుడి సత్యమేని.

తే. గీ నేడు సంపూర్ణకృపను గాపాడి నన్నుఁ
జెరవిముక్తునిఁ జేయుచూ చేయకున్నఁ
గల్లయంచు నీదుకథ జగంబునందుఁ
జాటెదను సుమ్ము! రఘుకులసార్వభౌమ!

దేవా! ఈమాటకూడ వినుము.

సీ. పక్షపాత మిదేల రక్షింపవా నన్ను
రక్షింపకున్న నీ రమణితోడు
చెల్లింపవా? సామ్ము చెల్లింపలేకున్న
సాధ్వి మీతల్లి కౌసల్యతోడు
చెఱఁ బాపవానాకుఁ జెఱబాపఁ గనకున్న
మీతమ్ముఁడైన సౌమిత్రితోడు
యేలవా? నిజభక్తు నేలరాకున్న గు
రుండు తాపసి వసిష్ఠుండుతోడు.

తే. గీ. వేయునేటికి నానలు బెట్టినాఁడ
నీవిధంబున నింక నన్నేలరమ్ము
రావదేని విషముఁగ్రోలి ప్రాణములకు
బాసి సుఖియింతు; శ్రీరామ! భవవిరామ!

తండ్రి! నీవు రక్షించినను, రక్షింపకున్నను నిదియే సమయము. ఇఁక నే నీచెరయందుఁ గాలము గడపఁజాలను. ఎన్నిదినంబులున్నను దేహికి మరణముదుర్విషమైయున్నది. శరీరపరిత్యాగఁ మొనర్చి నీచరణసన్నిధికిఁ జేరెద. (తన్నుద్దేశించి) సకలేంద్రియములారా మీరొకిం-తయు నిటునటు సంచారముసలవక యుండుఁడు! పదునాల్గుభువనంబులను గుక్షియం దుంచుకొన్న మహాను భావుని, శరణాగతరక్షణబిరుదుఁ బూనినతండ్రిని, సకలామరముని జనవందితపదారవిందుని, లీలామానవదేహుని—నన్ను రక్షిం

పుమని నాహృదయకమలకర్ణిక మధ్యంబున నిలిపి, భక్తిం—
గొలిచి యమ్మహాత్ముఁడు రక్షింపకయున్నచోఁ బ్రాణములు
విడిచి శాశ్వత సుఖంబులందెద.

(కన్నులు మూసికొనుచున్నాఁడు.)

(శ్రీరామలక్ష్మణులు ప్రవేశించుచున్నారు.)

శ్రీరా——తమ్ముఁడా! రామదాసును జూచితివా! ఈపరమభక్తుఁడు మననిమిత్తముకదా యిట్టిదురవస్థఁబొందుచున్నాడు-అదిగో! గరళయుతమైనపాత్ర. మనము రక్షింపకయున్నచో దానిం ద్రావి ప్రాణములఁ బాయ నిశ్చయించి, యేకాగ్రచిత్తమానసుఁడై నన్ను స్మరించుచున్నాఁడు. ఇఁకనీతనిరక్షింపవలయును. (నెమ్మదిగా పాత్రయందున్న విషమును నేలపైఁబారవేసి) రామదాసా! లెమ్ము. లెమ్ము. నేను తానీషాను నీపైకమంతయు నాకు ముట్టినది. ఇదిగో రసీదు. చేకొనుము. (రసీదు రామదాసుముందుఁ బెట్టి తమ్మునితో) లక్ష్మణా! ఇఁక మన మరుగుదము. రమ్ము.

(తమ్మునితో నిష్క్రమించును.)

రామ——(కన్నులు తెఱచిచూచి తనలో) ఏమిది! నేను తానీషాను. నీపైకము ముట్టినది. రసీదందుకొనుమను పలుకు వినవచ్చినదే! ఎవరునుగనిపించరేమి; (ఎదుటనున్న పాత్రవట్టియుండుటఁజూచి) ఇదియేమి! ఇందు గరళమేమైనది! (ప్రక్కనున్న రసీదుఁగాంచి ఇదిగో! (చదివి) పైకము ముట్టినట్లు తానీషా మొహరుగలిగిన రసీదు. ఇదిమిగులవింతగనున్నది. ఈకార్యము నెవ్వరుచేసియుందురు! (ఆలోచించి) భగవంతుండగు శ్రీరామచంద్రమూర్తి కన్న నట్టి యమానుషకృత్యము లొనర్చుమహిమ మెవ్వరికి గలగును? స్వామీ! నిన్ను నేనెఱుంగలేకపోయితిని.

చ. "హరునకు నవ్విభీషణున కద్రిజకుం దిరుమంత్రనామమై
కరికి నహల్యకున్ ద్రుపదకన్యకు నార్తిహరించుచుట్టమై
పరగినయట్టి నీపతితపావననామము నాదుజిహ్వపై
తిరమున నుండఁజేయఁగదె దాశరథీ! కరుణాపయోనిధీ!

నీమహామహిమయు, మాయయు వర్ణించుటకు బ్రహ్మేంద్రాదులకైనను దరముకాదు.

కల్యాణి—రూపక తాళము.

ఏమయ్య రామ బ్ర - హ్మేంద్రాదులకు నైన-
నీమాయ దెలియవశమా॥ ఏ॥
కామాది వినుతగుణ - ధామ కువలయ దళ-
శ్యామా ననుగన్నతండ్రి రామా॥ ఏ॥
సుతుఁడనుచు దశరథుఁడు - హితుఁడనుచు సుగ్రీవుఁ
డతిబలుండనుచు గపులు
క్షితినాథుఁ డనుచు భూపతులు కొలిచిరిగాని-
పతిత పావనుఁడనుచు - మతిఁ దెలియ లేరైరి॥ ఏ॥
చెలికాఁడనుచుఁ బాండ - వులు విరోధివనుచు
నల జరాసంధాదులు కలవాఁడవని కుచేలుఁడు నెంచిరిగాని-
జలజాక్షుఁడని నిన్ను సేవింపలేరైరి॥ ఏ॥
నరుఁడని నరులు తమ - దొరవని యాదవులు
వరుఁడనుచు గోపసతులు
కరివరద భద్రాద్రి - పురనిలయ రామదాస
పరమాత్ముఁడని నిన్ను భావింపలేరైరి॥ ఏ॥

భటుఁడు—(రామదాసుని జూచి] క్యాజీ! బొమ్మన్‌సాబ్! దిల్మే భోత్ కుషీగావుంది. తుమారాహాత్ మే వుంది. అదియేమిటి మియ్యా!

రామ— ఓయీ ! సర్కారుకు నేనియ్యవలసిన పైకము ముట్టినట్లు గలేదు.

భటు—క్యా క్యా! పైకం-రశీద్—ఛే లఖరూపాయ్ సర్కారుకుతుం దియేక్యా- రసీద్—కైసీ ఆయే=తుం కబ్ దియే! నిండాహాశ్చర్యం వుంది

రామ—నేను తానీషాగారి కొసంగలేదు. నేనుఁకన్నుమూసికొని భగవద్ధ్యానముఁ జేసికొనుచుండఁగా—నేను తానీషానునీ పైకము ముట్టినది. ఇదిగో రసీదు; అనిచెప్పియిచ్చుట దానిని పెట్టినారు.

భటు—అరే సరాకు ఆయే క్యా ! ఇదర్—చెప్పవోయ్, మాకు నిద్దర్‌లో వుండామ్.

రామ—నేనును నాకన్నులతోఁ జూడలేదు.

భటు—నీకీ మంచిరోజ్ వచ్చింది. హల్లా నీయందు వుండాను.

రామ—ఓయీ! తెల్లవాఱ వచ్చుచున్నది. నన్ను స్నానమునకుఁదీసికొని పోవుదువా?

భటు—అచ్ఛా!ఆవ్. (తలుపుతీసి రామదాసుతో నిష్క్రమించును.)

రంగము:—తానీషా యంతఃపురము.

[తానీషా, భార్యయు ప్రవేశింతురు.]

భార్య—నాథా! మరల తొందరగా మేల్కొలిపితిరేమి? మరల నేదైన స్వప్నము వచ్చినదా యేమి! ఈరోజున మీకుస్వప్నముమీద స్వప్నము వచ్చుచున్నట్లున్నది.

తానీ—స్వప్నము కాదు అంతయు నిజమే.

కన్నడ—ఏకతాళము.

కలనిజమాయెనే - ఓ కలికిరోవినవే-కలనిజమాయెనే॥
కల॥ చూపున బాలులే - సొగసైనరాతులే.

రేపువరారే యోరామామణినమ్మనిది॥ ॥కల॥
నామదిలోన నరులనగానరే నేమహిలోన నెఱుఁగనివారే॥కల॥

పురుషులుచూడఁగ పురాణపురుషులే
మర్యాద లేదె మహానుభావులే॥ ॥కల॥

దాసజవానులే - జాతికబీరులే
వాసవవినుతులే - వారిజనేత్రులే ॥కల॥

భద్రాద్రివాసులే - భవ్యయశోద్భవులే
భద్రాద్రి రామదాసపాలిత చిద్విలాసులే ॥కల॥

రమణి! ఆవచ్చినది దేవాదిదేవుండగు శ్రీరామచంద్రమూర్తి యని యెఱుంగలేక పోయితిని. ద్వారతలమునఁ దలుపుగొట్టినపుడు సామాన్యులని తలంచితిని. వారిచ్చిన పైకముఁ గాంచి మోహమందితి గాని, భువనరక్షణపరాయణుఁడగు రఘునందనుఁడు లక్ష్మణునితో నిట్లు వచ్చెనని భావించి కనకాసనమిచ్చిపూజింపనైతిని. పరమభక్తాగ్రేసరుఁడగు రామదాసుని రక్షింపఁదలఁచి వచ్చినయమ్మహానుభావుల పాదములపైఁబడిరక్షింపుఁడని వేఁడుకొననైతిని. (ఇంచుకయూరకుండి) ఇఁకనైన రామదాసుని చెఱ విముక్తునిఁజేసి నాయపరాధమును సహింపుమని వేఁడుకొందుఁ గాక.

(నిష్క్రమించును.)

రంగము—చెఱసాల.

(రామదాసు ప్రవేశము.)

రామ—(శ్రీరామునుద్దేశించి) రామచంద్రప్రభో! ఆర్త రక్షణకలా ప్రవీణుడవగు నీవు నాయెడలఁ గరుణించి యీమాయయొనర్చితివి. నీమహామాయ గుర్తింపలేకపోయితిని కదా!

(తానీషా ప్రవేశించును)

తానీ—అరే! కోన్ హై!

భటు—(ప్రవేశించి) సర్కార్!

తానీ—జైల్ కా దర్వాజా జల్దీ ఖోలో; రామసేవక్ రామదాస్కూ ఛోడ్ దేతా.

భటు—(తలుపు తీయును.)

తానీ—(భటునిఁజూచి) ఓ బేడీ నికాల్ దేవ్!

భటు—(రామదాసు సంకెళ్ళు తీసి వేయును.)

తానీ—(రామదాసునిఁజూచి)

సౌరాష్ట్రి—ఆది.

రామదాసుగారూ రండీ - రసీదందుకొండి । ప్రేమమీర శ్రీరా
మలక్ష్మణులు - తామే ధనమంతయు చెల్లించిరి॥ రామ॥
ఎంతపుణ్యమతివో యీశ్రమ-నెటు సహించితివో। యింతవాఁడవని
యెఱుఁగక చేసితి-పంతముంచకుము పరమదయాళో రామ॥
తప్పులెన్నఁబోకు ఇఁకనీ-యప్పుదీరెమాకు కుప్పఁబోసి ధన॥ మప్ప
గింపకయె- తెప్పపాటునను జెప్పకపోయిరి॥ రామ
కాననైతిమున్న ఇంతటి-ఘనుఁడవనుచు మున్ను మానుచలము కృప
మదిలోనుంచి స-న్మానముగా నను మఱువక బ్రోవుము ॥రా॥
తురకజాతిగనుక నేను-తుచ్ఛబుద్ధినైతి। నరహరిభక్తుఁడవని నినుదెలి
యక - పరిపరివిధముల బాధలపఱచితి॥ రామ॥
రామదాసువనుచు దెలియక-రవ్వజేసినాఁడ-ప్రేమభద్రగిరి ధాము
లైన శ్రీరామలక్ష్మణుల కేమి కటాక్షమొ॥ రామ॥

మ. అపరాధంబు లహర్నిశంబులు మదీయంబైనదుర్బుద్ధిచే
విపరీతంబుగఁ జేసినాఁడను భవద్విఖ్యాత కారుణ్యదృష్టి

పథంబందున నన్నుఁబెట్టి యిఁక రక్షింపంగదే దేవ! నే
నపవిత్రుండఁ బవిత్రుఁజేయుము మహాత్మా! రామదాసాభిధా.

రామదాసుగారూ! నేను మీమహిమ నెఱుంగలేక నజ్ఞానాబ్ధిలోఁ బడి మిమ్ముఁ జెఱఁబెట్టి మహాపాపముఁ గట్టుకొంటిని. మీరు నన్ను క్షమించవలయును.

రామ—తానీషా! నీవెంతయు ధన్యుఁడవు. నన్నుఁ గన్నతండ్రి యగు రామచంద్రమూర్తిని గన్నులారఁ గాంచితివి. నీవు పూర్వభవంబున మహాపుణ్యముఁ జేసికొనియుండుటం జేసి శ్రీమన్నారాయణస్వరూపుం డగు రామభద్రుని దివ్యమంగళవిగ్రహసందర్శన భాగ్యము లభించినది.

మ. కలనైనన్ గన శక్తిగాదు మరి తదాకారంబు వీక్షింప, న
న్నలినప్రోద్భవముఖ్య దేవతలకైనంగాని; త్వల్లోచనో
త్పలసాఫల్యముఁ జెందఁ గాంచితివి గద్భద్రాయుతాస్యేందుమం
డలి; ధన్యుండవు నీవు భూతలమునన్ మ్లేచ్ఛవంశాగ్రణీ.

నీవుఁ గూడ నాదాశరథికి దాసుఁడవైనాఁడవు (ఇంచుకయూరకుండి) పాదుషాగారూ! పైకముముట్టినదని నన్ను రసీదు మరలపుచ్చుకొనుమని పలుకుచుంటిరే. ఇంతకుమున్న మీరిటకువచ్చిరశీదు నొసంగి వెడలితిరి గదా!

తానీ—(ఆశ్చర్యములో) ఏమీ! నేను నీకు రశీదు నొసంగియుంటినా? ఏది-ఏది!

రామ—(రశీదును చూపించును.)

తానీ—(చూచి) ఆహా! ఏమియీవింత! ఇయ్యది నేను మహానుభావులగు రామలక్ష్మణుల కొసంగినదే. ఇదియిక్కడికెట్లువచ్చినది! భగవన్మాయ వర్ణనాతీతము. (ఇంచుకయూరకుండి) రామదాసుగారూ! మీకటాక్షమున నేను శ్రీరాముని దర్శింపఁగంటిని.

రామ—భగవంతుఁడు నీయందుఁ గరుణించినాఁడు.

తానీ—

మ. అనఘా! నిన్నును రామసేవకునిఁగా నాత్మన్ విచారింపకే
ఘనకారాగృహవాసుఁ జేసి యకటా! గారించినాఁడన్ మనం
బున నాయెగ్గుల సైచి రామునిపదంబుల్ నమ్మి భద్రాద్రియం
దున నీవెప్పటిరీతినుండు మిఁక సంతోషంబు దీపింపఁగన్

నేఁటికి నీవు మహాభక్తుఁడవని తెలిసినది. నాయపరాధంబులన్నియు మఱచిపొమ్ము. శ్రీరామచంద్రుఁ డొసంగిన పైకము నీవు గైకొనుము.

రామ—పాదుషాగారూ! మీరు నాయెడలఁ జూపుచున్న పరమానురాగమునకు సంతసించితిని. కాని, యొక్కసంగతిమాత్ర మున్నది.

మ. అనఘుండా రఘురాముదివ్యచరణధ్యానంబుఁ గావించుచున్
దినముల్ బుచ్చెదఁ గాక, యేలయిపుడర్థిన్ నాకు నుద్యోగమున్
బొనఁ గూర్పంగఁదలంతు?యుష్మదియశంబున్ గూర్పునా! మోక్షమి
చ్చునె! యింకేటికి నాకు దీనిపనిసంశుద్ధాత్మ మ్లేచ్ఛాగ్రణీ!

ఇఁక నాకట్టిసుఖములతోఁ బనిలేదు. నన్ను క్షమింపుఁడు. మీరిచ్చెద నన్నపైకము శ్రీరాములకొఱకే వినియోగింపుఁడు.

తానీ—రామదాసుగారూ! మీరట్లుచెప్పవలదు. నన్ను మన్నించి మీరెప్పటివలెనే భద్రాచలమున తహశీల్ దారుగా నుండి, యాస్వామికి కైంకర్యాదిసత్కారంబులఁ జేయుచుండుఁడు. ఈపైకము మీరు గైకొనిభగవత్కార్యములకైవినియోగపఱపుఁడు. ఇదియుంగాక, భద్రాచలము శ్రీరామునకు మాన్యముగా నొసంగినాఁడను, శ్రీరామానుగ్రహమునకుఁ బాత్రుఁడవై

భద్రాద్రి యందుండి సుఖించుము. రామదాసా! ఇంక నేమి కావలయును ?

రామ.—ఇఁక గావలసిన దేమున్నది?

మ. వర భద్రాచలవాస దివ్యపదసేవాలోలురై మానవుల్
స్థిర సౌఖ్యంబులఁ గాంచి, పాపముల వాసిం బాసి, సంసార భీ
కర వారాసిఁ దరింత్రుగాక; నిజ భక్తశ్రేణినిన్ రాఘవే
శ్వరుఁ డశ్రాంతము బ్రోచుఁగాక, కరుణావ్యాపార మేపారఁగన్.

( తెర వ్రాలును. )

ఇది పంచమాంకము.

సర్వము సంపూర్ణము.

# అనుబంధములు.

## 1. వృద్ధబ్రాహ్మణుఁడు.

ఫీలు—త్రిశ్రగతి.

అనాథుఁడైతినే॥ నన్నా॥
అకట సుడివడి బడలి॥ యున్నా॥
ఏదరిఁ బొడగనిన భిక్షు। మిడువా రొకరయిన లేరె।
నాదరిద్రదశ బొడగని యాదరించువారు లే॥ రన్నా॥

## 2. దేవలుఁడు & బ్రాహ్మణుఁడు.

బ్యాగ్—ఆది.

దేవ—ఇటులతగునె విప్రవర నీకునీ। వదుకుబెదురు లేక కార్య మొన రుప ॥ని॥

బ్రాహ్మ—కటకటా నాదు గర్భశోకమా। కటజ్వాలియు చుచునుండ శ్రీరం। నీతులనుపన్యసింపనెటులోర్తు। నీతిమాలియుంటివాఇటు కఠినమతి॥

దేవ—హరహరా భగవదర్పితమే యిది। యామహాత్మునకు గానీయక నీ। వరమరనరయక భుజించినభగవ। దపచార మెటుభరియించెదమది ॥ని॥

## 3. తానీషా.

కల్యాణి—రూపక,

ఈరాజ్యభార ము। హీనకార్య ॥ఈ॥
ధారుణీజనులకు హాని। దగులకః
భరింపఁగఁ జాలయున్నను ॥నీరా॥

వయనశ్రవణములను గలిగి । నయగతిననయంబుగనుచు ।
వినుచు చారులవార్తలరయుచు । ఘనతరముగ ।
విమర్శనముగావించుచు ॥సీ॥

4 సుశీల.

నాదనామక్రియ—ఆది.

ప॥ ఎటుభరియింతురా । యేగతిరా సుత ।
అ॥ ప॥ కటకట నామది గాల్చుదుఃఖమునే॥ నెటు॥
చ॥ పటుతరాయూర్ధనయశంబులతో । వర్ధిల్లెదవని పలికినజ్యోస్యుల
పలుకులు నేటికనర్థంబులుగా । బరిణమించెనయ్యో నాహత
విధి ॥యె॥
కడుపారఁగ నినుఁగాంచి పెంచి యీ। కాలమునకు నిను గంగఁ
గలుపఁగా । గడుదయావిహీనుండయి యావిధి । ఘనతరముగ
లిఖియించెనె తనయా ॥యె॥

5. గోపన్న.

నాదనామక్రియ—ఆది.

నాదుబుణము తీరిపోయెనా । హా । హా । హా । హా । నేటికి ॥నాదు॥
ఆదయావిహీనుఁడగు విధియే । యనమరలరయక । చిఱుతనినీగతి ।
నిర్దయామతిని । నినుగొనిపోయెన । నిన్నేవిధమున । మరతుమురా
సుత ॥నా॥

6. డైలాగ్.

హిం॥ తోడి—రూపకం.

సుశీ—ఓనాథా । మీదర్శన । మగుట మాకిఁకెప్పుడుగల్గునోకదా ॥ఓ॥

కుమారుఁడు—ఓతండ్రీ । మీావర్ణన । మగుట మాకెంతో లేదు గల్గున కదా॥

రామ—రమణి । రమా । రమణునికృప । యేవాఁడుగలుగునో యవు । డమరు మనము గాంచు భాగ్యముల్ । మదిలో నీవిటు చాల । సుదతీ చిం । తిలనేల । సకలజగద్విధాయకుఁడు దశావతారములను దాల్చి । యఖిలకష్టములను గాంచె ॥

వాలస్సే—జీ - చెలో

యాఖూ—చలో - జావ్

బ్రాహ్మ—సకలభువనపాలనా । వ్రి । నన్నరామగావరా । మారాష దాసువేగ యూశానంగునూ । వం । దన । ॥ । య్యా మీాకు ॥

సుశీ—ఓ నాథా॥

---

## 7. రామదాసు.

### ఫీలు—ఆది.

ప॥ సీతా । రామస్వామి । నే । జేసిన పాపంబేమీా ॥సీ॥

చ॥ ప్రేమతో । నవరత్నంబులు చెక్కిన । హేమకిరీటంబడిగితినా । కోమలమగు నీమెడలో పుష్పపుదామమునిమ్మని యడిగితినా । కమలేక్షణ నినుసేవించుటకయి । ఘనముగరమ్మని పిలిచితిగానీ ॥ సీతా॥

---

## 8. రామదాసు.

### మధ్యమావతి—ఆది.

మామవపట్టాభిరామా । జయ । మారుతిసన్నుతనామా।మా

తరపల్లవపద । కోదండరామ ఘన । శ్యామఅవి గ్రహాంబుజనయన
ర్ణకామా । రఘురామ । కల్యాణరామచంద్ర ॥మా॥
ఛత్రచామరకరధృత । భరతలక్ష్మణ । శత్రుఘ్న విభీషణసుగ్రీ
ఖాదిసేవిత । పాత్రదశరథపుత్ర । మణికంగవల్ల్యలంకృతనవ
ంటపే । విచిత్రమణిమయ సింహాసనే । సీతయాసహాసంస్థిత
శ । పరమపవిత్ర । గురుగుహామిత్రవంశసవితృ । వంశసుధాం
ద్ర । మేదినీపాల రామచంద్ర ॥మా॥

## 9. రామదాసు.

### శ్రీరాగం—రూపకం.

భజభజమారుతినుతనామ । కోదండరామ ॥భ॥
అజరుద్రసురేశకిరీ । టాలంకృతమణిమండిత । చరణకమల
శివిభాకర శ్రీకరలోచన ॥భ॥
రణాభయశంఖచక్ర శార్ఙ్గగదాలంకృతపద । శ్రీవత్సాంకాం
। సేవిత సనకసనందన ॥భ॥

—♦—

## 10 కబీరు.

### హిం॥ తోడి—ఆది.

(25 వ పుటలో నిమ్నమిందు నప్పుడు పాడవలెను.)

రామభజనకోదియా కమలముఖ ॥రా॥
) లాకచొరసే । ఫేరేఫిరకా । సుందరనరయా కమల
॥
) ఖాయాపీయా । సుఖసేసోయా । నహింజమానాకోయా
॥రా॥

(3) జోముఖనిసదిన రామనామకే । సోముఖకుచి కమల్మముఖ ॥రా॥

(4) కహతకబీరా । సునోభై సాధూ । అయావైసా లముఖ ॥రా॥

## 1. రామదాసు.

### ఖ్యాన్—త్రిశ్రగతి.

మందరధర । మంగళకర । మంగళంబురా ।మారస త్రిరమేశబ్రోవరా । దాసభరణ । దోషహరణదానవేశన రా । శేశ్వరా । యోగపరాత్పరా । శ్రీనివాస జగదీశా । యకా । జగన్నాయకా॥